
రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ॥160/- పేజీలు:195
నవచేతన పబ్లిషింగ్ హౌస్

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

**'సాదాబైనామా' పరిశీలనకు నోటిఫికేషన్**
భూభారతి చట్టం 2025 ప్రకారం సాదాబైనామ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2020, అక్టోబర్ 12వ తేదీ నుంచి 2020 నవంబర్ 10వ వరకు నమోదైన దరఖాస్తులను పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ బుధవారం జీవో 106 జారీ చేశారు. 2024 జూన్ 2వతేదీ కంటే ముందు రిజిస్టర్ కాకుండా, 12 ఏళ్లకు పైగా ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూములపై హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్న చిన్న, మధ్య తరహా రైతులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

సంపుటి 08, సంచిక: 281 | గురువారం | 11-09-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## నేటి నుండి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

వారం రోజులు రాష్ట్ర వ్యాపితంగా ప్రదర్శనలు, సమావేశాలు

నేడు హైదరాబాద్‌లోని మఖ్దూం మొహినుద్దీన్, అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన

సెప్టెంబర్ 17న రావినారాయణరెడ్డి ఆడిటోరియంలో ముగింపు సభ

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ ఆధ్వర్యంలో నేటినుంచి ఈనెల 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నిజాం రాచరిక, భూస్వామ్య వ్యవస్థల కబంధ హస్తాల నుండి విముక్తి కల్పించేందుకు నాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో మట్టి మనుషులు చేసిన ప్రపంచ చరిత్రలోనే విశిష్టమైన మహత్తరమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఉత్సవాల ప్రారంభ సూచికగా గురువారం (నేడు) ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న మఖ్దూం మొహినుయుద్దీన్ విగ్రహం వద్ద నుండి అంబేద్కర్ విగ్రహం వరకు రెడ్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు అన్ని జిల్లాలలోని ప్రదర్శనలు, సమావేశాలతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కేంద్రాలలో ఘనంగా నిర్వహించనున్నఈ ఉత్సవాల్లో రాష్ట్ర, జిల్లా నాయకత్వం తరువాయి 2లో

## తూర్పు, ఉత్తర తెలంగాణలో 14 వరకు భారీవర్షాలు


సచివాలయం వద్ద దట్టంగా కమ్ముకున్న మబ్బులు

**హైదరాబాద్ :** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ నెల 14వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. గురు, శుక్రవారాల్లో ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. గురువారం కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. అలాగే హైదరాబాద్‌లో నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, హైదరాబాద్‌లో బుధవారం సాయంత్రం పలుచోట్ల వర్షం కురిసింది. పంజాగుట్ట, అమీర్ పేట్, కూకట్ పల్లి, సికింద్రాబాద్, బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, తార్నాక, ఎల్బీనగర్, పాతబస్తీ ప్రాంతాల్లో వర్షం పడింది. ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నగరవాసులకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో రహదారులపై తరువాయి 2లో

### పలుచోట్ల పిడుగులు : నలుగురు మృతి

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం సాయంతం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో పిడుగులు పడడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జోగులాంబ గద్వాల జిల్లా, ఖమ్మ జిల్లాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జోగులాంబ జిల్లాలో పిడుగుపడి ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఐజ మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. భూమ్‌పురం గ్రామంలో తిమ్మప్ప అనే రైతు పొలంలో సీడ్ పత్తి క్రాసింగ్ పనులకు తరువాయి 2లో

# రక్షణశాఖ భూములు బదలాయించండి



- గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 98.20 ఎకరాల భూమిని ఇవ్వండి
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'గాంధీ సరోవర్ ప్రాజెక్టు' కోసం అక్కడ ఉన్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని కేంద్ర మంత్రి అధికారిక నివాసంలో బుధవారం సమావేశమయ్యారు. మూసీ, ఇసి నదుల సంగమ స్థలంలో గాంధీ సరోవర్ ప్రాజెక్టును, అందులో భాగంగా తరువాయి 2లో



## అణచివేతపై ధిక్కార పతాక

చాకలి ఐలమ్మకు సిఎం రేవంత్ రెడ్డి ఘన నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్

అణచివేత, దమనకాండలపై ఎగిరిన ధిక్కార పతాక చాకలి ఐలమ్మ అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి చాకలి ఐలమ్మ చిత్రపటానికి తరువాయి 2లో

## భారత్- అమెరికా వాణిజ్య సంప్రదింపులు

- ఆటంకాలు తొలగించడం కష్టంకాదు : ట్రంప్
- ప్రియనేస్తం మోదీ కోసం వేచిచూస్తున్నా


(ఫైల్ ఫొటో)

**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్‌–అమెరికామధ్య వాణిజ్య సంప్రదింపులు కొనసాగుతాయని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. చర్చల్లో నెలకున్న ఆటంకాలు తొలగించుకోవడం పెద్దకష్టమైన పనేమీ కాదని రాబోయే వారాల్లో తన ప్రియమిత్రుడు ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలిసి సంభాషించేందుకు తాను ఎంతగానో ఎదురుచూస్తున్నానని చెప్పారు. ఈ ప్రకటన ద్వారా రెండు దేశాలమధ్య వాణిజ్య ఆటంకాలు మెల్లిగా తొలగిపోతున్నాయని ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. వాణిజ్య చర్చలను విజయవంతంగా ముగించేందుకు ఆటంకాలు తొలగించడం పెద్దకష్టం కాదని తాను రూఢీగా తరువాయి 2లో

## వాణిజ్య చర్చలు ముగించేందుకు కలిసి పనిచేస్తాం

ట్రంప్‌తో మాట్లాడేందుకు నేనూ ఎదురుచూస్తున్నా : మోదీ

**న్యూఢిల్లీ:** తన ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ చేసిన పోస్టింగ్‌పై ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొద్దిగంటలకే స్పందించారు. ట్రంప్‌ను కలిసి మాట్లాడేందుకు తాను కూడా ఎదురుచూస్తున్నానని ఎక్స్ వేదికగా ప్రతిస్పందించారు. వీలైనంత తొందరగా వాణిజ్యచర్చలను ముగించేందుకు రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. భారత్‌–అమెరికాలు సన్నిహిత మిత్రదేశాలు, సహజసిద్ధమైన భాగస్వాములు, రెండు దేశాలూ కలిసి త్వరగా చర్చలు పూర్తిచేద్దాం అని పేర్కొన్నారు. నిర్ణీత ప్రకారం జరగాల్సిన చర్చలు అర్థాంతరంగా నిలిచిపోవడం, షాంఘై సహకార సదస్సు రజతోత్సవ సదస్సులో పరిణామాల తర్వాత మళ్ళీ తరువాయి 2లో




# ఉద్యమ నేత సురవరం

**ప్రజల హక్కులకోసం నిరంతరం పోరాడిన కమ్యూనిస్టు మేధావి**

- సంస్మరణ సభలో వక్తల ఉద్ఘాటన
- సుధాకర్ రెడ్డి నేటితరానికి ఆదర్శప్రాయుడు : సుఖేందర్ రెడ్డి
- నల్లగొండ జిల్లా కేంద్రంలో విగ్రహం నెలకొల్పేందుకు కృషి : మంత్రి కోమటిరెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ

ప్రజల హక్కుల కోసం నిరంతరం అనేక పోరాటాలు నిర్వహించిన ప్రజా ఉద్యమ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ జీఎల్ గార్డెన్ లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణానికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై నల్లగొండ పార్లమెంటు సభ్యులుగా రెండుసార్లు ఎన్నికయ్యారని, తాము ఇద్దరం వేరువేరు పార్టీల నుండి పోటీ చేశామనీ, కానీ ఏనాడూ వ్యక్తిగత విమర్శ చేసుకోలేదని గుర్తు చేశారు. ఫ్లోరైడ్ ప్రాంతమైన నల్లగొండ జిల్లాలకు సాగు తగునీరు సాధించేందుకు తరువాయి 12లో

## నేపాల్ పరిణామాల పట్ల సిపిఐ ఆందోళన

యువత ఆగ్రహాన్ని గుర్తించాలి

మితవాదశక్తుల వైపు మళ్ళొద్దు

పరిస్థితికి కమ్యూనిస్టుల విభేదాలు కూడా కారణమే

వారి మధ్య సూత్రప్రాయ ఐక్యత పునరద్ధరణ జరగాలి

**న్యూఢిల్లీ :** నేపాల్‌లో జరుగుతున్న పరిణామాలపై భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం బుధవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. ''నేపాల్ వేగంగా అరాచక స్థితిలోకి జారిపోతోంది. ప్రజలలో, ముఖ్యంగా జెన్ జెడ్ యువతలో, స్వేచ్ఛను అణచివేసే సమస్యలపై, వ్యక్తీకరణ, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లపై ఆంక్షలు, అవినీతిపై స్పష్టమైన ఆగ్రహం ఉంది. ఈ ఆగ్రహాన్ని గుర్తించాల్సిందే. అయితే పార్లమెంటు భవనాన్ని, నివాసాలకు తగులబెట్టడం, అధ్యక్షుడు, సీనియర్ మంత్రులు, మాజీ ప్రధాని భార్య హత్య, ప్రజా ఆస్తులు, కమ్యూనిస్టు, ఇతర రాజకీయ పార్టీల కార్యాలయాలపై హింసాత్మక దాడులు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇటువంటి పరిణామాలు నిరసనలు అరాచకంగా మారడాన్ని సూచిస్తున్నాయి. ప్రజాస్వామ్య పోరాట పద్ధతులను తరువాయి 2లో

## ప్రాసిక్యూషన్‌కు అనుమతి.. కేబినెట్ సలహాకు గవర్నర్ కట్టుబడాలి

'సుప్రీం'కు తెలంగాణ ప్రభుత్వం వెల్లడి

సర్కారు తరపున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వకేట్ నిరంజన్‌రెడ్డి


**న్యూఢిల్లీ :** ఒక మంత్రి లేదా ముఖ్యమంత్రి క్రిమినల్ కేసులో చిక్కుకున్న సందర్భం తప్ప, ప్రాసిక్యూషన్ అనుమతి మంజూరు చేసే విషయంలో కూడా గవర్నర్ సాధారణంగా మంత్రి మండలి సహాయం లేదా సలహాకు కట్టుబడి ఉంటారని బుధవారం తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వివరించింది. ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి నేతృత్వం వహించిన సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ముందు తెలంగాణ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి తరువాయి 12లో

# నేపాల్‌లో ఆర్మీ నిషేధాజ్ఞలు

హింస, దాడులకు పాల్పడితే కఠినచర్యలు

ఎవ్వరూ ఇళ్ళలోంచి బయటకు రావొద్దని హెచ్చరిక

సైనిక కేంద్ర కార్యాలయంలో ఓలి!




**ఖాట్మండు:** రాజకీయ సంక్షోభం మధ్య అనిశ్చితిలో కూరుకుపోయిన నేపాల్‌లో నిరసనలపేరుతో హింసాత్మక ఘటనలు చెలరేగకుండా కర్ఫ్యూకు కొనసాగింపుగా మూడోరోజు బుధవారం సైన్యం నిషేధాజ్ఞలు విధించింది. ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఐదు గంటలవరకూ ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయి. దేశవ్యాప్తంగా భద్రతా కార్యకలాపాలను సైన్యం తన నియంత్రణలోకి తీసుకుంది. సైన్యం పహారాలో విషాదకరమైన శ్మశానశాంతి నెలకుంది.హింసాత్మక ఘటనలు, గృహదహనాలు, అల్లర్లు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం, గాయపరచడం, అత్యాచార బెదిరింపులు, వ్యక్తులపై దాడులు వంటి అన్ని చర్యలను నేరాలుగా పరిగణిస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని సైన్యం ఒక ప్రకటనలో తెలియజేసింది. గురువారం వరకూ కర్ఫ్యూ దేశంలో అమలులో ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులను అవకాశంగా తీసుకుని వ్యక్తులకు హానికలిగించే చర్యలకు కొన్ని గ్రూపులు పాల్పడే అవకాశం ఉందని, అందువల్ల అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు మరో ప్రకటనలో సైన్యం హెచ్చరించింది. లూటీలు, విద్వేష వ్యాప్తి చర్యలను సహించబోమని అణచివేస్తామని తెలిపింది. నేపాల్‌లో ఉన్న విదేశీయులు సమీపంలో ఉన్న సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని కోరింది. రహదారులపై సైన్యం పెద్దసంఖ్యలో గస్తీ నిర్వహిస్తోంది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ ప్రధాన విమానాశ్రయాలు మూసే ఉంచుతారు. దాడుల్లో ఇప్పటివరకూ రూ.3.37 లక్షల నగదు, మరో 31 మారణ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తరువాయి 12లో

## 12న ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం



**న్యూఢిల్లీ :** భారత 15వ ఉపరాష్ట్రపతిగా సి.పి. రాధాకృష్ణన్ ఎన్నికను ఎన్నికల కమిషన్ బుధవారం ధృవీకరించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ , ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, ఎస్.ఎస్.ఎస్ సంధు ఎన్నికల ధృవీకరణ పత్రంపై సంతకం చేశారు. ఆ తర్వాత సంతకం చేసిన కాపీని డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాష్ ఏతురు, కార్యదర్శి సుమన్ కుమార్ దాస్ కేంద్ర హోం కార్యదర్శికి అందజేశారు. దీనిని కొత్త ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారోత్సవ తరువాయి 2లో

చలో చండీఘడ్


భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21-25 సెప్టెంబర్, 1925
చండీఘడ్ (పంజాబ్)

సిపిఐ చీలిక దిశలో.. ఆరవ కాంగ్రెస్ – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## రష్యా డ్రోన్లు కూల్చివేసిన పోలెండ్
### సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించారని మండిపాటు

**వార్సా:** ఉక్రేన్‌పై దాడుల సందర్భంగా ప్రయోగించిన డ్రోన్లు పెద్దసంఖ్యలో పోలెండ్‌లోకి దూసుకు వెళ్ళడంతో ఆ దేశ సైన్యం రష్యా డ్రోన్లను కూల్చివేసింది. ఉక్రేన్ సరిహద్దులోనే పోలెండ్ దేశం ఉంది. ఉక్రేన్ సెంట్రల్, వెస్టర్న్ ప్రాంతాలపై దాడుల సందర్భంగా రష్యా ప్రయోగించిన డ్రోన్లు పోలెండ్‌లోకి వెళ్ళాయి. ఉక్రేన్‌పై రష్యా తాజాగా 450 డ్రోన్లు, మరో 40 క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో ముగ్గురు ఉక్రేనియన్లు గాయపడ్డారు. ఒక కర్మాగారం ధ్వంసమైంది. జైటోమైర్,విన్నిసియా ప్రాంతాలలో తీవ్ర నష్టం జరిగింది. రష్యా డ్రోన్ల దాడితో తమ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించి దేశంలోకి చొరబడిందని పోలెండ్ ప్రభుత్వం విమర్శించింది. ఈ విధమైన దాడులను సహించబోమని హెచ్చరించింది. రష్యా డ్రోన్లు పోలెండ్‌లోకి ప్రవేశించడంతో కొద్దిగంటలసేపు విమానాశ్రయాల నుండి రాకపోకలను ప్రభుత్వం నిలిపివేసింది. పరిస్థితి చక్కబడిన తర్వాత వాటిని పునరుద్ధరించింది. ఉక్రేన్ సరిహద్దు ప్రాంతాలలో ఉన్న పోలెండ్ గ్రామాల ప్రజలు ఇళ్ళలోంచి బయటకు రావొద్దని ముందు జాగ్రత్తలు జారీ చేసింది.

# దోహాలో దాడులకు పూర్తి బాధ్యత నాదే
## ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ



**జెరూసలెం :** ఖతార్ రాజధాని దోహాలో హమాస్ అగ్ర నాయకత్వ సమావేశ భవనంపై దాడులకు పూర్తి బాధ్యత నాదేనని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించారు. దోహాపై దాడులు చేయాలని తాను స్వతంత్ర నిర్ణయం తీసుకుని సైన్యానికి ఆదేశాలు జారీ చేశానని వివరణ ఇచ్చారు. దోహాలో దాడుల విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ముందుగానే తెలియజేశామని ఇజ్రాయెల్ అధికారులు దాడుల అనంతరం తెలియజేయడం, దోహాలో దాడులు ప్రారంభమైన పది నిమిషాల తర్వాత ఈ విషయాన్ని ఖతార్ ప్రభుత్వానికి అమెరికా ప్రభుత్వ యంత్రాంగం తెలియజేయడం, ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్ చర్యలపట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమతున్న పరిణామాల పూర్వరంగంలో నెతన్యాహూ బుధవారం పైవిధంగా స్పందించారు. ప్రపంచంలో ఎక్కడా హమాస్ ఉగ్రవాదులకు స్వేచ్ఛగా సంచరించే అవకాశం ఉండకూడదని, ఒక చోట దాడులుచేస్తూ, మరోచోట వారు సురక్షితంగా ఎంజాయ్ చేస్తే సహించేదిలేదని నెతన్యాహూ అన్నారు. 2023 అక్టోబరు ఏడో తేదీన ఇజ్రాయెల్‌లో జరుగుతున్న ఒక సంగీత ఉత్సవంపై హమాస్ ఉగ్రవాదులు భారీసంఖ్యలో సామూహిక కాల్పుల దాడి చేశారు. ఈ దాడుల్లో 1200 మంది అక్కడికక్కడే మరణించగా మరో 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. ఈ దాడి కుట్రకు వ్యూహరచన చేయడంలో భాగం పంచుకున్న హమాస్ నాయకులు దోహా సమావేశంలో పాల్గొన్నారని, వారు ఎంతటివారైనా హతమార్చడం తమ లక్ష్యమని ఇజ్రాయెల్ పేర్కొంది. ఈ దాడుల తీవ్రతవల్ల హమాస్ అగ్రనాయకులలో కొందరు హతులై ఉండే అవకాశం ఉందని తాము బలంగా విశ్వసిస్తున్నామని ఐడిఎఫ్ బుధవారం నాడు మరోసారి ఉద్ఘాటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తుల ద్వారా ప్రతిపాదించిన తాజా శాంతి ఒప్పంద ప్రతిపాదనపై చర్చించేందుకు హమాస్ అగ్రనాయకత్వం మంగళవారం దోహాలోని కేంద్ర కార్యాలయంలో సమావేశమైంది. ఈ సమాచారం తెలుసుకున్న ఇజ్రాయెల్ సైనికదళం (ఐడిఎఫ్) నెతన్యాహూ పచ్చజెండా ఊపడంతో దోహానగరంలో అనేకచోట్ల సందేహం ఉన్న ప్రాంతాలలో బాంబుదాడులు చేసింది. ఐతే హమాస్ అగ్రనాయకత్వ సమావేశ భవనం వద్ద కూడా ఈ పేలుళ్ళు సంభవించాయి. హమాస్ అగ్రనాయకత్వం సురక్షితంగా ఉందని ఆ సంస్థ వర్గాలు ప్రకటించాయి. ''హమాస్ అగ్రనాయకత్వాన్ని వేటాడి చంపేందుకు ఇజ్రాయెల్ సర్వస్వతంత్రంగా ఈ నిర్ణయం తీసుకుని ఈ దాడులు చేసింది, ఇందుకు తమదే పూర్తి బాధ్యత'' అని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. ఖతార్ నగరం దోహాలో ఏ ప్రాంతంలో ఈ దాడులు జరిగాయన్న విషయాన్ని మాత్రం ఇంతవరకూ ఏ రూపేణా ఇజ్రాయెల్ గానీ, ఖతార్ ప్రభుత్వంగానీ బహిర్గం చేయలేదు.

### ఖతార్ మా ప్రియమిత్రదేశం
## దోహాపై దాడి నిర్ణయం నాది కాదు



**వాషింగ్టన్ :** దోహాలో దాడులు చేయాలన్న నిర్ణయం తనది కాదని, తనకు ఈ నిర్ణయంతో ఎలాంటి సంబంధం లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఖతార్ తమ ప్రియ మిత్రదేశమని ఆయన ఉద్ఘాటించారు. తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా బుధవారం ఒక ప్రకటన చేస్తూ, ఖతార్‌లో దాడుల నిర్ణయం తనది కాదని, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ సర్వస్వతంత్రంగా ఈ నిర్ణయం తీసుకున్నారని వివరణ ఇచ్చారు. ''ఖతార్‌లో దాడులు చాలా దురదృష్టకరం, ఈ దాడులతో నేను తీవ్ర అసంతృప్తికి గురయ్యాను, దాడులను అడ్డుకోలేకపోయాం, వాటిని ఆపడంలో జాప్యం జరిగింది'' అని పేర్కొన్నారు. ఐతే దాడులకు ముందు ఇజ్రాయెల్ ఆ విషయాన్ని తెలియజేసిందని వైట్‌హౌస్ వర్గాలు మంగళవారం చేసిన ప్రకటనకు ట్రంప్ ప్రకటనకు ఎక్కడా పొంతన కుదరడంలేదు.
కాగా, ఖతార్‌పై దాడి చేయాలని ఇజ్రాయెల్ తీసుకున్న నిర్ణయాన్ని ట్రంప్ యంత్రాంగం తీవ్రంగా తప్పుపట్టిందని, తీవ్రంగా వ్యతిరేకించిందని సిఎన్‌బిసి వార్తాసంస్థ బుధవారం ప్రకటించింది. మరోవైపు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కోరోలిన్ లియావిట్ మీడియాతో మాట్లాడుతూ, ఖతార్ దేశం అమెరికాకు ఎంతో ప్రియమైన మిత్రదేశమని అన్నారు. పైగా ఇజ్రాయెల్–హమాస్ మధ్య సయోధ్య కుదిర్చి గాజాలో యుద్ధం ఆగిపోయేందుకు మధ్యవర్తిత్వం వహించి ఎంతో గొప్పకృషి చేస్తోందని, ఈ దాడులకు అమెరికా అనుమతి ఇవ్వబోదని, ఇది పూర్తిగా ఇజ్రాయెల్ సర్వస్వతంత్రంగా తీసుకున్న నిర్ణయమని చెప్పారు. దోహాలో దాడులు జరిగిన తర్వాతే పెంటగాన్‌లోని సైనికకేంద్రం అధ్యక్షుడు ట్రంప్‌కు ఈ విషయాన్ని తెలియజేసిందని లియోవిట్ వివరణ ఇచ్చారు. ఖతార్‌లో అతి పెద్ద సైనిక కేంద్రాన్ని నిర్వహిస్తున్న అమెరికా సైనికదళానికి ఇజ్రాయెల్ ముందుగానే సమాచారం తెలియజేసి ఉండొచ్చుకదా? లేక ఇతర మార్గాల ద్వారా అమెరికా సైన్యానికి దాడుల గురించి తెలిసే అవకాశం లేకపోలేదుకదా? అని మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు లియావిట్ తిరస్కరించారు. ఖతార్‌లో దాడులు జరుగుతున్నాయని అమెరికా సైన్యం ద్వారా తెలియగానే ఈ విషయం వెంటనే ఖతార్ నాయకులకు చెప్పాలని ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్‌కు ట్రంప్ ఆదేశించారని లియావిట్ చెప్పారు.

## ఇది ఇజ్రాయెల్ ఉగ్రవాదం : ఖతార్ ప్రధాని
### సార్వభౌమాధికార ఉల్లంఘన సహించబోం
### మధ్యవర్తిత్వం ఆపేదిలేదు



**దోహా :** రాజధాని దోహాలోని కొన్ని ప్రాంతాలలో హమాస్ అగ్రనాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేయడాన్ని ఖతార్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది ప్రభుత్వంచేసే ఉగ్రవాదమని ఖతార్ జాతీయ భద్రతను బలహీనపరచే చర్యలని ఆ దేశ ప్రధానమంత్రి, విదేశాంగమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్‌బిన్ జెస్సిమ్ తహనీ విమర్శించారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఈ ఉల్లంఘనపై న్యాయపరమైన చర్యలకు వివిధశాఖలు కృషి చేస్తాయని చెప్పారు. తమ దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేందుకు ఎలాంటి చర్యలకు పాల్పడినా సహించేదిలేదని ఇజ్రాయెల్‌కు తహనీ హెచ్చరిక చేశారు. ఇజ్రాయెల్ దాడులపై సమగ్ర ప్రతిస్పందన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా దాడిచేస్తే ఆ దాడులను తిప్పికొట్టేందుకు ఉన్న అంతర్జాతీయ హక్కును తాము నిలబెట్టుకుంటామని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా గట్టిగా స్పందిస్తామని, కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఐతే గాజాలో యుద్ధం నివారించి శాంతి సాధించేందుకు హమాస్‌తో చర్చలు జరుపుతున్న ఖతార్, ప్రస్తుతం కొనసాగుతున్న శాంతి యత్నాల కృషి నుండి వెనక్కుమళ్ళబోమని, యుద్ధం ముగించేందుకు మధ్యవర్తిత్వం కొనసాగిస్తామని ప్రకటించింది. దోహాలో దాడులకు ముందే అమెరికా తమను అప్రమత్తం చేసిందని వచ్చిన వార్తలు తప్పుడు వార్తలని ఖతార్ విదేశీమంత్రిత్వశాఖ తిరస్కరించింది. ఒకవైపు ఖతార్‌లో బాంబుదాడుల శబ్దాలు వినిపిస్తున్న సమయంలో తమకు అమెరికా నుండి ఫోన్‌కాల్ వచ్చిందని ఖతార్ ప్రధానమంత్రి సలహాదారు మాజెద్ అల్ అన్సారీ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన తాజా శాంతి ఒప్పంద ప్రతిపాదనపై చర్చించేందుకు హమాస్ అగ్రనాయకత్వం మంగళవారం దోహాలో సమావేశం కావడంతో వారిని మట్టుబెట్టేందుకు ఇజ్రాయెల్ సైన్యం బాంబుదాడులు ప్రారంభించింది. ఒకవైపు బాంబుదాడులు జరుగుతున్నప్పటికీ మరోవైపు దోహాలో విమానాల రాకపోకలు, ల్యాండింగ్, కార్యకలాపాలు యధేచ్ఛగా కొనసాగాయి.

**రష్యా, చైనా సహా పలు దేశాల ఖండన**

దోహాలో ఇజ్రాయెల్ సైన్యం బాంబు దాడులను రష్యా, చైనా ప్రభుత్వాలు సహా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ కూడా ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. దేశాల సార్వభౌమాధికారాలను హరించేందుకు ఎవ్వరికీ హక్కులేదని విమర్శించారు. ఈ ఘటనపై ఒక అత్యవసర సమావేశం నిర్వహిస్తామన్నారు. చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ బీజింగ్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఖతార్ జాతీయ భద్రతను, సార్వభౌమాధికారాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని విమర్శించారు. ఈ ప్రాంతీయ ఉద్రిక్తతలు తదుపరి మరింత పెరిగిపోయే ప్రమాదం ఉందని చైనా తీవ్ర ఆందోళన చెందుతోందని అన్నారు.

## క్యాష్ అవార్డ్‌గా ఇవ్వాలి
### ఆర్‌టిసి ఇయు ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి సంస్థ తరహా దసరా పండుగ సందర్భంగా ఆర్‌టిసి సంస్థ కార్మికులకు సంస్థకు వచ్చే లాభాలలో అన్ని కేటగిరీలలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఒక నెల జీతం క్యాష్ అవార్డ్‌గా ఇవ్వాలని టిజిఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి సిబ్బంది సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు నిత్యం కష్టపడ్డారని, అంకితభావంతో పని చేశారని, ఎన్నో ఇబ్బందులను తట్టుకొని మహాలక్ష్మి పథకాన్ని తమ భుజస్కంధాలపైన వేసుకుని విజయవంతం చేశారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–2025 సంవత్సరం వరకు రూ.200 కోట్లు జీరో టికెట్లు జారీ అయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులందరూ సంబురాలు చేసుకున్నారని, జీరో టికెట్ల ద్వారా ఆర్‌టిసికి రూ.6,680 కోట్ల ఆదాయం సమకూరిందని వారు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం సింగరేణి కాలరీస్ లాభాల నుండి అందులో పని చేసే ఉద్యోగులకు వాటా కింద దసరా, దీపావళి పండుగలకు లక్షలాది రూపాయలు ఇస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అతి ముఖ్యమైన దసరా పండుగకు ఆర్‌టిసి ఉద్యోగులకు లాభాలలో వాటా కింద ఒక నెల జీతాన్ని ఇచ్చి ఆర్‌టిసి కార్మికులు కూడా తమ కుటుంబ సభ్యులతో సంబురాలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఈదురు వెంకన్న ముఖ్యమంత్రిని కోరారు.

## వాణిజ్య సంప్రదింపులు
(మొదటి పేజీ తరువాయి)

విశ్వసిస్తున్నానని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ''భారత్–అమెరికా రెండు దేశాలూ వాణిజ్య చర్చలు కొనసాగిస్తాయని ప్రకటించడానికి నేనెంతో సంతోషపడుతున్నా, రెండు దేశాలమధ్యా ఏర్పడిన ఆటంకాలను పరిష్కరించుకోవడానికి సంప్రదింపులు కొనసాగుతాయి, నా ప్రియనేస్తం, ప్రధానమంత్రి మోదీని రాబోయే వారల్లో కలిసి మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా, వాణిజ్యచర్చలను విజయవంతంగా ముగించడం కష్టంకాదు, అమెరికా–భారత్ రెండూ గొప్ప దేశాలే'' అన్నారు. ఆ తర్వాత మోదీ కూడా ఎక్స్ వేదికగా సానుకూలంగా స్పందించారు. మోదీ స్పందనను కూడా ట్రంప్ మళ్ళీ తన సోషల్ మీడియా వేదికపై పోస్టు చేశారు. రష్యా నుండి ముడి చమురు భారత్ కొనుగోలు చేయడంవల్లనే పరోక్షంగా ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగుతోందని ట్రంప్ వివాదానికి తెరలేపడంతో గడచిన రెండు దశాబ్దాలలో ఎన్నడూలేనంత తీవ్రస్థాయిలో రెండు దేశాలమధ్యా సంబంధాలలో ఉద్రిక్తతలు నెలకున్నాయి. ఆ తర్వాత ఆయన భారత్‌పై 50 శాతం భారీ సుంకాలు వసూలు చేయడం ప్రారంభించారు. ఈ చర్య అన్యాయం, చట్టవిరుద్ధం,హేతుబద్ధంకాదని భారత్ ఖండించింది. షాంఘై సహకార సంస్థ సదస్సుపూర్తయిన నాలుగురోజులకు ఈనెల మొదటివారంలో ట్రంప్ మళ్ళీ మొదటిసారి సానుకూలంగా స్పందించారు. తాను ఎప్పుడూ మోదీతో స్నేహంగానే ఉంటానని, ఆయన గొప్ప ప్రధానమంత్రి అని అన్నారు. దీనిపై మోదీ మరునాడే ఆరోతేదీన స్పందిస్తూ, రెండు దేశాల సంబంధాలపట్ల ట్రంప్ సానుకూల విశ్లేషణను తాను మనఃస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఆ తర్వాత ఇప్పుడు రెండోసారి కూడా ట్రంప్ సానుకూలంగా స్పందించారు.

## కలిసి పనిచేస్తాం
(మొదటి పేజీ తరువాయి)

మొదటిసారి వాణిజ్య చర్చల పునరుద్ధరణకు ట్రంప్ బుధవారం భారత్‌కు సోషల్ మీడియా ద్వారా సంకేతాలు పంపారు. చర్చల పునరుద్ధరణకు ట్రంప్ పంపిన సానుకూల విశ్లేషణపై మోదీ స్పందిస్తూ, రెండుదేశాలమధ్యా తిరిగి అపరిమితమైన వాణిజ్య భాగస్వామ్య సామర్థ్యానికి ఈ చర్చల ముగింపు మార్గం సుగమం చేస్తాయన్నారు. ప్రపంచంలో ఏ దేశంపైనా విధంచనంత భారీగా 50 శాతం సుంకాలు విధించిన తర్వాత అమెరికా–భారత్ సంబంధాలు తిరోగమనంలోకి వెళ్ళాయి. గడచిన 12 రోజులుగా జరిగిన పరిణామాల నేపథ్యంలో భారత్‌తో అమెరికా సంబంధాల గురించి సానుకూల ప్రకటన చేయడం ఇది రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ప్రశంసించడంతోపాటు భారత్‌తో అమెరికాకు దీర్ఘకాలిక బంధం ఉందని ఆయన అన్నారు.

## అవయవ మార్పిడి సర్జరీలను ప్రోత్సహించేందుకు చర్యలు
### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఆస్పత్రులలో అవయవ మార్పిడి సర్జరీలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. జీవన్‌దాన్ పనితీరు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సలను ప్రోత్సహించేందుకు తీసు కోవాల్సిన చర్యలపై హైదరాబాద్, జూబ్లిహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్స్, గాంధీ, ఉస్మానియాతో పాటు ఆదిలాబాద్ రిమ్స్, వరంగల్ ఎంజిఎంలోనూ అవయవమార్పిడి సర్జరీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని, సీనియర్ డాక్టర్లతో డెడికేటెడ్ టీమ్స్‌ను ఏర్పాటు చేయాలని, ఒక్కో ఆర్గాన్‌కు ఒక్కో టీమ్ ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తుకు మంత్రి సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అవయవమార్పిడి సర్జరీలను ప్రోత్సహించే విధంగా ఈ బృందాలు పనిచేయాలన్నారు. ఇటీవల కేంద్ర చట్టాన్ని అడాప్ట్ చేసుకున్నందున దీనికి సంబంధించిన కొత్త నిబంధనల రూపకల్పనపై ఈ సమావేశంలో చర్చించారు. నూతన చట్టం ప్రకారం సొంత కుటుంబ సభ్యులతో పాటు, గ్రాండ్ పేరెంట్స్ కూడా అవయవాలు డొనేట్ చేసేందుకు, స్వీకరించేందుకు అర్హులేనని అధికారులు తెలిపారు. ఆర్గాన్ స్వాపింగ్‌కు కూడా అవకాశం కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు. దీని ప్రకారం ఇరువురు పేషెంట్ల కుటుంబ సభ్యులు ఒకరికొకరు అవయవమార్పిడి చేసుకునే వెసులుబాటు ఉంటుందని, స్వాపింగ్ విషయంలో ఇతర రాష్ట్రాలు అవలంభిస్తున్న నిబంధనలను పరిశీలించి, బాధితులను ఆదుకునే విధంగా నిబంధనలను రూపొందించాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జీవన్‌దాన్ కోఆర్డినేటర్, డాక్టర్ భూషన్‌రాజుకు సూచించారు.ఇందుకు ప్రజా ప్రతినిధులు, ప్రముఖుల సహకారం తీసుకోవాలన్నారు. అవయవదానం చేసే కుటుంబ సభ్యులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలను ఇతరులకు డొనేట్ చేసి ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబాలను అందరూ అభినందించాలని చెప్పారు. అవయవదానం చేసిన వారి దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించడంతో పాటు, వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిల్స్‌లో జరుగుతున్న అవయవమార్పిడి సర్జరీలపై నిరంతరం నిఘా పెట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే హాస్పిటల్స్ పట్ల కఠినంగా వ్యవహరించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.



## బదలాయించండి
(మొదటి పేజీ తరువాయి)

'గాంధీసర్కిల్ ఆఫ్ యూనిటీ' నిర్మాణం చేపడతామని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. ఈ రెండు నదుల సంగమ స్థలంలో ఉన్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రిని సిఎం కోరారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్, ఘాట్లు, శాంతి విగ్రహం మ్యూజియం నిర్మిస్తామని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. సమావేశంలో ఎంపిలు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.వి.నరసింహారెడ్డి, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## 14 వరకు భారీవర్షాలు
(మొదటి పేజీ తరువాయి)

వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షానికి డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. చేవెళ్ల పట్టణ కేంద్రంలో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారింది. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను వరద ముంచెత్తి ఆవరణ మొత్తం వర్షపునీళ్లు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు ఇంటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అలాగే యూసఫ్‌గూడ, మధురానగర్, అమీర్‌పేట్, ఎస్‌ఆర్ నగర్, ఎర్రగడ్డ, సనత్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. సైదాబాద్, సరూర్‌నగర్, సంతోష్‌నగర్, పాతబస్తీ, బహదూర్ పుర, కిషన్ బాగ్, పురానపుల్, జూ పార్క్, మెహదీపట్నం, రేతి బౌలి, ఖైరతాబాద్, పంజాగుట్ట, మలక్‌పేట, కుత్బుల్లాపూర్, కొంపల్లి, సుచిత్ర, గుండ్లపోచంపల్లి, జీడిమెట్ల, సూరారం, జగద్గిరిగుట్ట, నాగారం ప్రాంతాల్లో వర్షం పడుతోంది. ఈ వర్షంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## పోరాట వారోత్సవాలు
(మొదటి పేజీ తరువాయి)

పాల్గొటుందన్నారు. ఈనెల 17వ తేదీన ముగింపు ఉత్సవాలను హైదరాబాద్‌లోని రావి నారాయణ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు సాంబశివరావు వెల్లడించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎలాంటి పాత్ర, చరిత్ర లేని బిజెపి దుష్ప్రచారం చేస్తూ, పోరాట చరిత్రను వక్రీకరిస్తుందన్నారు. బిజెపి చేస్తున్న దుష్టపన్నాగాలను ఎండగడుతూ రాష్ట్ర వ్యాపితంగా పార్టీ శ్రేణులు సాధ్యమైన చోట్ల సభలు, సదస్సులు, సెమినార్లు పార్టీ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. తెలంగాణ మాతృభూమి స్వాతంత్ర్యం కోసం జరిపిన ఈ సమరంలో నాలుగున్నర వేల మంది అసవులు బాసారాని గుర్తు చేశారు. వారోత్సవాల సందర్భంగా నాటి ఘన చరిత్రను మననం చేసుకోని స్ఫూర్తి పొందడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని సాంబశివరావు పేర్కొన్నారు.

## అణచివేతపై ధిక్కార పతాక
(మొదటి పేజీ తరువాయి)

పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ గడ్డపై దొరల అహంకారానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 80 ఏళ్ల కిందనే జంగ్ సైరన్ ఊదిన యోధురాలు ఐలమ్మ అని సిఎం కొనియాడారు. సమ్మక్క, సారక్క, చాకలి ఐలమ్మల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని సిఎం గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిలు పోరిక బలరామ్ నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

## రాధాకృష్ణన్ ప్రమాణం
(మొదటి పేజీ తరువాయి)

సమయంలో చదువుతారని ఇసి పేర్కొంది. కాగా, రాధాకృష్ణన్‌తో శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 12న రాష్ట్రపతి భవన్‌లో జరిగే అధికారిక కార్యక్రమంలో రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు వారు తెలిపారు. మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో 67 ఏళ్ల రాధాకృష్ణన్ 152 ఓట్ల తేడాతో ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డిపై విజయం సాధించారు. ఆరోగ్య కారణాల వల్ల జులై 21న జగదీప్ ధన్‌ఖడ్ ఆ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది.

## కామారెడ్డి బిసి డిక్లరేషన్ విజయోత్సవ సభకు కదలి రావాలి
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న కామారెడ్డి బిసి డిక్లరేషన్ విజయోత్సవ సభచరిత్రలో నిలిచేలా బిసి సోదరులు, కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంఎల్‌ఎలు, కార్పొరేషన్ చైర్మన్లు కాంగ్రెస్ ముఖ్య నేతలతో జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం హైదరాబాద్ టూరిజం ప్లాజా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 15 వ తేదీన కామారెడ్డి లో జరిగే బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని సూచించారు. బిసి డిక్లరేషన్ విజయోత్సవ సభ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం బిసి సామాజిక వర్గం అభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో మంత్రి తుమ్మల కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

## పిడుగుల వర్షం : నలుగురు మృతి
(మొదటి పేజీ తరువాయి)

ఏడుగురు కూలీలు వెళ్లారు. సాయంత్రం వర్షం కురయడంతో కూలీలు అందరూ పొలంలో ఉన్న వేప చెట్టు కిందకు వెళ్లగా అదే సమయంలో ఉరుములు, మెరుపులతో చెట్టుపై పిడుగు పడింది. ఈ ఘటనలో భూమ్‌పురానికి చెందిన సర్వేష్ (19), పార్వతి (28), పులికల్ గ్రామానికి చెందిన సౌభాగ్యమ్మ (45) అక్కడికక్కడే మరణించారు. గాయపడ్డ మరో నలుగురుని హుటాహుటినా ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా మధిర మున్సిపాల్టీ పరిధి మడుపల్లి గ్రామానికి చెందిన గడిపూడి వీరభద్రరావు(50) అనే రైతు తన పొలంలో పనులు చేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడి అకాల వర్షంతో పాటు పిడుగు పడింది. దాంతో ఆయన గుర్రై అక్కడికక్కడే మృతి చెందాడు. వీరభద్రరావు అకాల మృతితో వారి కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## సిపిఐ ఆందోళన
(మొదటి పేజీ తరువాయి)

దాటి వెళ్లడం ద్వారా వారి కోరుతున్న అంశాలు బలహీనపడే ప్రమాదం ఉంది. ఖాట్మండు, పరిసర నగరాలలో నిరసన తెలుపుతున్న యువకులపై కాల్పులలో అనేక మంది మరణానికి కారణమవడమే కాకుండా, అగ్నికి ఆజ్యం పోసినట్లు మరుసటి రోజు అదే యువతకు లొంగిపోయిన పోలీసు యంత్రాంగం తీరును సిపిఐ తీవ్రంగా ఖండిస్తున్నది. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య నేపాల్‌ను పరిధవిల్లడాన్ని ఇష్టపడని శక్తుల భారీ కుట్రపై తీవ్రమైన సందేహాలు లేవనెత్తుతున్నాయి. కష్టపడి గెలుచుకున్న లౌకిక, ప్రజాస్వామిక రాజ్యాంగం కింద అభివృద్ధి చెందడం, రాచరికానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంలో కమ్యూనిస్టులు ప్రముఖ పాత్ర వహించారు. అదే సమయంలో నేపాల్‌లో కమ్యూనిస్టుల మధ్య నెలకొన్న విభేదాలు ప్రస్తుత సంక్షోభానికి కూడా దోహదం చేశాయి. నేపాల్ ప్రజలు పదేపదే కమ్యూనిస్టులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ, ప్రజల తీర్పును పక్కనబెట్టి సంకుచిత ఎజెండాలతో నడిచే పార్టీలతో రాజీపడిన ఫలితంగా కమ్యూనిస్టు సూత్రాలు పలుబారడం, బలహీనమైన పరిపాలన, అవినీతి, ప్రజలను నిరాశపరిచి ప్రస్తుత సంక్షోభానికి దారి తీసినట్లు ''సిపిఐ పేర్కొంది.
''నేపాల్‌లోని కమ్యూనిస్టులు తమ మార్గాన్ని పునరాలోచించి సూత్రప్రాయమైన ఐక్యతను పునరుద్ధరించకపోతే, వారు దశాబ్దాల ప్రజల పోరాటాల వారసత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అదే సమయంలో, నేపాల్ ప్రజలు, నేపాల్ కమ్యూనిస్టులకు సిపిఐ పూర్తి మద్దతు, సంఘీభావాన్ని ప్రకటిస్తూ, సాధ్యమనంతో తర్వగా తిరిగి శాంతియుత, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్ష వ్యక్తం చేసింది. సామ్రాజ్యవాద ప్రయోజనాలకు అనుగుణంగా దక్షిణాసియా దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం కొత్తేమి కాదని, వాటి పట్ల ప్రజాస్వామ్య, లౌకిక శక్తులఅన్నీ అప్రమత్తంగా ఉండాలని కోరింది. నేపాల్ ప్రజలు సాధించిన ప్రజాస్వామ్య, లౌకిక అభ్యున్నతిని కోల్పోకుండా ఉండేందుకు నేపాల్ యువత నిజమైన ఆగ్రహం మితవాద శక్తుల వైపు లేదా రాచరికానికి తిరిగి రావాలని పిలుపువైపు దారి మళ్ళొద్దని'' సిపిఐ ఆకాంక్ష వ్యక్తం చేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## కెటిఆర్ శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణాలోని బిఆర్ఎస్ ప్రభుత్వంలో గత 10 ఏళ్లుగా మంత్రిగా పనిచేసిన కెటిఆర్‌కు ఎలాంటి భాష మాట్లాడాలో, ఎలా ప్రవర్తించాలో తెలియకపోవటం విచారకరమని, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో అన్నింటికి తానే బాధ్యుడని ప్రకటించడమే కాకుండ రూ.44 కోట్లు ఎన్నికల బాండ్లను పొందేందుకు చట్టాలకు వ్యతిరేకంగా తన మంత్రి పదవిని దుర్వినియోగం చేసిన కెటిఆర్ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కెటిఆర్ టివిల ముందు, పత్రికా సమావేశాల్లో అడ్డగోలుగా మాట్లాడటం సబబు కాదన్నారు. ఆయనను భాషను మార్చుకొమ్మని అనేకసార్లు బిజెపి, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు సూచనలు ఇచ్చినప్పటికీ మార్పు రాకపోవడం ఆయన మనస్తత్వానికి నిదర్శనమని, ఇది ప్రజాస్వామ్య రాజకీయాలకు మంచిది కాదన్నారు.. ఇలాంటి భాష ప్రజా జీవితంలో మాట్లాడుతున్న వారందర్నీ సరైనమార్గంలో పెట్టటానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక వ్యవస్థను ఏర్పాటు చేయవల్సిన అవసరం రాష్ట్ర రాజకీయాల్లో ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని బోస్ విజ్ఞప్తి చేశారు.

## దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన “వీరవనిత ఐలమ్మ”

### సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజాం నిరంకుశ పాలనకు భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ కొనియాడారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి సందర్భంగా ఈ.టి నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎ.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. ఛాయాదేవి, జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, మామిడిచెట్ల వెంకటస్వామి తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 79వ వార్షికోత్సవాల కటౌట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ.టి నరసింహ మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో నేటి నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిజాం నిరంకుశ వ్యవస్థ, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో తెలంగాణ రైతులు నిర్వహించిన వీరోచిత సాయుధ పోరాట చరిత్రను బిజెపి నేతలు వక్రీకరించి, అబద్ధాలతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ మతవిద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. హిందువులు, ముస్లింలు కలసి సంఘటితంగా నియంతృత్వ నిజాం సర్కార్‌కు వ్యతరేకంగా చేసిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని, ఇది చెరిత్ర అని, దీనిని వక్రీకరిస్తే బీజేపీ నేతలకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన విఎస్ బోస్ మాట్లాడుతూ చారిత్రాత్మక తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు మాత్రమే అని తెలిపారు. నిరంకుశ రాచరికానికి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రకటించి, హైదరాబాద్ నడిబొడ్డున వీరోచిత పోరాటం చేసిన మఖ్దూమ్ మొహియుద్దీన్, బద్దం యెల్ల రెడ్డి, రావి నారాయణ రెడ్డి కమ్యూనిస్టు నేతలేనని, ఎక్కడా మత ప్రమేయం లేదని, ఇది నిజాం నిరంకుశ పాలనా, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటం, ఇది చరిత్ర అని విఎస్ బోస్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్‌కుమార్, బాలకృష్ణ, బి.కిషన్, కళ్యాణ్,అనిల్, సుశాంత్, భాను, చింటూ పాల్గొన్నారు.

## జార్ఖండ్ సిఎంను కలిసిన డిప్యూటీ సిఎం భట్టి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జార్ఖండ్ పర్యటనలో భాగంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకుడు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, సిఎం హేమంత్ తండ్రి శిబూ సోరెన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శిబూ సోరెన్ మృతి పట్ల డిప్యూటీ సిఎం తన సంతాపాన్ని ప్రకటించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఇటీవల జరిగిన జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా అక్కడ విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హేమంత్ సోరెన్‌తో కలిసి పనిచేశారు. జెఎంఎం, కాంగ్రెస్ కూటమి ఆ ఎన్నికల్లో విజయం సాధించడంలో భట్టి విక్రమార్క కీలక భూమిక పోషించారు. బుధవారం రాంచీలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కలిసిన సందర్భంగా రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు తదితర అంశాలపై వారు చర్చించారు.

## ట్రంప్‌కు దాసోహమంటున్న మోదీ

### సుంకం రద్దుతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం.. ఎస్‌కెఎం సదస్సులో వక్తలు




**ప్రజాపక్షం/ఖమ్మం :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలకు మోడీ తలొగ్గి దాసోహమంటున్నాడని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు ఆరోపించారు. వ్యవసాయ రంగ ఉత్పత్తులు ముఖ్యంగా పత్తి దిగుమతిపై సుంకాన్ని రద్దు చేయడం భారతదేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సదస్సు బుధవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. రైతు సంఘాల నేతలు దొండపాటి రమేష్, మాదినేని రమేష్, మలీదు నాగేశ్వరరావు, బజ్జూరి వెంకట్రామిరెడ్డి అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ సదస్సులో ఎస్‌కెఎం నేతలు మాట్లాడుతూ అమెరికాలో వ్యవసాయ రంగానికి 36 శాతం సబ్సిడీ ఇస్తున్నారని తెలిపారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై గతంలో 11 శాతం పన్ను విధించే వారని ఇప్పుడు మోదీ సర్కార్ ఆ పన్నును ఎత్తివేయడంతో దేశ వ్యాప్తంగా పత్తి సాగు చేస్తున్న రైతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దేశవ్యాప్తంగా పత్తి ధరలు క్షీణించి పత్తి సాగు చేయాలంటే జంకే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పెట్టుబడి ఆధారంగా పత్తికి రూ.10075 ప్రకటించాలని ఆందోళనలు చేస్తున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోకపోగా రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. భారతదేశ వ్యాప్తంగా గణనీయంగా పత్తిని సాగు చేస్తున్నారని తెలంగాణలోనే సుమారు 50 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తున్నారని ఎస్‌కెఎం నేతలు తెలిపారు. వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 536 సంఘాలు వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాయని ఆ క్రమంలోనే సదస్సు నిర్వహించబడుతుందన్నారు. సదస్సులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాగం హేమంతరావు, పశ్య పద్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, అఖిల భారత రైతు కూలీ సంఘం కేంద్ర కన్వీనర్ కెచ్చల రంగయ్య, ఏఐకెఎంఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.కోటేశ్వరరావు, కొండపర్తి గోవిందరావు, రైతు సంఘాల ప్రతినిధులు బొంతు రాంబాబు, కోలేటి నాగేశ్వరరావు, వై.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు ముందు బైపాస్ రోడ్డులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని, రద్దు చేసిన దిగుమతి సుంకాన్ని పునరుద్దరించాలని, వ్యవసాయోత్పత్తులన్నింటికి మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## మంత్రి ప్రకటనను స్వాగతిస్తున్నాం

### బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** వానాకాలం ముగియగానే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిలకు మరమ్మత్తులు చేయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించడాన్ని తాము స్వాగ తిస్తున్నామని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. 152 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించడం అసాధ్యమని, ఇందుకు మహరాష్ట్ర ప్రభుత్వం అంగీకరించబోదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ వినయ్‌భాస్కర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు కె.వాసుదేవరెడ్డి, సతీష్ రెడ్డితో కలిసి వినోద్ కుమార్ మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజికి మరమ్మతులు అవసరమని, అన్నారం, సుందిళ్లకు అవసరం ఉండకపోవచ్చని, ఒకవేళ ఉన్నప్పటికీ ఇబ్బందేమీ ఉండబోదన్నారు. తుమ్మిడి హట్టి దగ్గర నుంచి నీళ్లు ఎత్తిపోయాలంటే రెండు చోట్ల లిఫ్టులు అవసరమని, 152 మీటర్ల ఎత్తున గోదావరి జలాల తరలింపునకు మహారాష్ట్ర అంగీకరించే ప్రసక్తే లేదని, ఎపి, మహారాష్ట్ర, ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ 152 మీటర్ల ఒప్పందాన్ని సాధించలేక పోయారని వినోద్ కుమార్ తెలిపారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటికి తీసుకొస్తే చాలా మంచిదని, కానీ తుమ్మిడి హట్టి నుంచి ఎల్లంపల్లికి నీళ్లు తీసుకురావాలన్నప్పటికీ లిఫ్ట్ చేయాల్సిందేనని వివరించారు. ఇప్పటికైనా మూడు బ్యారేజీలను రిపేర్ చేపించాలన్నారు. మేడిగడ్డ బ్యారేజీ విలువ రూ.3,500 కోట్లు అని, ఇందులో మూడు పిల్లర్ల విలువ కేవలం రూ.300 కోట్లు అని, కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వ్యయంలో మూడు బారేజ్‌ల విలువ 6 శాతం మాత్రమేనని వినోద్ కుమార్ వివరించారు. యాసంగిలో మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోయకపోవడంతో రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ముందస్తు చర్యల వల్ల తగ్గిన నష్టం

### సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల భారీ వర్షాలలో ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల చాలా వరకు ప్రాణ, ఆస్తి నష్టం తగ్గిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ఇప్పటివరకు పరిహారాలను విడుదల చేయకపోతే, వాటిని వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు. అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో జరిగిన నష్టం, ఇప్పటి వరకు తీసుకున్న సహాయక చర్యలపై ఆయా శాఖల వారీగా హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణా విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పరిహారం విడుదల విషయంలో ఏ ఒక్క బాధితుడు కూడా పరిహారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, రోడ్ల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.5 కోట్లను విడుదల చేశామన్నారు. సహాయక చర్యలను ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని హైదరాబాద్ నుంచి ఆయా విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వరద సహాయానికి సంబంధించి వినియోగించిన నిధులకు యుసిలను కేంద్రానికి అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 13వ తేదీలోగా ఆయా విభాగాలు యూసీలను సమర్పించాలని ఆదేశించారు.

### అర్హులైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలి



అర్హులైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి , సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక, సిఎం సిపిఆర్ఒ గుర్రం మల్సూర్‌తో కలిసి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్ట్‌ల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హై పవర్ కమిటీ సిఫార్సులు తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థికశాఖ అధికారులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని వారు నిర్ణయించారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఇంటిని కూలగొట్టే లైసెన్స్ ఇచ్చినట్టే

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమకు ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలను ఆపేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను బెదిరిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. జూబ్లిహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉన్న ఇంటిని కూలగొట్టే లైసెన్స్ ఇచ్చినట్టేనని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ హైడ్రా పేరుతో బిల్డర్ల దగ్గర దోచుకున్న అవినీతి సొమ్మును ఉప ఎన్నికలో పంపిణీ చేసి ఎలాగైనా గెలవాలని సిఎం రేవంత్ రెడ్డి కుట్రకు పాల్పడుతున్నార్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు తీవ్రంగా ద్వేషిస్తున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇండ్లు కూలగొట్టడమేనా అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ తీవ్రంగా వ్యతిరేకించే బిజెపి, మోదీ, సిబిఐ లాంటి అంశాల్లో కాంగ్రెస్ భావజాలానికి సిఎం రేవంత్ రెడ్డి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ను తీవ్రంగా ద్వేషిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బిఆర్ఎస్ నాయకులు తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీమంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంఎల్ఎలు వినయ్ భాస్కర్, పి.విష్ణువర్ధన్ రెడ్డి, కోరుకంటి చందర్, దివంగత మాగంటి గోపినాథ్ సతీమణి సునీత పాల్గొన్నారు.

## నేపాల్‌లో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా తెలంగాణ పౌరుల కోసం ‘ప్రత్యేక హెల్ప్ లైన్’ ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం నేపాల్‌లో అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమర్జెన్సీ హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు సహాయం చేయనుంది. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు నేపాల్‌లో తెలంగాణ పౌరులెవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాట్మాండులోని భారత రాయబార కార్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. నేపాల్లో ఎవరైనా తెలంగాణ చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రెటరీ లైజన్ హెడ్ వందన (మొబైల్ నెంబర్: +91 9871999044)ను, లైజన్ ఆఫీసర్ జి.రక్షిత్ నాయక్ (మొబైల్ నెంబర్:+91 9643 723157)ను, ప్రజా సంబంధాల అధికారి సిహెచ్.చక్రవర్తి (మొబైల్ నెంబర్:+91 9949351270)ను సంప్రదించవచ్చు. తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోవద్దని సూచించింది. తెలంగాణ పౌరులకు నేపాల్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది.

## టిజిపిఎస్‌సి తప్పిదాలతో గందరగోళంలో నిరుద్యోగులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) చేస్తున్న వరుస తప్పిదాలతో నిరుద్యోగ యువతను తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే గ్రూప్ 1 అభ్యర్థులు మూడు సార్లు పరీక్షనురాశారని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు అన్నారు. అయితే గ్రూప్ 1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనంలో తప్పిదాలు జరిగాయంటూ కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడం, కోర్టు మళ్లీ మూల్యాంకనం చేయడమో, మళ్లీ పరీక్షను నిర్వహించడమో చేయాలని హైకోర్టు ఆదేశించిందన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం గత తప్పిదాలను పునరావృతం కాకుండా యూపిఎస్‌సి తరహాలో టిజిపిఎస్‌సిప్రక్షాళన చేసిన తర్వాత పరీక్షలను నిర్వహించి నియామకాలను చేపడతామని ప్రకటించిందని, కానీ మళ్ళీ తప్పిదాలు చేయడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులకు న్యాయం చేసే విధంగా తప్పిదాలకు తావులేకుండా టిజిపిఎస్‌సిని తీర్చిదిద్దాలని కోరారు.

## తిరోగమనమా.. పురోగమనమా?

### సాయుధ పోరాట సారథిగా తిరుపతి

### మావోయిస్టు పార్టీ బాధ్యతలు మరోసారి తెలుగు వారికి

**ప్రజాపక్షం/ఖమ్మం :** మావోయిస్టు ఉద్యమం అత్యంత సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది. దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో ఉనికిని చాటుతూ కొన్ని ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాలు నడిపిన మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వ వైఖరితో భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్న వేళ కొత్త సారథి ఎన్నిక జరిగింది. మావోయిస్టు ఉద్యమ చరిత్రలో కార్యదర్శిగా ఉండి ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన నంబాల కేశవరావు తర్వాత మావోయిస్టు పార్టీ సారథ్య బాధ్యతలపై ఎన్నో ఊహగానాలు జరిగాయి. పలువురి పేర్లు పరిశీలనలోకి వచ్చినా ఎట్టకేలకు తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ ప్రస్తుత జగిత్యాలకు చెందిన 58 ఏళ్ల తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి బాధ్యతలు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వం 2026 నాటికి మావోయిస్టులను ఈ దేశంలో లేకుండా చేస్తామని ప్రకటించి ఆ దిశగా సాయుధ బలగాలను మోహరించింది. మావోయిస్టు పార్టీకి ప్రధాన కేంద్రంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారుణ్యంపై దృష్టి కేంద్రీకరించి దాదాపు మావోయిస్టు స్థావరాలన్నింటిని జల్లెడపట్టి పోలీస్ బేస్ క్యాంపులను ఏర్పాటు చేసింది. మావోయిస్టులు తలదాచుకున్నారన్న నేపంతో 25వేల మంది పోలీసులతో కర్రె గుట్టలను జల్లెడ పట్టారు. ఆ క్రమంలోనే అనేక మంది ఎన్‌కౌంటర్ల పేరుతో హతమయ్యారు. మావోయిస్టు భవితవ్యంపై నీలి నీడలు కమ్ముకుంటున్న వేళ మావోయిస్టు పార్టీ నూతన కార్యదర్శిని ప్రకటించింది. ఈ దశలో నూతన సారధ్యంలో మావోయిస్టు తిరోగమనమా పురోగమనమా అన్నదానిపై విస్తృతంగా చర్చ సాగుతుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించినట్లుగా మావోయిస్టు పార్టీని లేకుండా చేయడం అసాధ్యం కావచ్చు కానీ అదే సమయంలో తిరిగి దండకారుణ్యంపై మావోయిస్టులు పట్టు సాధించడం కూడా ఆలోచించాల్సిన విషయమే. గతంలో మావోయిస్టు పార్టీకి అటవీ సమీప గ్రామాల ప్రజల సంపూర్ణ మద్దతు ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దానితో పాటు పోలీసుల వద్ద ఉన్న అధునాతన ఆయుధాలు అన్నింటికి మించి మావోయిస్టు సాయుధ బలగాల్లో పనిచేస్తున్న క్యాడర్ నాయకత్వం పట్ల విశ్వసనీయతను కోల్పోతుంది. ఒకరిద్దరు పోలీసులతో చేతులు కలపడం వల్లనే నంబాల కేశవరావు మృతి చెందారన్నది వాస్తవం. ఈ పరిస్థితుల్లో ప్రజల మద్దతు సైద్దాంతిక శిక్షణ కలిగిన క్యాడర్ లేకపోవడం మావోయిస్టు ఉద్యమ మనుగడకు తీవ్ర అవరోధం కానున్నాయి. మరో పక్క అమిత్‌షా సవాల్‌కు ఇంకో ఆరు మాసాల సమయం ఉన్నది. మావోయిస్టు ఉద్యమం కేవలం వామపక్ష తీవ్రవాదంగా భావించకుండా సామాజిక రాజకీయ ఆర్థిక సమస్యగా పరిగణించాల్సి ఉంది. ఈ సందర్భంలో రాజకీయ సామాజిక ఆర్థిక సమస్యలకు సరైన పరిష్కారం చూపకుండా మావోయిస్టు పార్టీని



అంతం చేయడమన్నది సాధ్యమయ్యే పని కాదు. ఒకవేళ మావోయిస్టు పరంగా సరైన కార్యాచరణ లేకపోతే తీవ్రవాదం మరో రూపు సంతరించుకుంటుంది తప్ప మావోయిస్టులను కాల్చి చంపడం ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదన్న వాస్తవాన్ని పాలకులు గ్రహించడం లేదు. కొత్త సారధి తిరుపతికి పార్టీని కాపాడడంతో పాటు పురోగమన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇదే సమయంలో మిలిటెంట్ దాడులు చేయడంలో సిద్ద హస్తుడిగా పేరొందిన హిడ్మాకు దండకారుణ్య బాధ్యతలను అప్పగించింది. దశాబ్ద కాలంగా హిడ్మా అనేక హింసాత్మక చర్యలకు నేతృత్వం వహించాడు. దాడి చేయడంలోనూ, తప్పించుకోవడంలోనూ పేరొందిన హిడ్మా ప్రజలతో మమేకమై ఉంటాడని పేరుంది. ఆయనకు దండకారుణ్య బాధ్యతలు అప్పగించడంతో మావోయిస్టు ఉద్యమ మనుగడపై కొంత మంది ఆశలు పెంచుకుంటున్నారు. ప్రజలతో మమేకం కావడం వల్లే పోలీసులు హిడ్మా జాడను కనుగోనలేకపోతున్నారన్న వాదన వినిపిస్తుంది. మొత్తంగా మావోయిస్టు నూతన సారధిగా బాధ్యతలు చేపట్టిన తిరుపతి ముందు పెను సవాళ్లు ఉన్నాయన్నది వాస్తవం. మావోయిస్టు జీవితమంటేనే ప్రాణాన్ని ఫణంగా పెట్టి పోరాడటం ఇప్పుడు ప్రాణం కంటే పార్టీ మనుగడే ప్రశ్నార్థకమైంది.



### మరోసారి తెలుగువారికి దక్కిన అవకాశం:

సాయుధ పోరాట ప్రభావం ఇప్పటి ఆంధ్రాలోని నల్లమల అటవీ ప్రాంతంతో పాటు ఉత్తరాంధ్రకు పరిమితం కాగా తెలంగాణలో గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు పరిమితమైంది. రెండు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో మావోయిస్టు కార్యాచరణ లేకపోయినా నాయకత్వ స్థాయిలో మాత్రం తెలుగు వారే కొనసాగుతుండటం గమనార్హం. కమ్యూనిస్టు పార్టీలో పలు చీలికల తర్వాత సాయుధ పంథాను ఎంచుకున్న ఒకప్పటి పీపు ల్స్ వార్ ఇప్పటి మావోయిస్టు పార్టీకి తెలుగు వారే సార ధ్యం వహించారు. కెఎస్‌గా పేరొందిన కొండపల్లి సీతారామయ్య, లక్ష్మ ణ్‌రావు, నంబాల కేశవరావు సుదీర్ఘ కాలం నాయకత్వ బాధ్యతలను నిర్వర్తించారు. ఇప్పుడు మరోమారు తెలంగాణ రాష్ట్రానికి చెందిన తిరుపతి అలియాస్ దేవ్‌జీకి మావోయిస్టు పగ్గాలు అప్పగించారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

'e' NIT No. 07/J1/IT/GHMC/2025-26 ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్స్) తేది: 08.09.2025

**పని పేరు:** జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయం & సర్కిల్‌లో (21) ప్రాంతాలలో (2) సంవత్సరాల కాలానికి రిడెండెన్సీ కమ్ ప్యారలల్ కనెక్టివిటీ కోసం (1:1) ఇంటర్నెట్ లీజుకు ఇచ్చిన లైన్లను అందించడం. **అంచనా విలువ / ఇసివి:** రూ.41,46,660/-, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 10.09.2025న ఉ.11.00గం.ల నుండి, ఆఖరి తేది: 18.09.2025న సా.04.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** అడిషనల్ కమిషనర్ కార్యాలయం (ఐటి), 3వ అంతస్తు, సిసి కాంప్లెక్స్ భవనము, జిహెచ్ఎంసి, లిబర్టీ సర్కిల్, హైదరాబాద్ - 500063. ఫోన్: 6309999458. deeit-ghmc@gov.in

సం/- అడిషనల్ కమిషనర్ (ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 7830-PP/CL/ADVT/1/2025-26, Date: 10-09-2025

**పురపాలక సంఘ కార్యాలయము : మొయినాబాద్, జిల్లా రంగారెడ్డి.**

లేఖ నెం. F1/MNBD/2025 (వేలం ప్రకటన నోటీసు) తేది: 10.09.2025

విషయము : పురపాలక సంఘం మొయినాబాద్ - చికెన్, మటన్, చేపల మాంసపు వ్యర్థాలను సేకరణకు గాను వేలం వేయుటకు ప్రకటన జారీ చేయుట - గురించి.

నిర్దేశ్యము : 1) F1/MNBD/2025-3, తేది.28-06-2025.

*****

ఇందుములముగా ఆసక్తి, అర్హత మరియు అనుభవం గల ఏజెన్సీలు, ఎస్టీవోలకు తెలియజేయునది ఏమనగా, మొయినాబాద్ పురపాలక సంఘము యొక్క పరిధిలోని చికెన్, మటన్, చేపల మాంసపు దుకాణాల నుండి వెలువడే మాంసపు వ్యర్థాలను సరియైన విధానములో సేకరించడానికి గాను తేది.11.09.2025 నుండి తేది. 18.09.2025 వరకు కార్యాలయ పని వేళలో దరఖాస్తులను సమర్పించగలరు మరియు తేది.18.09.2025 సాయంత్రం 5.00 గంటలకు మున్సిపల్ కమిషనర్ గారు దరఖాస్తుదారుల ముందు వేలం పాటను మున్సిపాలిటీ కార్యాలయము (అజీజ్ నగర్) యందు నిర్వహించబడును. ఇతర వివరాల కొరకు మున్సిపాలిటీ కార్యాలయ పని వేలలలో మేనేజర్ గారిని సంప్రదించగలరు.

సం/- కమిషనర్ మొయినాబాద్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 7869-PP/CL/ADVT/1/2025-26, Date: 10-09-2025

## ఆర్థిక అక్షరాస్యత ప్రతీ ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/వేములపల్లి:** ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతను బాధ్యతగా భావించాలని ఎస్‌ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు.మంగళవారం మిర్యాలగూడ బ్రాంచ్ సి ఎఫ్ ఎల్ కౌన్సిల్ సభ్యులు మాతంగి అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు లో ముఖ్యఅతిథిలుగా ఎస్‌ఐ డి వెంకటేశ్వర్లు బ్యాంకు మేనేజర్ కే రమేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేములపల్లి బ్రాంచ్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన ద్వారా 436 రూపాయల తో ఇన్సూరెన్స్ చేసుకోవలని ఏదైనా ప్రమాదం జరిగినపుడు కుటుంబం రోడ్డున పడకుండా రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్, కళాజాత సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## తుది జాబితా ఓటర్ లిస్టు విడుదల

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** మండలంలో పూర్తిస్థాయిలో తుది జాబితా ఓటర్ లిస్టు విడుదల చేసినట్లు ఒక ప్రకటన తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయితీలో పురుషులు 11069 మంది స్త్రీలు 11539 మంది మొత్తం 11069 మంది స్త్రీలు 11539 మంది మొత్తం ఓటర్లు 22,610 ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం పోలింగు స్టేషన్లో 42 జడ్పిటిసి పోలింగ్ స్టేషన్లో 42 ఉన్నట్లు 42 ఉన్నట్లు 500 ఓటర్లకి ఒక పోలింగు స్టేషన్ చొప్పున 19 పోలింగ్ స్టేషన్లో ఉన్నట్లు ఓటర్లు ఎక్కువగా ఉన్న గ్రామ పంచాయితీలో 5 వందల ఒకటి నుంచి 700 ఓటర్ల వరకు ఉన్న 33 పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుది జాబితా లిస్టును విడుదల చేసి అధికారులకు పంపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.





## సమాజంలో మార్పు తెచ్చేందుకు అందరి కృషి అవసరం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రభుత్వ ఉద్యోగులు సమాజంలో మార్పు తెచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తదుపరి జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా జిల్లా కలెక్టర్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రైతాంగ పోరాటంలో భాగంగా, అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడి చాకలి ఐలమ్మ పోరాటం చరిత్రలో నిలబడిపోతుందని ఆమె త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరానికి దిశానిర్ధేశం చేస్తాయన్నారు. గతంలో సమాజంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో వాటి నుంచి బయటికి రావటానికి మహనీయులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారని అట్టి విషయాలు భావితరాలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిబిసిడిఓ నరసింహారావు, డిపిఓ యాదగిరి, డిఎస్‌డిడిఓ దయానందరాణి, టిఎన్‌జిఓ సెక్రటరీ దున్నా శ్యామ్, బిసి సంఘాల నాయకులు చల్లమల్ల నరసింహ, బంటు కృష్ణ, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, పద్మ, శ్రీదేవి, ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న శ్రీరాములు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బుద్ధవనం సందర్శన గొప్ప అనుభూతి

### సందర్శించిన పల్నాడు కలెక్టర్, ఎస్‌పి



**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ టూరిజం నాగార్జునసాగర్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన బుద్ధవనాన్ని బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, సూపరిటెంట్ ఆఫ్ పోలీస్ కంచి శ్రీనివాస రావు సందర్శించారు. నాగార్జునసాగర్ సందర్శనలో భాగంగా నాగార్జునసాగర్ ప్రధాన డ్యామును సందర్శించిన అనంతరం వారు బుద్ధవనం చేరుకొని బుద్ధ చరితవనంలోని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు.బుద్ధవనం మహాస్థూపం లోని సమావేశ మందిరంలో బుద్ధవనం ప్రాజెక్టుకు సంబంధించిన వీడియోని వీక్షించారు. అనంతరం మహా స్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించారు.. వీరికి బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర పంచశీల కండువాలతో సత్కరించి బుద్ధవనం విశేషాలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బుద్ధవనం సందర్శన గొప్ప అద్భుతమైన అనుభూతిని అందించిందన్నారు. దమ్మ ఆశయాన్ని బుద్ధ వనంలో కనిపించేలా ఇక్కడి నిర్మాణాలు ఉన్నాయన్నారు. బుద్ధ వనంలోని మహాస్తూప నిర్మాణం భారతీయ ఇంజనీర్ల నైపుణ్యానికి అద్దం పడుతుందన్నారు. వీరితోపాటు ఆర్‌డిఓ మురళీకృష్ణ,అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్ జగ్గారావు, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ఆగిన కృష్ణమ్మ పరవళ్ళు

### సాగర్ ప్రాజెక్ట్ మొత్తం గేట్లు మూసివేత

**ప్రజాపక్షం/నందికొండ:** కొద్ది రోజులుగా శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు లక్షకు పైగా కొనసాగి న ఇన్ ఫ్లో నెమ్మదిగా తగ్గి 50 వేలకు చేరుకోవడంతో బుధవారం నాగార్జునసాగర్ జలాశయం గేట్లను పూర్తిగా మూసివేశారు.రిజర్వాయర్ పూర్తి స్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు బుధవారం సాయంత్రానికి 589.20 అడుగులుగా ఉండటంతో వస్తున్న 50 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట మట్టానికి చేరుకునేందుకు సరిపోనుండటంతో రిజర్వాయర్ గేట్లను పూర్తిగా మూసివేశారు.దీనితో రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టిఎంసిలకు 309.6546 టీఎంసీలుగా ఉన్నది. కుడి కాలువ ద్వారా 9700 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 9349 క్యూసెక్కులు, ఎస్ ఎల్ బి సిపి ఎం ఆర్ పి ద్వారా 2400 క్యూసెక్కు ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 33495 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ కు 55244 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉంటే అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదలవుతుంది.

## రైతులకు యూరియా ఇవ్వలేని ప్రభుత్వం

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఎద్దేవా

**ప్రజాపక్షం/సూర్యాపేట :** రైతులకు యూరియా ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజల్ని రకరకాల సమస్యలు సృష్టించి ప్రజల్ని ఇబ్బంది పెడుతూ డైవర్షన్ చేస్తూ పబ్బం గడుపుకుంటుందని యద్దేవా చేశారు. గ్రూప్ వన్ విషయంలో రేవంత్‌రెడ్డి చేతకానితనం బయటపడింది కనుకనే తెలంగాణ యువత ముందు తలదించుకున్నాడని విమర్శించారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనం వహించాలి కాని కెసిఆర్‌ను తిట్టటం, కేసులు పెడతామనడం మానుకోవాలని హితవు పలికారు. ఈ ఫార్ములాలు పనికిమాలినవి, నీ ఫార్ములానే పనికిమాలిందన్నారు. నీ డైవర్షన్ ఫార్ములానే ఒక ఫాల్స్.. ఒక పూట మీడియాలో ఉంటే ఉండొచ్చుకానీ శాశ్వతంగా తెలంగాణ ప్రజలకు నీవు ద్రోహివిగానే మిగిలిపోతావ్‌ని జోస్యం చెప్పారు. మీ నాయకుడు ఇప్పుడు కండ్లు తెరిచినట్టుంది చోటేబాయ్ బడే బాయ్‌ల బంధం ఎంత పటిష్టమైందో సిబిఐకి ఇవ్వడంతోనే నీ బంధం బయటపడిందని ప్రజల దృష్టిలో, నీ అధిష్టానం దృష్టిలో పడుతున్నావని చెప్పారు. నీవు నీ బంధాలు కలిసి బిఆర్‌ఎస్ పార్టీని ఏమి చేయలేవన్నారు.



# రాష్ట్రంలోనే రోల్‌మోడల్

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం

### మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** 25 ఎకరాల్లో అధునాతన హంగులతో,ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.నల్లగొండ పట్టణంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను బుధవారం మంత్రి ఆకస్మికంగా పరిశీలించి పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 25 ఎకరాల్లో అధునాతన హంగులతో,ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని అందులో 1లక్ష 10వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్స్ నాలుగు బ్లాకులుగా నిర్మిస్తున్నామని తెలిపారు.దీంతో పాటు స్టాఫ్ క్వార్టర్స్,డైనింగ్ హాల్,ఇతర నిర్మాణ పుట్టింగ్స్ పనులు సమాంతరంగా జరిగేలా చూసుకుంటూ పనుల్లో ఇంకా వేగం పెంచాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు. ఎంతో మంది పేద విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందించేందుకు ఈ రెసిడెన్షియల్ స్కూల్ దోహదపడనుందని దాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణం జరగాలన్నారు. ఒకటో బ్లాక్ మొదటి స్లాబ్ అక్టోబర్ చివరి నాటి కంటే ముందే పూర్తయ్యేలా పనిచేయాలని,రాష్ట్రంలోనే నల్గొండ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం ఆదర్శంగా ఉండాలని,అందుకు అనుగుణంగా అధికారులు,వర్క్ ఏజెన్సీ మనసుపెట్టి పనిచేయాలని మంత్రి సూచించారు. 9నెలల నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలనీ స్పష్టం చేశారు.

**వీరనారి చాకలి ఐలమ్మ:మంత్రి కోమటిరెడ్డి**

భూమికోసం వెట్టిచాకిరి, విముక్తి కోసం పోరాడిన తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్లో గల క్యాంపు కార్యాలయం లో మంత్రి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటాలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బి. లక్ష్మారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీం, శ్రీనివాస్ రెడ్డి, వంగాల అనిల్ రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో ఎం వి గోన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

### దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ పనిచేస్తుందని దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలునాయక్ అన్నారు.బుధవారం పీఏపల్లి మండల కేంద్రంలో జనహిత ఎమ్మెల్యే మార్నింగ్ వాకింగ్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా పలు కాలనీలో ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించి గ్రామ ప్రజలకు నేరుగా కలిసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనహిత మార్నింగ్ వాకింగ్ తో ప్రజల రాతలు మారుతున్నాయన్నారు.ప్రజల సమస్యలు తెలుసుకోవడం తక్షణమే పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలు ప్రజల్లో విశేష స్పందన వస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అదేవిధంగా మండలానికి సంబంధించిన కల్యాణ లక్ష్మి చెక్కులను స్వయంగా లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది.

## విద్యార్థులు ఆశయంతో చదవాలి

### కోదాడ డిఎస్‌పి శ్రీధర్ రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** విద్యార్థులు మంచి ఆశయంతో చదువుకోవాలని,ప్రావీణ్యం ఉన్న అంశంపై సాధన చేయాలని కోదాడ డిఎస్‌పి శ్రీధర్ రెడ్డి అన్నారు. పోలీస్ భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినీలు,మహిళలు బాలికల రక్షణ చట్టాలు గురించి అవగాహన కల్పించారు. జిల్లా పోలీస్ కళా బృందం చే సామాజిక అంశాలు,షీటీమ్స్, మంచి అలవాట్లను అలవర్చుకోవాలనే అంశాలపై పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ సీఐ జి. చరమందరాజుతో కలిసి డిఎస్‌పి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ చదువు చాలా విలువైనదని,ప్రపంచంలో చదువుతోనే విజ్ఞానం వెలుగొందుతుందన్నారు. ప్రతిఒక్కరూ చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అదిరోహించాలన్నారు. పుట్టిన ఊరుకు,తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతలు తేవాలంటే చదువుతోనే సాధ్యమౌతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఎస్‌ఐ బండి.మోహన్ బాబు,ప్రిన్సిపల్ రెహనాభేగం,ఉపాధ్యాయినీలు శైలజ,నస్రీన్, స్వప్న,దివ్య,పుష్ప, కళ్యాణి పావనీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంజియు 4వ స్నాతకోత్సవానికి అన్నీ ఏర్పాట్లు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** ఈనెల 15న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ నాల్గవ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు. బుధవారం ఆమె జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తో కలిసి మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి రాష్ట్ర గవర్నర్ పాల్గొననున్న స్నాతకోత్సవ వేదికను పరిశీలించారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ రాక సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి బాధ్యతలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చెప్పారు. గవర్నర్ రాకను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా అధికారులతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏర్పాట్లు, ఇతర అంశాలను అందులో పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 15న ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను, మెడికల్ టీం, 108,104 ,ప్రత్యేక డాక్టర్ల బృందం ఏర్పాటు చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, అలాగే డయాస్ ఇతర ఏర్పాట్లు ఆర్ అండ్ బి అధికారులు చూడాలని , తాగునీరు, శానిటేషన్, ఫాగింగ్ వంటివి చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఖాజా అల్లా హుస్సేన్ మాట్లాడుతూ ఈనెల 15 న మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవంలో 22 మంది పి హెచ్ డి సాధించిన విద్యార్థులు, 57 మంది గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం ఉంటుందని, అనంతరం గవర్నర్ ప్రసంగం ఉంటాయని, ఒంటిగంటకు కార్యక్రమాల అనంతరం గవర్నర్ తిరిగి వెళ్తారని,రాష్ట్ర గవర్నర్ కార్యక్రమాలను సవ్యంగా నిర్వహించేందుకు గాను యూనివర్సిటీలో సుమారు 12 కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎంజి యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్,జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్‌ఎస్ మాతృనాయక్ అధికారులు హాజరయ్యారు.

## అర్హులందరికీ కుటుంబ ప్రయోజన పథకం

**ప్రజాపక్షం/చిట్యాల :** జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అర్హులైన వారందరికి, వీలైనంత ఎక్కువ మందికి అందేలా మండలాధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల తహసిల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు దిశా నిర్దేశాలనందించారు. ఈ పథకం కోసం వచ్చిన దరఖాస్తులను, పిఓబి భూములకు సంభందించిన కేసులను ఆమె పరిశీలించారు. మండలంలో అన్ని గ్రామాల వారిగా 2017 ఏప్రిల్ నుండి మరణించిన వారి వివరాలను తెలప్పించుకుని అందులో నుండి కుటుంబ పెద్ద మగ లేదా ఆడ ఎవరు చనిపోయినా అలాంటి వారి వివరాలు సేకరించి సంభందిత కుటుంబ సభ్యుల సహకారంతో మరణ ధృవీకరణ పత్రము, ఆధార్, ఇతర ధృవ పత్రాలను జత చేసి జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం కింద లబ్ధి పొందేందుకు దరఖాస్తులను పంపించాలని సూచించారు. చనిపోయిన కుటుంబ పెద్ద కుటుంబానికి రూ. 20వేలు పెద్ద మొత్తం వస్తున్నందున అర్హులందరిని గుర్తించాలని కలెక్టర్ అన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఆన్‌లైన్ చేస్తున్నట్లు ఆర్‌డిఓ అశోక్‌రెడ్డి ఆమెకు వివరించారు. అంతకుముందు మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని దశమి లాబ్స్ ఫార్మా పరిశ్రమలో వనమహోత్సవంలో భాగంగా కలెక్టర్ మొక్కలు నాటారు. ఆమె వెంట ఆర్‌డిఓ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ నాయక్, పరిశ్రమల అధికారి శ్రీదేవి తదితరులున్నారు.



## ‘మన పోరాటం- మన చరిత్ర’ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

### సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో మన పోరాటం మన చరిత్రలో ప్రముఖమైనదని దేశభక్తిని రగిలించేది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,జిల్లా రైతుసంఘం కార్యదర్శి కంబాల శ్రీనివాస్,పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు లు అన్నారు. బుధవారం హుజూర్ నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన సిపిఐ పట్టణ కౌన్సిల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14 సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్‌లో భారీ ర్యాలీ చేసి,అమరులకు ఘననివాళులు అర్పిస్తామన్నారు. సాయుధ పోరాట యోధుల త్యాగాలను,దేశభక్తిని ,పోరాటాన్ని గౌరవించడం తెలుసుకోవడం యువత బాధ్యత అన్నారు. దోపిడి దురహంకారం,అసమానత్వాన్ని రూపుమాపేందుకు సాయుధ పోరాట యోధుల ప్రాణత్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాలని కోరారు. ప్రతిఒక్కరూ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమగాని కృష్ణ,జడ వెంకన్న,దొంతగాని సత్యానారాయణ,ఇందిరాల వెంకటేశ్వర్లు,యల్లావుల రమేష్,జడ శ్రీనివాస్,యల్లావుల ఉమ,చెన్నగాని సైదులు,చక్రాల స్టాలిన్,చక్రాల వెంకన్న,గుండా రమేష్,కృష్ణారెడ్డి,స్వామి,ప్రసాద్,మల్లయ్య రమణ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన తప్పనిసరి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూర్యాపేట సిఐ వెంకటయ్య చెప్పారు. బుధవారం రాత్రి బాలికల గురుకుల డిగ్రీ కళాశాల నందు పోలీసు ప్రజాబరోసా కార్యక్రమంలో భాగంగా ఫోక్సో చట్టం అమలు, జిల్లా పోలీసు, షీ టీమ్స్ పనితీరు, బరోసా సెంటర్, మహిళల బాలల రక్షణ చట్టాలు, వేధింపులపై ఫిర్యాదు చేయడం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేటి సాంకేతిక సమాజంలో అనేక అసాంఘిక దురాచారాలు ఉన్నాయని వాటన్నిటిని చదువు అనే విజ్ఞానంతో ప్రారదోరాలన్నారు. దానికి ఉన్నతమైన చదువు ముఖ్యమని, చదువు విలువను గుర్తించాలని కోరారు. ఉన్నత లక్ష్యాలతో చదువుకోవడం, మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి విజయాలు సాధించి తల్లిదండ్రులకు విద్యాసంస్థలకు గురువులకు మంచి పేరుతేవాలన్నారు. సైబర్ మోసాలపట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మాదకద్రవ్యాలకు యువత బానిసలై బంగారు భవిష్యత్తు కోల్పోతున్నారని అలాంటి వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. వేధింపులకు సంబంధించి ధైర్యంగా జిల్లా షీటీం 8712686056 కు లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## మట్టి మనుషుల పోరాటమే రైతాంగ సాయుధ పోరాటం

### గుండ్రాంపల్లి నుంచే వారోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/నల్లగొండ:** భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం.. ఆత్మ గౌరవం కోసం తెలంగాణ గడ్డపై మట్టి మనుషులు చేసిన పోరాటాలకు 76 ఏళ్లు నిండాయి. తెలంగాణ ప్రాంతంలో నాటి నైజాం రాచరిక పరిపాలనలో అణిగిపోయి బాంచన్..నీ కాళ్లు మొక్తా అన్న ప్రజలే బందూకులు పట్టిన కమ్యూనిస్టు పోరాటమది. నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూస్వాములు, దొరలు, దేశ్‌ముఖ్‌లపై తిరుగుబాటు దిక్కస్వరం వినిపించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించబడింది. నాడు హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లీం అయినప్పటికీ జమీందార్లు, జాగిర్దార్లు, భూస్వాములు 90 శాతం హిందువులు అయినప్పటికీ నిజాం నవాబు గులాం గిరిగా వ్యవహరించడమే కాకుండా నిజాం ను మించిన ధౌర్జన్యాలతో అనేక మందిని ఊచకోత కోయడం.. మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగింపులు చేయడం.. బతుకమ్మలు ఆడించడం.. మానభంగాలు చేయడం లాంటి కృరమైన నేరాలకు పాల్పడి అనేకమంది ప్రజల ప్రాణాలను తీశారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నల్లగొండ జిల్లాలో అనేక గ్రామాలలో ప్రజలను భాగస్వాములను చేసి దొరలు, భూస్వాములు, రజాకారులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించారు. ఆయుధాలు లేకున్నా కారంపొడి, రోకళ్లు, కర్రలు, గుప్తలు చేతికి అందిందే ఆయుధంగా ఎంచుకొని రజాకారులను ఎదిరించిన మట్టి మనుషులు. అందులో భాగంగా నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, గుం డ్రాంపల్లి గ్రామం రజాకారులను ఎదిరించిన ఘనమైన చరిత్రలో నిలిచిపోయింది.ఈ నేపథ్యంలో ఈ నెల 11న సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తం గా తలపెట్టిన తెలంగాణ రైతాంగ సా యుధ పోరాట వారోత్సవాల్లో భాగం గా గుండ్రాంపల్లి గ్రామంలో వారోత్సవాల ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆధార్‌ను అనుమతించండి
### బిహార్ ఎన్నికల సంఘానికి ఇసిఐ సూచన

**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి ఓటర్ల గుర్తింపును నిర్ధారించడానికి ఆధార్ కార్డును అదనపు పత్రంగా అంగీకరించాలని ఎన్నికల కమిషన్ బీహార్ ఎన్నికల యంత్రాంగాన్ని కోరింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి రాసిన లేఖలో కమిషన్ 'జాబితా చేయబడిన ఆధార్‌కార్డును 12వ పత్రంగా పరిగణిస్తారు' అని పేర్కొంది. ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 ప్రకారం, ఆధార్ కార్డును 'పౌరసత్వ రుజువుగా కాకుండా గుర్తింపు రుజువుగా' అంగీకరించి ఉపయోగించాలని ఇసి స్పష్టం చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 23(4) ప్రకారం, ఆధార్‌కార్డు ఇప్పటికే ఒక వ్యక్తి గుర్తింపును నిరూపించడానికి లెక్కించబడిన పత్రాలలో ఒకటి. ఈ ఆదేశానికి అనుగుణంగా ఆధార్‌ను పాటించకపోవడం లేదా అంగీకరించడానికి నిరాకరించడం వంటి ఏదైనా సందర్భాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించాల పోల్ ప్యానెల్ హెచ్చరించింది. బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ ప్రక్రియలో ఓటర్ల గుర్తింపు రుజువుగా ఆధార్ కార్డును 'తప్పనిసరి' చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈనెల 9 లోపు ఈ చర్యను అమలు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరింది.

## 'ఓట్ చోర్, గద్దీ చోడ్' దేశవ్యాప్తంగా నిరూపించబడింది
### ఈ నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్తుంది : రాహుల్‌గాంధీ

**రాయ్‌బరేలి :** 'ఓట్ చోర్, గద్దీ చోడ్' అనే నినాదం దేశ వ్యాప్తంగా నిరూపించబడిందని, ఈ నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్తుందని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తన పార్లమెంటరీ నియోజకవర్గం రాయ్‌బరేలిలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉత్తరప్రదేశ్ వెళ్లారు. బుధవారం ఆయన లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ విమానాశ్రయానికి చేరుకోగా, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ రాయ్, ఇతర సీనియర్ నాయకులు స్వాగతం పలికారు. ఒక కార్యక్రమానికి వెళ్లే ముందు రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడుతూ 'ఓట్ చోర్, గద్దీ చోడ్' అనేది తమ ప్రధాని నినాదమని, ఇది దేశ వ్యాప్తంగా నిరూపితమైందన్నారు. దీనిని మళ్లీ మళ్లీ నిరూపిస్తామని చెప్పారు. దేదౌలిలోని హర్‌చంద్‌పూర్ విధానసభలో పార్టీ కార్యకర్తలతో జరిగిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటకలో జరిగిన ఓట్ల దొంగతనం ఘటనలను ప్రస్తావించారు. అయితే ఈ కార్యక్రమానికి మీడియాకు అనుమతి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన మహారాష్ట్ర, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల దొంగతనానికి పాల్పడినట్లు 'నలుపు, తెలుపు' ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకుడు చెప్పినట్లు పిటిఐ ఉటంకించింది. మహారాష్ట్రలో తమ పార్టీ, తమ కూటమి లోక్‌సభలో గెలిచాయని, నాలుగు నెలల తర్వాత తాము అసెంబ్లీలో తుడిచిపెట్టుకుపోయామని, దీనిపై దర్యాప్తు చేయగా లోక్‌సభ ఎన్నికల తర్వాత దాదాపు కోటి మంది కొత్త ఓటర్లు ఎన్నికల వ్యవస్థలోకి ప్రవేశించినట్లు బయటపడిందన్నారు. తమ, తమ మిత్ర పార్టీలకు చెందిన ఓట్లు అలాగే ఉన్నాయని, అయితే కొత్త ఓట్లు బిజెపికి వెళ్ళాయని రాహుల్‌గా ఆరోపించారు. వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం... కాంగ్రెస్, ఎన్‌సిపి, శివసేనకు పోలైన ఓట్లలో ఎటువంటి మార్పు లేదని, కానీ బిజెపికి లెక్కకు మించి ఓట్లు పడ్డాయని, కొత్తగా చేర్చబడిన ప్రతి ఓటరు ఆ పార్టీడి అనుకూలంగా



ఓటు వేసినట్లు వెల్లడయిందన్నారు. ఈ విషయమై దర్యాప్తు చేయాలని, నాలుగు నెలల్లో కోటి మంది ఎలా ఓటర్లుగా చేరారో వివరాలను ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు రాహుల్ చెప్పారు. దీనికి ఎన్నికల కమిషన్ తిరస్కరించిందన్నారు. తమకు ఎలాంటి జాబితాగానీ, వీడియోగానీ అందించలేదన్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత కూడా ఇలాంటి అక్రమాలు బయటపడ్డాయని గాంధీ ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్‌లోని ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు ఓటర్లను పరిశీలించగా, రెండు లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నట్లు తేలింది, ఇది అక్కడ బిజెపి విజయానికి దారితీసింది. బెంగళూరు సెంట్రల్‌లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. తమ కార్యకర్తలు నాలుగు నెలలుగా ఒకదాన్ని మాత్రమే దర్యాప్తు చేశారు, ఆ సమయంలోనే నకిలీ ఓట్లను కనుగొన్నారని రాహుల్‌గాంధీ అన్నారు. బిజెపి ఓట్లను దొంగిలించిందని ఆరోపిస్తూ, ఇటువంటి ఘటనలు బెంగళూరు లేదా మహారాష్ట్రకే పరిమితం కాదని ఆయన ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో భారీ స్థాయిలో జరిగిందన్నారు. బిహార్‌లో తన ఇటీవలి ఎన్నికల పర్యటనను ప్రస్తావిస్తూ, అక్కడ కూడా ఇలాంటి అక్రమాలు గుర్తించబడ్డాయని గాంధీ పేర్కొన్నారు.

## అత్యాచార బాధితురాలి విచారణ తీరు ఇలాగా ?
### ట్రయల్‌కోర్టుపై 'సుప్రీం' విస్మయం

**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్‌లోని ట్రయల్‌కోర్టు అత్యాచార బాధితురాలిపై విచారణ జరిపిన తీరును వ్యతిరేకిస్తూ ఆమె వాంగ్మూలాన్ని నాలుగు నెలలు వాయిదా వేయడంపై సుప్రీంకోర్టు పలు ప్రశ్నలను లేవనెత్తింది. నాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్థివాలా, జస్టిస్ కె.వి. విశ్వనాథన్ ధర్మాసనం ఈ కేసులో విచారణ సంస్థ అయిన ట్రయల్ కోర్టు, సిబిఐను వివరణ కోరింది. బాధితురాలు సాక్షి పెట్టె (విట్నెస్ బాక్స్)లోకి ప్రవేశించిందని వాంగ్మూలాన్ని నమోదుచేస్తున్న పనిలో ఉందని బెంచ్‌కు సమాచారం అం దింది. ఆమె తదుపరి విచారణను డిసెంబరు 18కు ట్రయల్ కోర్టు వాయిదా వేసింది. 'సాక్షులు ముఖ్యంగా బాధితురాలు సాక్షి పెట్టెలోకి ప్రవేశించిన తర్వాత ఈ విచారణ ముక్కలుముక్కలైందని మేం అర్థంచేసుకోలేకపోతున్నాం. అత్యాచార బాధితురాలి తదుపరి విచారణను నాలుగు నెలల కాలానికి ఎందుకు వాయిదా వేయాలి. ఈ విషయంలో ట్రయల్ కోర్టు వివరణ ఇవ్వాలని మేం కోరుతున్నాం' అని అత్యున్నత న్యాయస్థానం చెప్పింది.ట్రయల్ కోర్టు ధర్మాసనం తదుపరి విచారణకు సమయం ఇవ్వడం ద్వారా నిందితులు ప్రాసిక్యూషన్ సాక్షాలను తారుమారు చేయడానికి 'తెలియకుండానే సులభతరం చేసింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం కాబట్టి మనం విస్మరించకూడదు' అని అత్యున్నత న్యాయస్థానం జోడించింది. ముఖ్యంగా విచారణ అధికారిగా ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్, సిబిఐ కూడా వివరణ ఇవ్వాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. 'చాలాకాలంగా బాధితురాలిని సాక్షిలో పెట్టెలో ఎందుకు పెట్టారు? బాధితురాలు సాక్షి పెట్టెలోకి అడుగుపెట్టే మొదటి సాక్షి అయ్యి ఉండాలి కదా' అని ధర్మాసనం సందేహం వ్యక్తంచేసింది. ఈ కేసులో నిందితుడికి కలకత్తా హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ గత ఏడాది సెప్టెంబరులో సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈరోజు నుంచి ఒక వారంలోపు ఈ కోర్టుకు నివేదిక చేరేలా పిలవండి అని ధర్మాసనం సెప్టెంబరు 8న ఆదేశించింది. నిందితుడు తన కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి ధర్మాసనం వారం రోజుల సమయం మంజూరు చేస్తూ, పిటిషన్ విచారణను సెప్టెంబరు 22కు వాయిదా వేసింది.

## గెలుపు ఆధారంగా సమతుల్యత
### బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై కాంగ్రెస్ హితవు





**న్యూఢిల్లీ :** త్వరలో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని మహాఘట్‌బంధన్ భాగస్వామ్యపక్షాల మధ్య సీట్ల పంపకాలపై చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సీట్ల కేటాయింపు సమయంలో గెలుపపరంగా మంచి, చెడు మధ్య సమతుల్యతను కొనసాగించాలని కాంగ్రెస్ పేర్కొంది. అదే విధంగా ఇప్పటికే కూటమిలోని పార్టీలకు కేటాయించబడిన సీట్లను కొత్త భాగస్వామ్యపక్షాలకు కచ్చితంగా కేటాయించాలని కూడా సూచించింది. రానున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతిపక్ష పార్టీల 'మహాఘట్‌బంధన్' (గ్రాండ్ అలయన్స్)లో హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం), పశుపతి కుమార్ పరాస్ రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్‌ఎల్‌జెపి)లను చేర్చాలనే చర్చల మధ్య కాంగ్రెస పై విధంగా పేర్కొంది. బుధవారం బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ రామ్, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు షకీల్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి సంయుక్త విలేకరుల సమావేశంలో ఎఐసిసి రాష్ట్ర ఇన్‌ఛార్జ్ కృష్ణ అల్లవారు మాట్లాడారు. ఈ సందర్భంగా బిజెపిపై విమర్శలు చేశారు. ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై 'ఓటు చోరీ'లో పాల్గొంటున్నదని ఆరోపించారు. ఓట్ల దొంగతనం కోసం ఒక నిర్దిష్ట ప్రక్రియను అనుసరిస్తున్నారని అల్లవారు ఆరోపించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా చేసిన కుట్రలో భాగంగా దేశంలో 'ఓట్ల దొంగతనం'ను ముందుకు తెచ్చారన్నారు. మొదట నరేంద్ర మోదీ ఎన్నికల కమిషనర్‌ను ఎంపిక చేసే ప్రక్రియను మార్చారని, దీనిలో ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, హోంమంత్రిని ఈ ప్రక్రియలో చేర్చారని, ఆ తరువాత ఎన్నికల కమిషనర్‌పై ఎటువంటి చర్య తీసుకోకుండా చట్టంలో మార్పు చేశారని, కాంగ్రెస్ నాయకుడు ఇందిరా భవన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. దీనికి తోడూ ఓటరు జాబితాలో ట్యాంపరింగ్ జరుగుతోందని, ఈ నిజం మొత్తం దేశం ముందు బయటపడిందని పేర్కొన్నారు. పోలింగ్, కౌంటింగ్ రోజున రిగ్గింగ్ జరిగిందని కూడా ఆయన ఆరోపించారు. దీనికి అతిపెద్ద ఉదాహరణ వారణాసిలో జరిగిన లోక్‌సభ ఎన్నికలేనన్నారు. ఓటు చోరీ ప్రతి ఒక్కరికి సమస్య అని చెప్పారు. ఓటు దొంగలు ప్రజలకు సేవ చేయడం గురించి పట్టించుకోరని ఆరోపించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, విద్య, ఆరోగ్యం, వలసలు, నేరాలు, పేపర్ లీక్‌లు వంటి సమస్యల పట్ల 'ఓటు చోరి ప్రభుత్వం' ఉదాసీనంగా ఉందని దుయ్యబట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు ఓటు చోరీ మూలకారణమని, బిహార్‌లో పరిస్థితి మారాలంటే, ప్రభుత్వాన్ని మార్చాలని ఆయన ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖరే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బిహార్ పార్టీ నాయకులతో మంగళవారం జరిగిన సమావేశాన్ని ప్రస్తావిస్తూ ప్రచారం, మ్యానిఫెస్టో, సీట్ల భాగస్వామ్యం, అభ్యర్థుల ఎంపికకు సంబంధించి భవిష్యత్ వ్యూహాన్ని రూపొందించామని అల్లవారు అన్నారు. కొత్త పార్టీలు కూటమిలోకి వస్తే ప్రతి పార్టీ తమ వాటా నుండి సహాయం చేయాల్సి ఉంటుందన్నారు. సీట్ షేరింగ్‌ను మంచి సమయంలో సానుకూలంగా ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రయత్నమని, దానిని విజయవంతంగా చేస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో రాష్ట్రంలో మరో యాత్ర చేపట్టే ప్రణాళిక ప్రస్తుతం లేదని అల్లవారు కూడా అన్నారు.

## బిఆర్‌ఎస్ ధనికపార్టీ
### 2023--24 ఆర్థిక ఏడాదిలో రూ. 685.51 కోట్ల ఆదాయం ఆర్జన
### టాప్‌లో ఐదు పార్టీల్లో టిఎంసి, బిజెడి, టిడిపి, వైఎస్‌ఆర్
### 40 ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం రూ.2,532 కోట్లు

**న్యూఢిల్లీ :** దాదాపు 40 ప్రాంతీయ రాజకీయ పార్టీలు 2023--24 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా తమకు రూ.2,532.09 కోట్ల ఆదాయం ఉన్నట్లు ప్రకటించాయి. వీటిలో 70 శాతానికి పైగా ఎన్నికల బాండ్ల ద్వారానే నిధులు వస్తున్నాయని డెమోక్రటిక్ రిఫారమ్స్ (ఎడిఆర్) తన విశ్లేషణలో పేర్కొంది. భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అత్యధికంగా రూ.685.51 కోట్ల ఆదాయన్ని కలిగి ఉంది. ఆతర్వాత తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)కు రూ.646.39 కోట్లు, బిజు జనతాదళ్ (బిజెడి)కు రూ.297.81 కోట్లు, తెలుగుదేశం పార్టీ (టిడిపి)కి రూ.285.07 కోట్లు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి రూ.191.04 కోట్ల ఆదాయం ఉంది. 40 ప్రాంతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం ఆదాయంలో ఈ ఐదు టాప్ పార్టీల ఆదాయం మొత్తం ఆదాయంలో 83.17 శాతంగా ఉంది. 2023--24 ఆర్థిక సంవత్సరంలో 40 ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం రూ.2,532.096 కోట్లు కాగా, మొత్తం ఆదాయంలో 70 శాతానికి పైగా (రూ.1,796.024 కోట్లు) ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలు వచ్చాయని ఎడిఆర్ తన నివేదికలో పేర్కొంది. ఆదాయ వివరాల సమర్పణకు గడువు ముగిసి 313 రోజులు అయినా కూడా 20 ప్రాంతీయ పార్టీలకు చెందిన ఆడి రిపోర్ట్‌ను భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) తన వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తేలని ఎడిఆర్ తెలిపింది. అయితే మరో 20 పార్టీల ఆడిట్ నివేదికలు సమర్పణకు గడువు తేదీ నుండి 12 నుండి 216 రోజుల ఆలస్యం తర్వాత ఇసిఐ తన వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. 2022--23 ఆర్థిక సంవత్సరంలో ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం రూ.1,736.85 కోట్లు కాగా, 2023--24 ఆర్థికసంవత్సరంలో ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం 45.77 శాతం పెరిగినట్లు ఎడిఆర్ గుర్తించింది. టిఎంసికి రూ.312.93 కోట్లు పెరగగా, టిడిపి, బిజెడి కూడా గణనీయమైన పెరుగుదలను నమోదు చేశాయి. 27 ప్రాంతీయ పార్టీలు తమ ఆదాయంలో కొంత మొత్తాన్ని ఖర్చు చేయలేదని ప్రకటించగా, 12 రాజకీయ పార్టీలు మాత్రం సేకరించిన ఆదాయం కంటే అధికంగా ఖర్చు పెట్టాయి. బిఆర్‌ఎస్ రూ.430.60 కోట్లు ఖర్చు చేయకుండా ఉండగా, టిఎంసి రూ.414.92 కోట్లు, బిజెడి రూ. 253.79 కోట్లు ఖర్చు చేయలేదు. అయితే వైఎస్‌ఆర్ కాంగ్రెస్, ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె), సమాజ్ వాదీ పార్టీ, జనతా దళ్ (యునైటెడ్) సహా సహా 12పార్టీలు తమ ఆదాయం కంటే ఎక్కువగా ఖర్చు చేశాయి. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ఏకంగా దాదాపు 55 శాతం ఖర్చుచేసింది. గోవా ఫార్వర్డ్ పార్టీ తమకు ఆదాయం రాలేదని ప్రకటించగా, రూ.1.56 లక్షల ఖర్చులను ప్రకటించింది. పార్టీల మొత్తం ఆదాయంలో రూ.2,117.85కోట్లు (83.64 శాతం) స్వచ్ఛంద విరాళాల నుండి వచ్చాయని ఎడిఆర్ నివేదిక పేర్కొంది. ఇందులో ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన విరాళాలు రూ.1,796.02 కోట్లు (70.93 శాతం) ఉన్నాయని, వీటిని బిఆర్‌ఎస్, టిఎంసి, బిజెడి, టిడిపి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, డిఎంకె సహా 10 పార్టీలు మాత్రమే ప్రకటించాయని తెలిపింది.

ఎడిఆర్ ఆర్టీఐ దరఖాస్తుకు ప్రతిస్పందనగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించిన డేటా ప్రకారం, 2023--24 ఆర్థిక సంవత్సరంలో పార్టీలు రూ.4,507.56 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను తిరిగి పొందాయి. ఇందులో దాదాపు 55.998 శాతం (రూ.2,524.14 కోట్లు) జాతీయ పార్టీలు, 39.84 శాతం (రూ.1,796.02 కోట్లు) ప్రాంతీయ పార్టీలు తిరిగి పొందాయి. 2023--24 ఆర్థిక సంవత్సరంలో కేవలం మూడు జాతీయ పార్టీలు (బిజెపి, కాంగ్రెస్‌ష ఆమ్ ఆద్మీ పార్టీ) మాత్రమే ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాలు అందుకున్నాయని నివేదిక పేర్కొంది.

## రాజ్యసభలో ప్రతిపక్షాలకు స్వేచ్ఛ ఇవ్వండి
### తొలి ఉపరాష్ట్రపతి ఉపదేశం మరువకూడదు
### సి.పి.రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ అభినందన





**న్యూఢిల్లీ:** భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికైన అధికార ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్‌పార్టీ హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది. భారత తొలి ఉపరాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ 1952లో సభాకార్యకలాపాల గురించి చెప్పిన ఉపదేశాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది.''ప్రభుత్వ విధానాలను న్యాయంగా,నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా విమర్శించడానికి ప్రతిపక్ష గ్రూపులను అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశపాలన స్థాయికి భ్రష్టుపట్టిపోతుంది'' అని సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పారని పేర్కొంటూ ఆచరణలో ఆయన రాజ్యసభలో ఆ విలువలు తు.చ తప్పకుండా పాటించారని కూడా గుర్తుచేసింది. ఉపరాష్ట్రపతి రాజ్యసభకు ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తారు. కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ ఎక్స్‌వేదిగా ఈ మేరకు ఒక అభినందన సందేశం పోస్టు చేశారు. గొప్ప తాత్వికవేత్త, విద్యావేత్త, రచయిత, దౌత్యవేత్తగా సర్వేపల్లి రాధాకృష్ణన్ 1952 మే 16వ తేదీన రాజ్యసభ సమావేశాల ప్రారంభంరోజున సభలో మాట్లాడుతూ, ''నేను ఏ రాజకీయపార్టీకీ చెందినవాడిని కాదు, అంటే నేను ఈ సభలో ఉన్న అన్నిపార్టీలకూ చెందినవాడినని అర్థం, ఈ సంప్రదాయాలను సమున్నతస్థానంలో నిలబెట్టడానికి నా వంతు కృషి చేస్తాను, ప్రతిరాజకీయపార్టీ పట్లా న్యాయబద్ధంగా నిజాయతీగా, నిష్పక్షపాతంగా వ్యవహరించడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అత్యున్నతమైన సంప్రదాయం, ఎవరి పట్లా దుష్టతలంపుతో వ్యవహరించకూడదు, అదే పార్లమెంటుకు గొప్ప ప్రతిష్ఠ, ప్రభుత్వ విధానాలను స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా, నిర్మొహమాటంగా విమర్శించడానికి ప్రతిపక్షాలను సభలో అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశపాలన స్థాయికి దిగజారిపోతుంది'' అని సర్వేపల్లి చెప్పారని జైరామ్ రమేశ్ పోస్టు చేశారు.


**ఎలా చూసినా రాధాకృష్ణన్‌ది ఓటమే**

ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ మంగళవారం జరిగిన ఓటింగ్‌లో 452 ఓట్లతో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికయ్యారు. ఆయనతో తలపడిన 'ఇండియా కూటమి' అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు లభించాయి. రాధాకృష్ణన్ విజయంపట్ల జైరామ్ రమేశ్ అభినందనలు తెలియజేశారు. అదే విధంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి కూడా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. సుదర్శన్‌రెడ్డి 40 శాతం ఓట్లు గెలుచుకున్నారు. 2022లో ప్రతిపక్ష అభ్యర్థి 26 శాతం ఓట్లు మాత్రమే పొందారు. గణాంకాల ప్రాతిపదికపై బిజెపి సాధించిన ఈ విజయం అటు నైతికపరంగా, ఇటు రాజకీయంగా చూసినాకూడా ఓటమికిందే లెక్క అని ఆయన విమర్శించారు. పార్లమెంటు ఉభయసభలలో మొత్తం 781 మంది ఎంపీలు ఉండగా 98.2 శాతంమంది ఓటు వేశారు. 767 మంది ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. 752 ఓట్లు చెల్లుబాటుకాగా, 15 ఓట్లు చెల్లుబాటు కాకుండా వృథా అయ్యాయి.

## ఫ్రాన్స్ రాజకీయ స్థిరత్వమే లక్ష్యం
### కొత్త ప్రధానమంత్రి లెకోర్ను ప్రకటన

**పారిస్:** ఫ్రాన్స్ కొత్త ప్రధానమంత్రిగా సెబాస్టియన్ లెకోర్ను (39) బాధ్యతలు తీసుకున్నారు. ఫ్రాన్స్‌దేశ స్వాతంత్ర్య రక్షణ, ఫ్రెంచ్ ప్రజలకు సేవ చేయడం, ఒక స్పష్టమైన మార్గదర్శకత్వంతో జవాబుదారీ ప్రభుత్వాన్ని నిర్మించేందుకే అధ్యక్షుడు మేక్రాన్ తనకు ఈ బాధ్యతలు అప్పగించారని చెప్పారు. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. మేక్రాన్ సారథ్యంలో 2017 నుండి ఇప్పటివరకూ నలుగురు ప్రధానమంత్రులు మారారు. నాలుగో ప్రధానమంత్రి బేరౌ సహా నుండి లెకోర్ను తాజాగా బాధ్యతలు తీసుకున్నారు. దేశాధ్యక్షుడు మేక్రాన్‌కు లెకోర్ను అత్యంత సన్నిహిత మిత్రుడు. గత ఏడాది మేక్రాన్ దేశంలో ఆకస్మిక ఎన్నికలు నిర్వహించడంతో ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రాలేదు. అప్పటినుండి మూడు ప్రభుత్వాలు మారాయి. దేశంలో సంక్షోభ పరిస్థితి కొనసాగుతున్నది. ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. జిడిపిలో ప్రభుత్వ లోటు 113 శాతం పైగా పెరిగింది. ఒకవైపు ప్రజలు తీవ్రనిరసనలు వ్యక్తం చేస్తున్న తరుణంలో పారిస్‌లోని ప్రధానమంత్రి అధికార నివాసం--కార్యాలయ భవంతి ''హోటల్ డీ మాటిగ్నాన్''లో ఈ పదవీబాధ్యతల మార్పిడి కార్యక్రమం జరిగింది. దేశాధ్యక్షుడు మేక్రాన్‌కు, బేరౌకు వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రదర్శకులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. అనేకమంది ప్రదర్శకులను పోలీసులు అరెస్టులు చేసిన తర్వాత ఈ అధికార మార్పిడి జరిగింది. బేరౌ ప్రభుత్వం పార్లమెంటు దిగువసభలో అవిశ్వాస తీర్మానం ద్వారా సెప్టెంబరు 8న అధికారం కోల్పోయింది. ఫ్రాంకోయిస్ బేరౌ 2024 డిసెంబరు 13న ఫ్రెంచ్ ఫిఫ్త్ రిపబ్లిక్ 46వ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తొమ్మిదినెలల పరిపాలన పూర్తికాకుండానే సభావిశ్వాసం కోల్పోయారు. అంతకుముందు మైఖేల్ జీన్ బార్నియర్ (73) 2024 సెప్టెంబరు 5వ తేదీ నుండి డిసెంబరు 12 వరకూ 37 రోజులు అతిస్వల్పకాలం అధికారంలో మనుగడ సాగించారు. ఈ విధంగా మేక్రాన్ అధ్యక్షతన మూడో ప్రభుత్వ ప్రధానమంత్రిగా లెకోర్ను మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు లెకోర్ను విదేశాంగమంత్రిగా పనిచేశారు. 2014 లో వెర్నోన్ మేయర్ పదవిని గెలుచుకుని లెకోర్ను తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 11 ఏళ్ల వ్యవధిలో అతి చిన్న వయసులో దేశ ప్రధానమంత్రిస్థాయికి ఎదిగారు

## దేశవ్యాప్తంగా త్వరలో ఓటర్ల జాబితా సవరణ !



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల బీహార్‌లో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను దేశవ్యాప్తంగా చేపట్టేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నట్లు కొన్ని మీడియా వర్గాల ద్వారా వెల్లడైంది. అయితే ఎప్పటి నుంచి ఆ ప్రక్రియ మొదలవుతుందన్న దానిపై స్పష్టత లేదు. ఆ భారీ కసరత్తుకు చెందిన తేదీలను ఇంకా ప్రకటించలేదు.అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ముఖ్య ఎన్నికల అధికారులతో బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం భేటీ అయ్యింది. పాన్ ఇండియా స్థాయిలో ఓటర్ల జాబితా సవరణ చేపట్టేందుకు కావాల్సిన అంశాల గురించి చర్చించినట్లు తెలుస్తోంది. బిహార్‌లో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల అక్కడ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ద్వారా సుమారు 65 లక్షల ఓటర్లను తొలగించిన విషయం తెలిసిందే. అయితే దేశశ్యాప్తంగా అక్రమ ఓటర్లను తొలగించేందుకు త్వరలో ఎన్నికల సంఘం ఆ ప్రక్రియను మొదలుపెట్టనున్నది.

## మీభర్త 'ఆస్తుల వివరాలన్నింటినీ' వెల్లడించండి
### దివంగత సంజయ్‌కపూర్ భార్య ప్రియకపూర్‌కు ఢిల్లీ హైకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ :** వ్యాపారవేత్త అయిన దివంగత భర్త సంజయ్ కపూర్ ఆస్తుల వివరాలు అన్నింటినీ వెల్లడించాలని ఆయన భార్య ప్రియాకపూర్‌ను బుధవారం ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జూన్ 12న ఆయన మరణించిన రోజునాటికి ఉన్న స్థిర, చర ఆస్తుల వివరాలు అన్నింటినీ తెలియజేయాలని సూచించింది. రూ.30,000 కోట్ల విలువైన సంజయ్‌కపూర్ ఆస్తులలో వాటాను కోరుతూ ఆయన మాజీభార్య నటి కరిష్మా కపూర్ సంతానమైన ఇద్దరు పిల్లలు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ జ్యోతిసింగ్ ప్రియా కపూర్‌కు ఈ ఆదేశాలు జారీచేశారు. ప్రియాకపూర్ జస్టిస్ జ్యోతి సింగ్‌కు వివరిస్తూ ఆ ఇద్దరు పిల్లలు సమారియా కపూర్ (20), కియాన్ రాజ్ కపూర్ (15) ఇప్పటికే కుటుంబ ట్రస్ట్ నుండి రూ.1,900 కోట్లు వసూలుచేశారని, వారికి ఇంత కంటే ఏమి కావాలి?అని అడిగారు. ప్రియాకపూర్ తరపు సీనియర్ న్యాయవాది రాజీవ్‌నాయర్ తనవాదనలు వినిపిస్తూ 'వీలునామా రిజిస్టర్డ్ కాలేదు అంటే అది 'చెల్లదు', జోడించబడింది' అని సమర్పించారు. అయితే ప్రజలను వీధుల్లో వదిలేసినట్లు కాదు అన్నారు. కోర్టు ప్రియాకపూర్‌కు నోటీస్ జారీచేస్తూ విచారణను అక్టోబరు 9కు వాయిదా వేసింది. ప్రతివాది ప్రియాకపూర్ జూన్ 12నాటికి అన్ని స్థిర, చర ఆస్తులను ప్రకటించాలి అని జడ్జి సూచించారు. కరిష్మా కపూర్‌కు 2003 లో సంజయ్‌కపూర్‌తో వివాహం జరిగింది. కానీ 2016లో విడాకులు తీసుకున్నారు. జూన్12న లండన్‌లో పోలో మ్యాచ్ ఆడుతున్న సమయంలో తేనెటీగను మింగడంతో సంజయ్ కపూర్ గుండెపోటుతో మరణించాడు. ఆయన తల్లి రాణి ఇటీవల తన కుమారుడి మరణంపై విచారణ జరపాలని యుకె అధికారులకు రాసిన ఒక లేఖలో కోరారు. అది సహజ మరణం కాదని, ఆర్థిక మోసం కోసం కుట్ర చేసి హత్యచేశారన్న అనుమానం ఉందని తెలియజేశారు.

## భారత్‌తో న్యాయవిరుద్ధంగా వ్యాపారంచేసే అవసరం లేదు : నవర్రో

**వాషింగ్టన్:** భారత్‌తో న్యాయవిరుద్ధంగా వ్యాపారం చేసేంత అవసరం అమెరికాకు లేదని వైట్‌హౌస్‌లో వాణిజ్యసలహాదారు పీటర్ నవర్రో అన్నారు. గడచిన కొద్దివారాలుగా ఆయన భారత్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. భారత్‌తో అన్యాయంగా, అనుచిత వ్యాపారం చేసే అవసరం తమకు లేదని, కానీ ఆ దేశం మాత్రం నిరాశతో తెగించి అమెరికా మార్కెట్లను అందిపుచ్చుకోవాలని ఎదురుచూస్తోందని అన్నారు. భారత్--అమెరికా రెండు దేశాలూ వాణిజ్య చర్చలలో ఉన్న ఆటంకాలను తొలగించుకోవడానికి సంప్రదింపులను కొనసాగిస్తాయని, విజయవంతంగా చర్చలు ముగించడం పెద్దకష్టమైన విషయం కాదనీ ట్రంప్ సోషల్ మీడియా పోస్టింగ్ చేసిన తర్వాత నవర్రో పైవిధంగా స్పందించారు. ఇటీవల ఎక్స్ వేదికగా పీటర్ నవర్రో వరుస విమర్శలు చేస్తున్నారు. ట్రంప్ పాలనా యంత్రాంగం కూడా భారత్‌పై విమర్శలు చేస్తోంది. రష్యా నుండి ముడి చమురు కొనుగోలు సమస్యను పదేపదే ప్రస్తావిస్తున్నది. ఉక్రేన్‌లో యుద్ధానికి భారత్ ఆజ్యం పోస్తోందని ట్రంప్ యంత్రాంగం తరచు విమర్శలు చేస్తోంది. భారతదేశం ప్రపంచంలో ఏదేశమూ వసూలు చేయనంత భారీ సుంకాలను వసూలు చేస్తోందని నవర్రో తాజాగా విమర్శించారు. లాభాలు సంపాదించుకోవడానికే రష్యా నుండి భారత్ ముడి చమురు కొనుగోలు చేస్తోందని ఆరోపించారు. భారత్‌పై గతనెలలో 50 శాతం సుంకాలు విధించిన తర్వాత రెండు దేశాల మధ్యా సంబంధాలు గణనీయంగా క్షీణించాయి.

# గాజా ఆకలే ఇజ్రాయెల్ నీచ ఆయుధం!

అనైతిక యుద్ధానికి, హింసావాదానికి మారుపేరైన ఇజ్రాయెల్ రోజురోజుకూ మరింత దారుణంగా వ్యవహరిస్తున్నది. గాజాలో పెరుగుతున్న ఆకలినే ఆయుధంగా మలచుకొని, పాలస్తీనాను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నది. ఆకలి సమస్యను తీవ్రతరం చేసే ఏ విధానాన్నైనా వెంటనే నిలిపివేయాలని 140 మంది అంతర్జాతీయ ప్రముఖ ఆర్థిక వేత్తలు అంతర్జాతీయ సమాజాన్ని, ప్రత్యేకించి అమెరికాను కోరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. గాజా ప్రజలు ఆకలితో అల్లాడుతుంటే, వారికి మానవతా సాయం కూడా అందకుండా అడ్డుకుంటూ ఇజ్రాయెల్ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నది. ఆకలి సమస్య తీరాలంటే, తమ డిమాండ్లు అంగీకరించాలని ఒత్తిడి తెస్తున్నది. హమాస్ ఏరివేత పేరుతో గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న మారణకాండను ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. పలు దేశాల్లో పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు, ర్యాలీలు జరుగుతున్నాయి. ఈ సమస్యకు త్వరలోనే తెరపడుతుందని, ఇజ్రాయెల్‌ను యుద్ధ విరమణకు ఒప్పిస్తామని 'నోబెల్ శాంతి బహుమతి'ని కోరుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అట్టహాసంగా ప్రకటించారు. ఈజిప్టులో శాంతి చర్చలంటూ హడావుడి చేశారు. హమాస్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని, శాంతి స్థాపన తథ్యమని కూడా చెప్పారు. కానీ, పరిస్థితి మెరుగుపడకపోగా, రోజురోజుకూ దిగజారుతున్నది. రష్యా, ఇరాన్ వంటి దేశాలపై ఆంక్షల ఆయుధాన్ని ప్రయోగిస్తున్న అమెరికాకు ఇజ్రాయెల్ అరాచకం కనిపించకపోవడం విచిత్రం. గత రెండు సంవత్సరాలుగా ఇజ్రాయెల్ అనుసరిస్తూ వస్తున్న విధానాలను, తత్ఫలితంగా పాలస్తీనాలో పెరుగుతున్న కరువు పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, సమీక్షించి, అధ్యయనం చేసిన ఆర్థికవేత్తలు విడుదల చేసిన ప్రకటన అక్కడి వాస్తవాలను కళ్లకు కడుతున్నది. అంతకుముందు, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుకు, అక్కడ పార్లమెంటుకు 23 మంది ప్రముఖ ఆర్థికవేత్త లు రాసిన లేఖపై కనీస స్పందన లేదు. మానవ హక్కుల ఉల్లంఘనల పట్ల వారు ఆందోళన వ్యక్తం చేసినా ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదు. ఆ లేఖకు కొనసాగింపుగా ఇప్పుడు ఆర్థికవేత్తలు జారీ చేసిన సంయుక్త ప్రకటనకైనా స్పందన ఉంటుందా? అనేది అనుమానమే. గాజాలో జీవన పరిస్థితులను పూర్తిగా ధ్వంసంచేసి, ఒక జాతిని సమూలంగా తుడిచిపెట్టాలన్న ఇజ్రాయెల్ వైఖరి స్పష్టంగానే కనిపిస్తున్నది. అందుకు, అంతర్జాతీయ యుద్ధ నియమాలను ఉల్లంఘిస్తున్నది. జనావాసాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలను కూడా ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకొని దాడులు కొనసాగిస్తున్నది. ఒకవైపు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచి స్తూ, మరోవైపు సహాయ శిబిరాలపైనా బాంబులు కురిపిస్తున్నది. గాజాలో అత్యధిక శాతం భవనాలు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయి. నిత్యావసరాలు కూడా అందని దైన్యం. వైద్య సేవలకు తీవ్ర అంతరాయం. ఆకలి మరణాల పర్వం ప్రారంభం. ఈ పరిస్థితులను ఇజ్రాయెల్ తనకు అనుకూలంగా మార్చుకోవడం దుర్మార్గం. ప్రజల ఆకలిని ఆయుధంగా చేసుకొని, పాలస్తీనాను పాదాక్రాంతం చేసుకోవాలన్న ఆలోచన దారుణం. ఇప్పటివరకూ, ప్రపంచానికి ప్రజాస్వామ్య ముఖచిత్రాన్ని అందిస్తున్నట్టు ఇజ్రాయెల్ చేస్తున్న ప్రకటనలు సత్యదూరం. వాస్తవానికి జాతి నిర్మూలన, సామూహిక విధ్వంసకాండ మాత్రమే ఇజ్రాయెల్ లక్ష్యాలు. ఈ కారణంగానే, గాజాపై ప్రపంచ దేశాల విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదు. పలు దేశాల్లో కొనసాగుతున్న నిరసనలను లక్ష్యపెట్టడం లేదు. ఆకలితో అల్లాడిపోతున్న గాజా ప్రజలకు మానవతా దృష్టితో సాయం అందించాలన్న ఆలోచన అసలే లేదు. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేకుండా, ఆర్థికవేత్తలు ఇజ్రాయెల్ వైఖరిని తప్పుపడుతున్నారంటే, గాజాలో ఎలాంటి దారుణ పరిస్థితులు నెలకొన్నాయో ఊహించుకోవచ్చు. 'గాజాలో నెలకొన్న పరిస్థితులను, ఆకలిని ఆయుధంగా చేసుకుంటున్న ఇజ్రాయెల్ వైఖరి సరికాదు. అంతర్జాతీయ సూత్రాలకు.. మానవతా విలువలకు ఇది పూర్తి వ్యతిరేకం. ఇజ్రాయెల్ వైఖరి మారాలి. ఆకలితో అల్లాడుతున్న ప్రజలను ఆదుకోవడానికి, అంతర్జాతీయ సాయం అందించడానికి అవసరమైన వాతావరణం కల్పించాలి. లేకపోతే, ప్రపంచ దేశాలు ఏకమై, ఇజ్రాయెల్‌ను ఏకాకి చేయక తప్పదు. జెరుసలేంతో ద్వైపాక్షిక సంబంధాలను రద్దు చేసుకున్నప్పుడే కొంత వరకైనా పరిస్థితి చక్కబడుతుంది' అంటున్న ఆర్థికవేత్తల సంయుక్త ప్రకటనను స్వాగతించాలి. ఇజ్రాయెల్‌పై ప్రపంచ దేశాలు ఒత్తిడి పెంచాలి. పరిస్థితి చక్కబడేందుకు ప్రయత్నించాలి.

ప్రజాపక్షం
11-09-2025, గురువారం

# సెప్టెంబర్ 17ను 'ప్రజాపాలన దినోత్సవం'గా కాదు...
# తెలంగాణ విలీన దినోత్సవంగా నిర్వహించాలి
## అదే పోరాట యోధులకు అసలైన నివాళి


కూనంనేని సాంబశివరావు
శాసనసభ్యులు
సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

నిజాం నవాబు రాచరిక, భూస్వాముల దాస్య శృంఖలాలను తెంచుకొని 77 సంవత్సరాల క్రితం స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న హైదరాబాద్ సంస్థాన స్వాతంత్ర్య సమరగాథను స్మరించుకుందాం. దేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్టు 15న రాగా హైదరాబాద్ సంస్థానంలో 1948 సెప్టెంబర్ 17న దాదాపు ఒక సంవత్సరం తరువాత మువ్వన్నెల జెండా ఎగిరింది. ఆ నడుమ కాలంలో ప్రజోద్యమం ఉధృతంగా కొనసాగుతున్న క్రమంలో ఆంధ్ర మహాసభ ప్రతినిధిగా రావి నారాయణ రెడ్డి, కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధిగా బద్దం ఎల్లారెడ్డి, ఎఐటియుసి ప్రతినిధిగా మగ్దుం మొహియొద్దీన్‌లు 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. నిజాం నవాబుకు, భూస్వాములకు ప్రైవేట్ సైన్యంగా వున్న ఖాసీం రజ్వీ నేతృత్వంలోని రజాకారులపై ప్రజలు ఎర్రజెండా పట్టుకొని తిరగబడ్డారు. వారి తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి వొడిసెలు, గుత్పలు, కారాలతో ఎదురుతిరిగారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధ దళాలు ప్రజలకు దిశానిర్దేశం చేస్తూ దొరల , భూ స్వాముల కబంధ హస్తాల నుండి ఒక్కొక్క గ్రామాన్ని విముక్తి చేస్తూ, 3వేల గ్రామాలలో 10 లక్షల ఎకరాలను ప్రజలకు పంచిన ఘన చరిత్ర ఆ మహత్తర పోరాటానిది. దాదాపు 4,500 మంది యోధులు ప్రాణాలను తెలంగాణ నేల తల్లికి అర్పణ చేసి పోరాట సమిధులై తెలంగాణ నేలను ఎర్ర నేలగా మార్చి నెత్తుటి అక్షరాలతో చరిత్రలో లిఖించబడ్డారు. ఆ పోరాటాల వారసత్వం, దాని గాథలు ఈనాటికి ఏ గ్రామం వెళ్ళినా వినబడుతాయి. కనబడుతాయి.

ఆ పోరాటమే హైదరాబాద్ సంస్థానంలో స్వాతంత్రోద్యమాన్ని కీలక మలుపు తిప్పింది. మట్టి మనుషుల్ని మహావీరులుగా తీర్చిదిద్దింది. ఆ తరంలో వట్టికోట అల్వార్ స్వామి, దాశరథి, మఖ్దూ మొహియుద్దీన్, సుద్దాల హనుమంతు, బండి యాదగిరి లాంటి మహాకవులకు ఆ వారసత్వంలో గద్దర్ లాంటి ప్రజా కళాకారులకు, వేలాదిమంది వీరులకు జన్మనిచ్చిన ఉద్యమమిది ప్రశ్నించే, తిరగబడే తత్వాన్ని తెలంగాణాకు అందించింది. భారతదేశంలో విప్లవాల పురిటిగడ్డ అనగానే తెలంగాణ ముందు వరుసలో ఉంటుంది. సంగీతం నేర్చుకోకపోయినా, సాహిత్యం చదవక పోయినా మట్టి మనుషుల పోరాటాల నుంచి వేల మంది ప్రజా కవులు, ప్రజాగాయకులకు ఈనాటికి జన్మనిస్తున్న విప్లవ మాత మన తెలంగాణ. అలాగే ఆరుట్ల కమలాదేవి, చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, కమలమ్మ వంటి వీరనారీమణులు పోరాటంలో భాగమయ్యారు.

నిజాం రాచరిక ప్రభుత్వాన్ని అంతమొందించడానికి సాగుతున్న రైతాంగ పోరాటాన్ని నివారించడానికి భారత యూనియన్ సైన్యాలు 1948 సెప్టెంబరు 13న హైదరాబాద్ చేరుకోవడం జరిగింది. నిజాం–పటేల్‌ల మధ్య జరిగిన చీకటి ఒప్పంద ఫలితమే సెప్టెంబర్ 17న విలీనం చేస్తున్నట్లు నిజాం రాజు ప్రకటించడం జరిగింది. 1956 వరకు రాజ్‌ప్రముఖ్‌గా కొనసాగి రాజభరణాలు పొందడం జరిగింది. అయితే, అప్పటి వరకు స్వాతంత్ర్యం కోసం ప్రజలను సమాయత్త పరిచి, సంస్థాన విలీన ప్రక్రియను కమ్యూనిస్టులు సులభతరం చేశారు. కమ్యూనిస్టులు పేదలకు పంచిన 10 లక్షల ఎకరాల భూములను భూస్వాములకు తిరిగి అప్పజెప్పడానికి, కమ్యూనిస్టుల ఊచకోతకు అప్పటి నాటి ప్రభుత్వం పూనుకున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని కొనసాగించింది. చివరకు పలు కోణాలలో చర్చించి 1951 మేలో దానిని విరమించింది.

### నిర్బంధంలోనూ గెలిపించిన ప్రజలు

1952 నాటికి మన నాయకులు ఎక్కువ మంది జైళ్లలో ఉండటం వలన, ఓటర్ లిస్టులో పేర్లు నమోదు కానందువలన అభ్యర్థులు దొరకని కారణంతో అన్ని స్థానాలకు పోటీ చేయలేకపోయాం. అప్పటికీ పార్టీపైన నిషేధం తొలగలేదు. దాని వలన పిడిఎఫ్ (పీపుల్ డెమోక్రటిక్ ఫ్రంట్) పేరుతో కొన్ని స్థానాలలోనే పోటీ చేసిన కమ్యూనిస్టు పార్టీకి 36 సీట్లు రాగా, కాంగ్రెస్‌కు అన్ని స్థానాలలో పోటీ చేసి కేవలం 38 స్థానాలు మాత్రమే రావడం జరిగింది. నల్లగొండ లోక్‌సభ స్థానంలో రావి నారాయణరెడ్డి నాడు భారతదేశవ్యాప్తంగా అమితమైన ప్రజాదరణ కలిగిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకంటే ఎక్కువ మెజారిటీ లభించడం ద్వారా తెలంగాణ ప్రజలు కమ్యూనిస్టులను ఎంతగా ఆదరించారో అర్థం చేసుకోవచ్చు.

### తెలంగాణ దినోత్సవంగానే నిర్వహించాలి

సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజాపరిపాలన దినోత్సవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం సబబు కాదు. హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉండి, నేడు కర్నాటకలోభాగమైన కల్యాణ కర్నాటక, మరట్వాడా ప్రాంతాలలో హైదరాబాద్ విలీన దినోత్సవాలను ప్రభుత్వాలే ఎప్పటి నుండో అధికారికంగా నిర్వహిస్తున్నాయి. తెలంగాణా విలీనాన్ని అధికారికంగా జరపడం లేదని సమైక్య రాష్ట్రం లోని ప్రభుత్వాలను దుమ్మెత్తిపోసిన అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ 2021 సంవత్సరం నుండి సమైక్యతా దినోత్సవం పేరుతో తెలంగాణ వీర చరిత్రను కనుమరుగయ్యేలా చేశారు. ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తున్నది. పాత ప్రభుత్వం పెట్టిన పేరును మార్చి, కనీసం తెలంగాణ వీరోచిత పోరును స్ఫురించే విధంగా కాకుండా తెలంగాణ ప్రజాపరిపాలన దినోత్సవంగా పాటించాలని నిర్ణయించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. అసలు నాటి నిజాం హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి మూలమే తెలంగాణలో జరిగిన మహోజ్వల సాయుధ పోరాటం. నాటి హైదరాబాద్ సంస్థానంలోని కన్నడ, మరాఠీ ప్రాంతాలు ఉన్న నేటి కర్నాటక, మహారాష్ట్రలలో విలీన దినోత్సవంగా నిర్వహిస్తుండగా లేని అభ్యంతరం తెలంగాణలో అదే పేరుతో నిర్వహించడంలో ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాగడుతున్నది? నిస్సంకోచంగా సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీనదినోత్సవంగా అధికారికంగా నిర్వహించడమే నాటి యోధులకు అసలైన నివాళి.

### అది హిందూ ముస్లిం పోరాటం కానే కాదు

ఈనాటి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య ఘర్షణలుగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తూ తాము రాజకీయంగా తెలంగాణలో బలపడటానికి ఈ ఘటనను ఉపయోగించుకుంటున్నాయి.

హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లిం అయినప్పటికీ జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములు దాదాపు 90 శాతం హిందువులే. విసునూరు రాంచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాప రెడ్డి ఇంకా అనేక సంస్థానాధిపతులు హిందువులే. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేకమంది ముస్లింలు కూడా చిత్రహింసలకు గురికాబడ్డారు. షేక్ బందగీని విసునూరు రాంచంద్రారెడ్డికి చెందిన గుండాలు చంపివేశారు. ప్రఖ్యాత జర్నలిస్టు షోయబుల్లా ఖాన్‌ను హైదరాబాద్ నడిబజారులో రజాకార్లు క్రూరంగా చంపారు.

ఈనాటి ఖమ్మం జిల్లా ఆనాటి వరంగల్ జిల్లాలో రజబ్ ఆలి లాంటి యోధులు నిజాం రాచరికానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. డాక్టర్ రాజ్‌బహుదూర్ గౌర్ తో కలిసి మఖ్దూం మొహియొద్దీన్, ప్రొ॥ఆలం కుంద్ మిరి, జవ్వాద్ రజ్వీ,(సాలార్‌జంగ్ మ్యూజియం ఆనాటి లైబ్రేరియన్) ప్రొ॥ ఖయ్యూంఖాన్ లాంటి అనేక మంది ముస్లీం విద్యావేత్తలు నిజాం రాచరికపాలనకు వ్యతిరేకంగా కామ్రేడ్స్ అసోషియేషన్‌ను ఏర్పాటు చేశారు. మహ్మద్ రఫీ ఉస్మానియా యూనివర్శిటీలో నిజాంకు వ్యతిరేకంగాజాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. నిజాం వ్యతిరేకపోరాటంలో అగ్రగామిగా నున్న అల్లా ఉద్దీన్‌ని నిజాం మూకలు చంపివేయడం జరిగింది. ఇలా ఎంతో మంది ముస్లింలు నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. చిత్రహింసలకు, హత్యలకు గురైనారు. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన ముగ్గురు రణసేనానులలో మఖ్దూం మొహియుద్దీన్ ప్రఖ్యాత కవి, విప్లవకారుడు. నిజాంను గద్దె దించడంలో మతాలకు అతీతంగా హిందువులతో సహా వీరోచిత పాత్ర పోషించిన ముస్లింలను విస్మరిస్తే చరిత్ర క్షమించదు.





ఆనాటి తెలంగాణ పోరాటంలో, అలాగే దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి పాత్ర లేని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు తెలంగాణ పోరాటంలో తమ పాత్ర లేదని ఒప్పుకుంటూనే గత పోరాటాన్ని స్మరించుకోవడం తప్పుకాదని విచిత్ర వాదనలు తీసుకొస్తున్నారు. ఆనాటి కమ్యూనిస్టులు త్యాగాలు పోరాటాలు లేకుండా విలీనం జరిగేదా? ఆనాటి విలీనం లేకుండా నేటి తెలంగాణ ఉండేదా? నిజంగా వారిలో చిత్తశుద్ధి ఉండి ఉంటే గతంలో బిజెపి హయాంలో పెండింగ్‌లో ఉన్న తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల పెన్షనలు ఎందుకు మంజూరు చేయలేదు? (గతంలో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టు యోధులను అప్పటి కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత కమ్యూనిస్టు పార్టీ డిప్యూటి ప్రధాన కార్యదర్శిగా ఉన్న నల మల్ల గిరిప్రసాద్ ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసి వేలాది మందికి పెన్షన్ సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తుచేస్తున్నాను.)

గత పోరాటాలను, త్యాగాలను న్యాయబద్ధంగా స్వీకరిస్తే తప్పులేదు. కానీ రాజకీయ కుట్రతో పోరాట స్వరూపాన్ని వక్రీకరించి లబ్ధి పొందడానికి ప్రయత్నం చేయడమే పెద్ద తప్పు, ఘోరమైన నేరం. ప్రారంభంలో పేర్కొన్నట్లుగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేద, బడుగు, బలహీనవర్గాలు సమిష్టిగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఫ్యూడల్ ప్రభువుల అణిచివేతలకు, దోపిడీలపై జరిపిన పోరాటం. ఈ పోరాటం లో హిందువులు, ముస్లింలు అన్నదమ్ముల్లా పాల్గొన్నారు. ఈ పోరాటానికి మతం రంగు పులమడమంటే రానున్న తరాలకు తెలంగాణ వీర చరిత్రను అందకుండా చేసే కుట్ర ఇందులో దాగివున్నది. వీటిని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ నమ్మబోరు. ఎందుకంటే ఇక్కడ ఇంటింటికి పోరాట స్మృతులు ఉన్నాయి.


నేటి పాలకుల విధానాలతో ధనిక, పేదల నడుమ అంతరాలు అత్యంత తీవ్రమవుతున్నాయి. భూమికి వివిధ పేర్లతో బడాబాబులు కేంద్రీకృతం చేసుకుంటున్నారు. మతం పేరుతో ప్రజలను విడదీసి ఫాసిస్టు కార్పొరేట్ ఎజెండాను బిజెపి నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్నది.

వీటికి వ్యతిరేకంగా నేటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేయాలి. సెప్టెంబర్ 11–17 తేదీలలో జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా పునరంకితం అవుదాం.

**ఈ సందర్భంగా నాటి మహత్తర పోరాటానికి నేతృత్వం వహించిన ఘన వారసత్వం గల కమ్యూనిస్టు పార్టీగా మహోజ్వల చరితను భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందు కింది ప్రతిపాదనలు ఉంచుతున్నాం.**

1) సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపరిపాలన దినోత్సవం పేరుగా కాకుండా అధికారికంగా తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో నిర్వహించాలి.
2) నాటి మహత్తర తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ, రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలలో చేర్చాలి.
3) అమరవీరుల స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. అందులో ఆనాటి పోరాటంలో అసువులు బాసిన అమరుల పేర్లను, పోటోలను ప్రతి గ్రామం నుంచి అధికారికంగా సేకరించి భావితరాలకు మార్గదర్శకంగాఉండేలా స్మారక కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలి.
4) హైదరాబాద్‌లో నాటి పోరాట సేనానులు రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి ఒకే చోట, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి ఆనాటి సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ముఖ్య ప్రదేశాలలో ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ ప్రజలకు స్ఫూర్తి దాయకంగా ఉంటుంది.
5) తొలి సార్వత్రిక ఎన్నికల్లో నెహ్రూను మించిన మెజారిటీ పొందిన ప్రజానాయకుడు రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలి.
6) నాటి తెలంగాణ స్వాతంత్ర్య పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచేవిధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు నామకరణం చేయాలి.

చలో చండీఘడ్




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21–25 సెప్టెంబర్, 1925
చండీఘడ్ (పంజాబ్)

# సిపిఐ చీలిక దిశలో...ఆరవ కాంగ్రెస్
## విజయవాడ, 1961

అంతర్జాతీయ , భారత కమ్యూనిస్టు ఉద్యమంలో చీలిక తెచ్చే మావోయిజం విచ్ఛిన్నకర కార్యకలాపాల నేపథ్యంలో సిపిఐ ఆరవ కాంగ్రెస్ 1961 (ఏప్రిల్ 7–16)లో విజయవాడలో జరిగింది. భారత రాజ్య స్వభావం, దానిపై ఆధిపత్యం బూర్జువా వర్గానిదా, ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థదా? సాయుధ పోరాటం మార్గాన్ని, కార్మికవర్గ నియంతృత్వాన్ని విడనాడటం, విప్లవ పరివర్తనకు శాంతియుత మార్గాన్ని ఎంచుకోవటం సబబు కాదనే సిద్ధాంత చర్చను పార్టీ నాయకత్వంలోని ఒక గ్రూపు పార్టీలో అంతర్గతంగా లేవదీసిన సమయం అది. అలాగే నెహ్రూను ప్రగతిశీలవాదిగా గుర్తించటంపై ప్రశ్నలు వచ్చాయి. అదే సమయంలో, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 20వ కాంగ్రెస్ ఆమోదించిన యుద్ధము–శాంతి; విప్లవ పరివర్తనలో పార్లమెంటరీ సంస్థల పాత్ర, శాంతియుత పరివర్తన సైద్ధాంతిక వైఖరులతో మావో సే టుంగ్ నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధివర్గం ఏకీభవించలేదు. భూగోళాన్ని సర్వనాశనం చేసే అణుయుద్ధ ప్రమాదం నేపథ్యంలో యుద్ధాల నివారణకు కృషిచేయటమనే సిపిఎస్‌యు భావనను తిరస్కరించింది. విప్లవానికి సాయుధ పోరాటమే మార్గమని సిద్ధాంతీకరిస్తూ 'శ్మశానం నుంచే సోషలిజం', 'తుపాకీ గొట్టం ద్వారానే అధికారం' వంటి విచ్ఛిన్నకర విధానాలను మావో ప్రోత్సహించారు. ఈ సిద్ధాంత చర్చ అనేక దేశాలలో కమ్యూనిస్టులకు ఆత్మహత్యాసదృశమైంది. భారత కమ్యూనిస్టు పార్టీలో కూడా అటువంటి చర్చలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. పార్టీ జాతీయ నాయకత్వంలో భారతదేశ విప్లవ దశపై రెండు విరుద్ధ భావాలు ఘర్షణ పడుతున్నాయి. అయినప్పటికీ శ్రమజీవులు, అణగారిన తరగతులు, సన్నకారు రైతులు, కౌలు రైతులు తదితర శ్రమజీవుల్లో కమ్యూనిస్టు పార్టీ పట్ల విధేయత చెక్కుచెదరలేదు. 1962 సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులకు సాంప్రదాయకంగా బలమైన రాష్ట్రాల్లో అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు గణనీయంగానే లభించాయి.

విజయవాడ పార్టీ కాంగ్రెస్‌కు 1,77,501 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ, 439మంది ప్రతినిధులు హాజరైనారు. మావోయిజం ప్రోత్సాహంతో చైనా కమ్యూనిస్టు పార్టీ పంథాను విశ్వసిస్తున్నవారు పార్టీని చీల్చడానికి ప్రయత్నిస్తున్నారు. అజయ్‌ఘోష్ సకాలంలో జోక్యం చేసుకుని చీలికను అప్పటికి నివారించారు. పార్టీ 'రాజకీయ తీర్మానం' ఆమోదించకుండానే మహాసభ ముగిసింది. అనారోగ్యంగా ఉన్నప్పటికీ అజయ్ ఘోష్ చేసిన సుదీర్ఘ ఉపన్యాసమే 'పార్టీ పంథా'గా ఆమోదించబడింది.

**కేంద్ర సెక్రటేరియట్ సభ్యులు**

అజయ్ ఘోష్(జనరల్ సెక్రటరీ) 2.ఎస్.ఎ.డాంగే, 3.భూపేష్ గుప్తా, 4.ఎం.ఎన్.గోవిందన్ నాయర్, 5.జడ్.ఎ.అహ్మద్

**కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు :**

1.అజయ్ ఘోష్(జనరల్ సెక్రటరీ) 2.ఇఎంఎస్. నంబూద్రిపాద్, 3. పి.సి.జోషి, 4. భూపేష్ గుప్తా, 5.ఎస్.ఎ.డాంగే, 6.ఎం.బసవ పున్నయ్య, 7.బి.టి.రణదివె, 8.జడ్.ఎ. అహ్మద్, 9. సి.రాజేశ్వరరావు,10.ఎన్.రాజశేఖర్ రెడ్డి, 11.పి.రామమూర్తి, 12. ఎం.ఆర్.వెంకటరామన్, 13.రామ కృష్ణపథి, 14.ఎస్.జి.సర్దేశాయ్, 15.జ్యోతిబసు, 16. ప్రమోద్ దాస్ గుప్త, 17.భవాని సేన్, 18. సోహన్ సింగ్ జోష్, 19. రమేష్ చంద్ర, 20. యోగీంద్ర శర్మ, 21.ఎం.ఎన్.గోవిందన్ నాయర్,22. ఎ.కె.గోపాలన్, 23. కె.దామోదరన్,24.ఫణి బోర, 25. జగ్జిత్‌సింగ్ ల్యాల్‌పురి, 26. ఎస్.వి.ఘాటే (చైర్మన్ సిసిసి)

1962 జనవరిలో అజయ్ ఘోష్ మరణానంతరం, జాతీయ సమితి పార్టీలో ఐక్యత పరిరక్షణకై ఎస్.ఎ.డాంగేను చైర్మన్‌గా, ఇఎంఎస్ నంబూద్రిపాద్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.

### 1962లో చైనా దురాక్రమణ

1962 అక్టోబర్‌లో చైనా సైన్యాలు, అది ఇచ్చిన వాగ్దానాన్ని ఉల్లంఘించి భారత భూభాగంలోకి దురాక్రమించాయి. అయితే చైనాకు అనుకూలురని భావించిన సిపిఐ నాయకులను ప్రభుత్వం దేశభద్రత చట్టం కింద అరెస్టు చేసింది. సిపిఐ కేంద్ర కార్యవర్గ కమిటీ, జాతీయ సమితి చైనా దురాక్రమణను నిర్ద్వంద్వంగా ఖండించాయి. అస్సాం దాకా వచ్చిన చైనా సైన్యాలు కొన్ని రోజుల తర్వాత అంతర్జాతీయ ఒత్తిడి కింద ఉపసంహరించుకున్నాయి. సిద్ధాంత విభేదాలు తారాస్థాయికి చేరగా 32 మంది సభ్యులు 1964లో జాతీయ సమితి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అదే సిపిఐలో చీలిక. సిపిఐ నాయకత్వాన్ని రివిజనిస్టులుగా నిందించారు ఆ పిడివాదులు.

1962 అక్టోబర్‌లోనే క్యూబన్ మిస్సిలీ సంక్షోభం యాదృచ్ఛికమే కావచ్చు. ప్రపంచాన్ని అణుయుద్ధం అంచుకు తీసుకెళ్లిన సంక్షోభం 13రోజులు నడిచింది. క్యూబాలో అణు మిస్సిలీల ఏర్పాటును రష్యా ఉపసంహరించుకోవటం, క్యూబాపై దాడి చేయబోమని అధ్యక్షుడు కెన్నడీ అంగీకరించటం, టర్కీ నుంచి తమ మిస్సిలీలను అమెరికా వెనక్కి తీసుకోవటంతో ఆ సంక్షోభం ముగిసింది. దానితో సంబంధం లేకపోయినా అదే సమయంలో భారత్‌పై చైనా దురాక్రమణతో ఇండీ – చీని భాయిభాయి అంటూ వికసించిన, ప్రపంచానికి పంచశీలను అందించిన భారత్–చైనా మైత్రి భగ్నమైంది.

పార్టీని చీల్చిన వారు పశ్చిమ బెంగాల్‌లో మహాసభ జరుపుకుని సిపిఐ(మార్క్సిస్టు)గా ప్రకటించుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్యను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అజ్ఞాతంలోని కమ్యూనిస్టు విప్లవకారులు కొద్దిమంది తాష్కెంట్‌లో సమావేశమై సిపిఐ ఏర్పాటు ఆలోచన చేసిన 1920ని సిపిఐ వ్యవస్థాపక సంవత్సరంగా గుర్తించారు. భారత దేశంలో పార్టీ ఏర్పడిన 1925ను సంస్థాపక సంవత్సరంగా ఉమ్మడి పార్టీ తీర్మానించింది. విప్లవ శాంతియుత పరివర్తనను తిరస్కరించకపోయినా సాయుధ పోరాట మార్గానికి ప్రాధాన్యత ఇచ్చారు. భారత రాజ్యంపై ఫ్యూడల్ భూస్వామ్య శక్తులు ఆధిపత్యం వహిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ వ్యతిరేకతను ప్రధాన రాజకీయ పంథాగా ఎంచుకున్నారు. కాబట్టి విప్లవ దశను ప్రజాస్వామిక దశగా గుర్తించటానికి నిరాకరించారు.

కార్మికవర్గ నియంతృత్వ భావనను పునరుద్ధరించారు. జనతంత్ర ప్రజాస్వామ్యం (పీపుల్స్ డెమొక్రసీ) స్థాపన తమ గమ్యంగా ప్రకటించారు. తమ పార్టీకి మెజారిటీ లేదా ఆధిక్యస్థానం లేనిదే ప్రభుత్వాల్లో చేరరాదన్న తీర్మానం దీన్నుండే వచ్చింది. ప్రధానమంత్రి అయ్యేందుకు 1996లో జ్యోతిబసుకు వచ్చిన అవకాశాన్ని తిరస్కరించటానికి అదే కారణం.

అయితే సాయుధ పోరాటమంటూ పార్టీని చీల్చిన నాయకులు పార్లమెంటరీ పంథాలోనే ప్రయాణిస్తున్నందున ఆ పార్టీ నాయకుల్లోని అతివాదులు ఆ నాయకత్వాన్ని నయా 'రివిజనిస్టులు'గా నిందించి చైనా పార్టీ ప్రోత్సాహంతో 1967లో నక్సల్‌బరీ ఉద్యమ ప్రేరణతో అడవుల బాటపట్టారు. ఆ తర్వాత సిద్ధాంత రాద్ధాంతాలతో దఫదఫాలుగా ఎన్ని ముక్కలైనారో చెప్పటం కష్టం. ఇప్పుడు కొన్ని గ్రూపులు సాయుధ పోరాటాన్ని విడనాడి జనజీవన స్రవంతిలోకి వచ్చి బహిరంగంగా పనిచేస్తున్నారు. అయితే పార్లమెంటరీ పంథాకు వ్యతిరేకం. అందువల్ల ఎన్నికల్లో పాల్గొనరు. మరికొన్ని గ్రూపులు సిపిఐ మావోయిస్టులుగా, మార్క్సిస్టు–లెనినిస్టుగా, లిబరేషన్‌గా – (కొందరు అజ్ఞాతంగా, మరికొందరు బహిరంగంగా) ఇలా అనేక పేర్లతో పనిచేస్తున్నారు. 'లిబరేషన్' ఎన్నికల్లో పాల్గొంటున్నది. అడవులలోని మావోయిస్టులపై కేంద్రప్రభుత్వం ఇప్పుడు 'ఆపరేషన్ కగార్' పేరుతో నిర్మూలన కార్యం సాగిస్తున్నది.

### బొంబాయిలో 7వ కాంగ్రెస్ – 1964




పార్టీలో చీలిక తర్వాత ఇది మొదటి కాంగ్రెస్. 1964 డిసెంబర్ 13 నుండి 23 వరకు బొంబాయిలో జరిగింది. పార్టీలో చీలిక కమ్యూనిస్టు ఉద్యమానికి అతితీవ్రమైన హాని చేసిందని మహాసభ తీర్మానించిం ది. 'జాతీయ ప్రజాతంత్ర విప్లవం' ('నేషనల్ డెమొక్రసి') అనే కొత్త కార్యక్రమాన్ని మహాసభ ఆమోదించింది. మావోయిజాన్ని, చైనా దురాక్రమణను సిపిఐ కాంగ్రెస్ ఖండించింది.

చైర్మన్‌గా ఎస్.ఎ.డాంగేను, ప్రధాన కార్యదర్శిగా చంద్ర (సి) రాజేశ్వరరావును ఎన్నుకుంది.

**కార్యదర్శివర్గం:** జి.అధికారి, ఎం.ఎన్.గోవిందన్ నాయర్, రమేష్ చంద్ర, జడ్.ఎ.అహ్మద్, యోగీంద్ర శర్మ, భూపేష్ గుప్త, ఎన్.కె.కృష్ణన్

**కేంద్ర కార్యవర్గం :**ఎస్.ఎ.డాంగే, సి.రాజేశ్వరరావు, జి.అధికారి, ఎం.ఎన్.గోవిందన్ నాయర్, రమేష్ చంద్ర, జడ్.ఎ.అహ్మద్, యోగీంద్ర శర్మ, భూపేష్ గుప్త, ఎన్.కె.కృష్ణన్, నీలం రాజశేఖర్‌రెడ్డి, తమ్మారెడ్డి సత్యనారాయణ, మనలి సి. కందస్వామి, కె.దామోదరన్, పి.కె.వాసుదేవన్ నాయర్, రామకృష్ణ పథి, భవానీసేన్, ఇంద్రజిత్ గుప్తా, ఫణి బోర, ఇంద్రదీప్ సిన్హా, కాళీశంకర్ శుక్లా, అవతార్ సింగ్ మల్హోత్రా, బి.కె.గుప్తా, సోహన్ సింగ్ జోష్, హెచ్.కె.వ్యాస్, ఎస్.జి.సర్దేశాయ్, ఆహ్వానితుడు : ఎస్.వి.ఘాటే(చైర్మన్, కేంద్ర కంట్రోల్ కమిషన్)

## ఈశ్వరమ్మ, నరసమ్మలకు నివాళులర్పించిన సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన ఢిల్లీ ఈశ్వరమ్మ మంగళవారం సాయంత్రం మృతి చెందగా ఆమె పార్థీవదేహాన్ని సిపిఐ నాయకులు బుధవారం సందర్శించి, నివాళులర్పించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ మణుగూరు మండల, పట్టణ కార్యదర్శులు జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్, మాజీ ఎంపీపీ ఎదిరి రమేష్, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, కార్యవర్గ సభ్యులు నోముల రవి తదితరులున్నారు. మణుగూరు మండలం స్మూలు కొండాయిగూడెం గ్రామానికి చెందిన బొగ్గుల నరసమ్మ మృతి చెందగా బుధవారం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ మణుగూరు మండల పట్టణ కార్యదర్శులు జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్, మాజీ ఎంపీపీ ఎదిరి రమేష్, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, రవి హాజరై నివాళులర్పించారు.

## సురవరం సంస్మరణ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ ఈనెల 13న ఖమ్మంలో జరుగుతుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, వివిధ రాజకీయ పక్షాల నేతలు పాల్గొంటారని ఆయన తెలిపారు. సిపిఐ వన్‌టౌన్ ఏరియా సమావేశం బుధవారం వన్‌టౌన్ ఏరియా సిపిఐ కార్యాలయంలో కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశంలో జానిమియా మాట్లాడుతూ 60 సంవత్సరాల సుదీర్ఘ ప్రజా జీవితంలో సురవరం సుధాకర్‌రెడ్డి అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించారని ఆయన తెలిపారు.

## నిబద్ధత గల కమ్యూనిస్టు రాధాకృష్ణ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హేమంతరావు



**ప్రజాపక్షం/చింతకాని:** సీపిఐ కార్యకర్త శీలం రాధాకృష్ణ ప్రతికూల కాలంలో ఎర్ర జెండా ఎత్తుకొని నిబద్ధత గల కమ్యూనిస్టుగా ప్రతికాడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు పేర్కొన్నారు. కొదుమూరు గ్రామానికి చెందిన సిపిఐ కార్యకర్త రాధాకృష్ణ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు బుధవారం కొదుమూరు చేరుకొని రాధాకృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రాధాకృష్ణ కొదుమూరు గ్రామంలో చిన్నతనం నుంచి పార్టీ పిలుపిచ్చిన ప్రతి కార్యక్రమంలో ముందుండేవాడని గుర్తు చేసుకున్నారు.రాధాకృష్ణ కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు కొల్లి సీతయ్య, మాజీ ఎంపీటీసీ నారపోగు హేమ నాగార్జున, మాజీ సర్పంచ్ నక్కనబోయిన సుజాత కృష్ణ, అనుబోతు వీరబాబు,కోటగిరి పరబ్రహ్మచారి,శాఖ కార్యదర్శి నీరుడు గోవిందరావు, చిట్టిమోదు కొండలు, చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, కూచిపుడి వెంకటేశ్వర్లు జనగం వెంకటేశ్వర్లు, ఉన్నారు.

## సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు

### ఖమ్మంలో మోటార్ సైకిల్ ర్యాలీ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధ తెలంగాణ పోరాట వారోత్సవాలను నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. సాయుధ పోరాట వీర గాధలను నేటి తరానికి తెలియజేస్తూ సాయుధ పోరాటానికి కేంద్రంగా నిలిచిన పలు గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సాయుధ పోరాట కాలంలో ఆశువులు బాసిన అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పించడం జరుగుతుందని సురేష్ తెలిపారు. ఈనెల 11న ఖమ్మం జెడ్పి సెంటర్ నుంచి జరిగే మోటార్ సైకిల్ ర్యాలీతో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ స్మారక స్తూపం వద్ద సభ జరుగుతుందని సురేష్ తెలిపారు. 12న ఎం. వెంకటాయపాలెం, 13న ప్రొద్దుటూరు, బోనకల్ మండలం గోవిందాపురం గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. 14న కొణిజర్ల మండలంలో సాయుధ పోరాట వారోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. 15న సత్తుపల్లి, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లోనూ, 16న బోనకల్, మధిర మండలాల్లో సాయుధ పోరాట వారోత్సవ సభలు జరుగుతాయని 17న ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ముగింపు సభ జరుగుతుందని సురేష్ తెలిపారు.

## మండలానికి అత్యధిక యూరియా సరఫరా



**ప్రజాపక్షం/గుండాల :** భద్రాద్రి జిల్లా గుండాల మండలానికి పిఎసిఎస్ ద్వార అత్యధికంగా యూరియా ను సరఫరాచేయడం జరిగిందని వ్యవసాయశాఖ అధికారి ఎడిఏ తాతరావు అన్నారు. బుదవారం స్థానిక పిఏసిఎస్‌ని సందర్శించి వర్షాకాల సీజన్ గాను ఏప్రిల్‌నుండి సెప్టెంబర్ 9వరకు 244 25 యూరియా బ్యాగులను అనగా 1099 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందన్నారు. యూరియా సరఫరాలో జిల్లాలోనే పిఏసిఎస్ ద్వారా రెండోస్థానం ఉందన్నారు. ఇల్లందు మొదటి స్థానం అన్నారు. మండలానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిదిలోని కాచనపల్లి రైతు వేదిక యందు బుదవారం 120 యారియా బ్యాగులను రైతులకు అందించడం జరిగిందన్నారు. రైతుల అవసరాల మేరకు మండల రైతులకు యూరియా సరఫరా చేయడానికి తమవంతు సహాయం అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఏఓ వెంకటరమణ, ఏఇఓలు బాలరాజు, లెనిన్ ఉన్నారు.

## అశ్వారావుపేట మండలంలో ఎమ్మెల్యే జారే పర్యటన

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలంలో గురువారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని తిరుమలకుంట, ఆసుపాక, బచ్చువారిగూడెం, ఊట్లపల్లి, అశ్వారావుపేట, నారవారిగూడెం, , దిబ్బగూడెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలో లబ్ధిదారులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనలో అధికసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.




## అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని బుడ్డగూడెం కేంద్రం అక్రమ ఇసుకను తరలిస్తున్న లారీ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇ లా ఉన్నాయి. బుడ్డగూడెం పరిధిలో అక్రమంగా ఇసుకను లారీల ద్వారా రవాణా చేస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున బూర్గంపాడు అదనపు ఎస్ఐ నాగబిక్షం సిబ్బందితో వెళ్లి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ టిఎస్36టి4438 నెంబర్ కలిగిన లారీని పట్టుకొగా, డ్రైవర్ పరారీ కావడం జరిగిందని తెలిపారు. పట్టుబడిక లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## పిఆర్‌టియు మండల శాఖ తరపున ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో పని చేస్తూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను స్వీకరించిన మండల విద్యాశాఖ అధికారి డి జయరాజుకి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు శ్యాంకుమార్, బి శ్యామలాల్, జీ ఝాన్సీ సౌజన్యలను సింగరేణి పిఆర్‌టియు మండల శాఖ తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ శంకర్, వీ మంగీలాల్, సీనియర్ కార్యకర్త ఎం వేణుమాధవ్, ఏ పద్మ, కార్యవర్గ సభ్యులు ఎల్ లక్ష్మ ణ్, జాకీర్ బాబా, సుధాకర్, శ్రీనివాస్, నందిని, సమ్మయ్య, రవి, సురేష్, చంద్రశేఖర్, రాజ్ కుమార్, మోహన్, ఎమ్మార్సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు ప్రధాన రహదారి మరమ్మతులు చేయాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** గాంధీనగర్ గేటు వద్ద, కొమ్ముగూడెం నుండి గాంధీనగర్ వరకు ఇల్లందు ప్రధాన రహదారిపై పడిన గుంటలు పడి జల్లెడలా మారిన గుంటలు పూడ్చాలని మరమ్మతులు చేయాలని సిపిఎం గాంధీనగర్ గ్రామ శాఖ ఆధ్వరయలో నిరసన తెలిపారు. కొమ్ముగూడెం నుండి గాంధీనగర్ వరకు ఇల్లందు ప్రధాన రహదారి జల్లెడలా మారి మోకాలు లోతు గుంటలు పడి ప్రమాదాలకు నరకాన్ని తలపిస్తున్నదని, ఇంత జరుగుతున్న ప్రభుత్వం కనీసం మరమ్మతులు చేయడం లేదని విమర్శించారు.

## మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబానికి వరం



### జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మహిళల ఆరోగ్యం సక్రమంగా ఉంటనే కుటుంబ ఆరోగ్యవంతంగా, బలంగా నిలుస్తుందనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం స్వాస్థ్ నారీ స్వశక్తి అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీనిని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులతో ఐడిఓసిలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని వైద్యారోగ్య శాఖాధికారులను ఆదేశించారు. మహిళల ఆరోగ్య రక్షణలో ఈ కార్యక్రమం ఓ మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. మారిన జీవనశైలి, పర్యావరణ పరిస్థితుల కారణంగా మహిళలు అధికంగా బిపి,షుగర్, గుండెసంబంధిత వ్యాధులు, పిసిఓడి, రుతుక్రమ సమస్యలు వంటి వాటికి గురవుతున్నారని, ఈ క్యాంపుల ద్వారా మహిళలు ఆరోగ్య పరిక్షణ జరుగుతుందన్నారు. అక్టోబర్ 1న జిల్లా వ్యాప్తంగా మెగా రక్తదానం శిబిరం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వైద్యాధికారి జయలక్ష్మి, డిసిహెచ్ఓ రవిబాబు, జిల్లా పంచాయితీ అధికారి చంద్రమౌళి, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిని స్వర్ణలత లెనినా, మున్సిపల్ కమీషనర్లు సుజాత, శ్రీకాంత్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మణుగూరు మండలంలో పర్యటించిన డిఆర్‌డిఓ

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలంలో బుధవారం డిఆర్‌డిఓ పర్యటించారు. పర్యటనలో భాగంగా మండల పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.



తోగ్గుడెంలో ఏర్పాటు చేసిన సర్క్యులేటరీ ఆక్వా సిస్టమ్, కొరమీన్ చేపల పెంపకం కేంద్రాన్ని పరిశీలించి, చేపల పెంపకానికి ఆధునిక పద్ధతులు ఉపయోగించడం పై సంతోషం వ్యక్తం చేశారు. కూనవరం గ్రామంలో సాగుతున్న మోరింగా (మునగ) తోటల అభివృద్ధి పనులను పరిశీలించి, రైతులకు ఆర్థికంగా తోడ్పడే ఈ పంట విస్తరణపై సూచనలు అందించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఐకెపి సంఘాల గోదాంను, అలాగే ఎస్‌హెచ్‌జి మహిళా సభ్యులకు అందిస్తున్న యూనిఫాం చీరల పంపిణీ వ్యవస్థను పరిశీలించారు. రామానుజవరం గ్రామంలో నిర్మించిన పశువుల కట్టడాన్ని సందర్శించి, పశుసంవర్ధకంలో దీని ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఐకెపి, ఎంజిఎన్‌ఆర్ ఈజిఎస్ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు పనితీరు నివేదికలను సమర్పించారు. ఈ పర్యటనలో ఏపిఎం, ఏపిఓ, ఎంపిఓ, ఎంఈఓ లతో పాటు అన్ని మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి కార్యక్రమం స్థాయిలో ఫీల్డ్ లెవెల్ స్టాఫ్ కృషిని మేడమ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి తేళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జిపిఎటి అధ్యక్ష, కార్యదర్శులుగా పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ లు ఎన్నికయ్యారు. పెన్షనర్ల సంఘ సమావేశం బుధవారం జరిగింది. అధ్యక్షులుగా పరిశ పుల్లయ్య, సంయుక్త అధ్యక్షులుగా కనపర్తి వెంకటేశ్వర్లు, ఐవి భాస్కరాచారి, ఉపాధ్యక్షులుగా పెదమళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, వెంకటేశ్వర్లు తదితరులు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, కోశాధికారిగా గుర్రాల శ్రీనివాసరావు లు ఎన్నికయ్యారు. మొత్తం 33 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పుల్లయ్య, రవికుమార్ లు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరాట కార్యాచరణతో ముందుకు సాగనున్నట్లు తెలిపారు. పాలకులు పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నారని ఇందుకు వ్యతిరేకంగా రానున్న కాలంలో బహుముఖ పోరాటాలు నిర్వహిస్తామని పుల్లయ్య, రవికుమార్ లు తెలిపారు. ఎన్నికల అధికారిగా వి. రాంమనోహర్, తుమ్మా వీరయ్య లు వ్యవహరించగా రాష్ట్ర పరిశీలకులుగా జి. వీరస్వామి, కె. సుధీర్‌బాబు లు హాజరయ్యారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కల్లూరు లోని మున్సిపల్ కార్మికుల సమావేశం వజేర్మియా అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం కార్పొరేటర్ బిజీ క్లెమేట్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన ఖమ్మంలోని రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మూడో మహాసభ జరుగునుందని కార్మికులందరూ పాల్గొనాలని, మున్సిపాలిటీ లో పనిచేస్తున్న కార్మికులందరికీ వేతనాలు అందక అవస్థలు పడుతున్నారని వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని అధికారులను కోరారు. గ్రామపంచాయతీతో పోలిస్తే మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు అధికంగా ఉంటాయని, కల్లూరు మున్సిపాలిటీ ఏర్పడి నుంచి అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. మున్సిపాలిటీ కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పారిశుద్ధ్య సామాగ్రి అందించాలని, వ్యక్తిగత భీమా రెన్యువల్ చేయాలని, ఏకరూప దుస్తులు అందించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు, మున్సిపాలిటీ నాయకులు ఎన్ కృష్ణ, ఉపేందర్, ఓడల కృష్ణమూర్తి, ప్రకాష్ చింతల శ్రీను, సీతమ్మ, యశోద అంజలి, చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎంఇఓకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/ మధిర :** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా అవార్డు పొందిన ఎంఇఓ వై.ప్రభాకర్‌ను బుధవారం ఆయన ఆత్మీయ మిత్రులు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ఎనిమిదేళ్లుగా ఎంఇఓగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలను అందించేలా ఉపాధ్యాయులతో సమన్వయాన్ని నిర్వహిస్తూ విధి నిర్వహణలో బాధ్యతయుతమైన పాత్ర నిర్వహిస్తున్నారని అన్నారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ఉత్తమ అవార్డును ఇవ్వడం జరిగిందని, ఈ అవార్డు రావడం గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. తుమ్మల బాలస్వామి, హెచ్‌ఎం స్వామిదాసు, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్లు సతీష్, శ్రీనివాసరావు, బాలకోటరెడ్డి, చావల ఆజాద్‌చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను ఎమ్మెల్యే దంపతుల పరామర్శ

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని పలు కుటుంబాలను సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా దంపతులు బుధవారం పరామర్శించారు. మండల పరిధిలోని సత్యంపేట గ్రామంలో ఇంకుడు గుంతలో పడి చిన్నారి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దంపతులు వారి నివాసానికి చేరుకుని చిన్నారికి నివాళ్ళులర్పించి తల్లిదండ్రులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో జరిగిన ఖర్మకు హాజరైనారు. అదేవిధంగా తుమ్మూరు గ్రామ మాజీ సర్పంచ్ కర్లంపూడి రామారావు ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటికి చేరుకోగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దంపతులు రామారావు నివాసానికి చేరుకుని అనారోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొడ్డా శ్రీను అత్తమ్మ, తుమ్మూరు గ్రామానికి చెందిన తాళ్ళూరి సత్యవతి ప్రథమ వర్ధంతికి హాజరై సత్యవతి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, దొడ్డా శంకర్ రావు, మోరంపూడి జగన్ తదితరులున్నారు.



## విలేకరి మృతికి సంతాప సభ

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన వేము మోహన్ బాబు (39) అనారోగ్యంతో అకాల మృతి చెందడం పట్ల కల్లూరు మండలం ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా, మీడియా మిత్రులు వారి స్వగ్రామానికి చేరి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి ఆయన గత నాలుగు సంవత్సరాలుగా కలం కార్మికునిగా ఉంటూ సేవలను స్మరించుకున్నారు. ఆ కుటుంబాన్ని సందర్శించి కుటుంబానికి ఓదార్పును, ధైర్యాన్ని ఇచ్చారు. అదే విధంగా సిపిఐ జిల్లా మండల నాయకులు క్లైమేట్, తోట రామాంజనేయులు, దామాల దయాకర్ రావుల తోపాటు కాంగ్రెస్ నాయకులు భాగం ప్రభాకర్ రావు, బిఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్ ,లక్కినేని రఘు లతోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేత

**ప్రజాపక్షం/చింతకాని:** చింతకాని సహకార సంఘం లో సభ్యత్వం కలిగి మరణించిన రైతు కుటుంబానికి సంఘం ద్వారా ఇన్సూరెన్స్ చెక్కును చైర్మన్ కొండపల్లి శేఖర్ రెడ్డి అందజేశారు. నాగిలిగొండ గ్రామానికి చెందిన రైతు పదిలోజు రవి కుమార్ ఇటీవల మరణించడంతో ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.50వేల చెక్కును రవికుమార్ భార్య ఉమ కు చింతకానిలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మారగాని శ్రీనివాసరావు, రైతులు కొనకంచి నర్సయ్య, ఆళ్ల కృష్ణ, నాగేశ్వరరావు సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి కష్టాలకు పరిష్కారం ఎప్పుడు?

### నూతన వాటర్ ట్యాంక్‌కు ఆగిన నీటి సరఫరా



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామంలో తరచుగా త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు జాప్యం జరుగుతూనే ఉంది. సమస్య వచ్చినప్పుడు ప్రజలు అడగడం అధికారులు సమాధానం చెప్పడమే జరుగుతుంది తప్ప సమస్యకు పరిష్కారం ఎక్కడ కనిపించడంలేదు. ఈ గ్రామంలో లక్షలు పెట్టి నిర్మించిన వాటర్ ట్యాంక్ గ్రామ ప్రజలకు ఉపయోగపడకుండా నిరుపయోగంగానే ఉంది. ఈ ట్యాంక్ విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయం లేదనే చెప్పవచ్చును. ట్యాంకు సరఫరాకు నీటిని అందించాల్సింది ఎవరు? భగీరధ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మా తప్పిదం లేదని వారు చెబుతున్నారు. మరి ట్యాంక్ చేసిన పాపం ఏమిటి? దీనికి బాధ్యత ఎవరిది? లక్షల రూపాయలు ఉంటే బాగుంటదా? గ్రామానికి మంచిదా త్రాగునీటి సమస్య తీరువద్దా ఒక్కసారి ఆలోచించండి. అధికారులు పూర్తిస్థాయిలో జోక్యం చేసుకొని తాటిపూడి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రజలకు తాగునీరు అందించేందుకు వాడుకలోకి తీసుకురావాలి. తరచుగా గ్రామంలో త్రాగునీటి ఇబ్బంది ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు త్రాగునీరు వస్తుందో ఎప్పుడు బంద్ అవుతుందో వచ్చిన నీరు పంపులు వదిలిన పది నిముషాలకే ఆగిపోతుంది.

## ఐలమ్మ పోరాటం నేటి యువతకి స్ఫూర్తిదాయకం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వీర నారి చాకలి ఐలమ్మ చూపిన తెగువ పోరాటం నేటి యువతకి ఆదర్శప్రాయంగా నిలుస్తుంది అన్నారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ లు. బుధవారం వీరనారి చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి వేడుకలు పట్టణంలోని రాజీవ్ నగర్, ఎన్టీఆర్ నగర్, ప్రధాన రహదారి, వేంసూర్ రోడ్ లోని ధోబిఘాట్ నందు రజక సంఘం అధ్యక్షుడు విరివాడ నాగభూషణం, నిమ్మటూరి రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. దోబీ ఘాట్ నందు నిర్వహించిన వేడుకలకు సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరై, చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెగువచూపి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఇందరికో స్ఫూర్తి దాయకమని, ముఖ్యంగా నేటి యువతకి ఆమె పోరాటం కావాలన్నారు. రజకుల అభివృద్ధి కోసం తాము కష్టపడి పని చేస్తున్నామని, ఐకమత్యంగా కలిసి వస్తే తమ సహాయ సహకారాలు, మద్దతు పూర్తిగా అందిస్తామన్నారు. రానున్న రోజులలో రజకుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తామన్నారు.ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల కృష్ణయ్య, కమల్ పాషా, రామ్ మూర్తి, శ్రీను, కోటేశ్వరరావు, సుబ్బారావు, రాధా కృష్ణ, సత్యనారాయణ, అల్లాడి కృష్ణయ్య, నిమ్మగడ్డ రాములు, శ్రీకాంత్, రామారావు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీకని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా వెనుబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన ఐడిఓసిలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని కలెక్టర్ హాజరై ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ పోరాట పటిమ నేటికి స్ఫూర్తిదాయకం అన్నారు. సమాజంలో ఆమె గొప్పతనాన్ని చాటాలని, నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, విజయలక్ష్మి, శ్రీలత, అజిత్‌కుమార్, ముదిగొండ రాంబాబు, సర్వేష్, జంగపల్లి రాజు, దురుశెట్టి కుమార్, విజయలక్ష్మి, కొదుమూరి సత్యనారాయణ, కాపర్తి

### ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

వెంకటాచారితో పాటు పలువురు పాల్గొన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చేబ్రోలు ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్య మించాలి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు పిలుపునిచ్చారు. ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా మ ధిరలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత ఐలమ్మ అని కొని యాడారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన పోరాటంలో, తెలంగాణ సాయుధ పోరాటలో కీలకపాత్ర పోషించిన ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని నేటి పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఎంతైనాఉందన్నారు.





## చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి:ఎమ్మెల్యే గండ్ర

**ప్రజాపక్షం/భూపాలపల్లి** :తెలంగాణ సాయుధ రైతంగ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు ప్ర తీ ఒక్కరూ కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర స త్య నారాయణ రావు పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని చా కలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మీ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐ లమ్మ పాత్ర వి శేషమైనదని, ఆమె మహిళా చైతన్యం, శక్తికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ప లువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమాను లు ఉ న్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాజర్లఅశోక్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మినీ స్టేడియం పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

**ప్రజాపక్షం/భూపాలపల్లి** :పట్టణంలో సుభాష్ కాలనీ లో నూతనంగా నిర్మి స్తున్న మినీ స్టేడియం,అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను జిల్లా అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి పరిశీలించారు. పట్టణం మెయిన్ రోడ్డులో గల వాటర్ లీకేజ్ ని పరిశీలించి వెంటనే ఆ పనిని పూర్తి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పి.సునీల్ కుమార్, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ బి.మానస, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## యూరియా సరఫరా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా అధికారి



**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో జ రుగుతున్న యూరియా సరఫరాకు సంబంధించి జిల్లా వ్యవసాయ అధికారి మండల ప్రత్యే క అధికారి కే అనురాధ మంగళవారం, జిల్లా సహకార శాఖ అ ధి కారి నీరజా తో కలిసి ఆకస్మిక ంగా తనిఖీ చేశారు. మండల కే ంద్రం లోని సహకార వ్యవసాయ సంఘంలో రిజిస్టర్లను రైతులకు సరఫరా చేసిన యూరియా వివరాలను స్టార్ట్ రైతుల ఆరోగ్య దీపిక కార్డులలో రై తులు ఈరోజు ఎన్ని ఎరువులు బస్తాలు కొనుగోలు చేశారు వివరాలను పరిశీలిం చారు. రెడ్ల వాడ సొసైటీలో కూడా వీరు తనిఖీ నిర్వహించారు. అ ధిక మోతాదులో యూరియా వాడకూడదని ఇతర మండలాల్లోని మీ బ ంధు మిత్రులకు ఇక్కడ తీసుకున్న యూనియన్ అక్కడి తరపున చేయకూడదని దానివల్ల ఇక్కడ రైతులు ఇబ్బంది పడతారని ఇప్పటివరకు మండలాని కి 2257.995 మెట్రిక్ టన్నుల యూరియా 50154 బస్తాలు, ప్రభుత్వం అందించిందని, రైతులు సేంద్రియ ఎరువుల వైపు ఆలోచించాలని వారు కోరారు.మండల వ్యవసాయ అధికారి నాగరాజు, నెక్కొండ ప్రాథమిక వ్య వసాయసహకార సంఘం సిఇఒ మొడేం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని మండలాల్లో సాయుధ పోరాట వారోత్సవాలు

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 11 నుండి 17 వరకు హనుమకొండ జిల్లా వ్యాప్తంగా అన్ని మండ లాల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారో త్సవాలను ఘనంగా నిర్వహించాలని సిపిఐ హను మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఒక ప్రకట నలో కోరారు. సెప్టెంబర్ 11న కాజీపేట మండలం లోని రాంపూర్ లో గల తెలంగాణా సాయుధ పోరాట యోధుడు హనుమంతరావు విగ్రహం వద్ద జరిగే ప్రారంభ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పాల్గొంటారని ఆయన తెలిపారు. అలాగేసెప్టెంబర్ 12న ధర్మసా గర్,సెప్టెంబర్ 13న హసన్ పర్తి, కమలాపూర్, దామెర మండలాలలో, సెప్టెంబర్ 14న భీమదేవరపల్లి, శాయంపేట, ఆత్మకూర్, సెప్టెంబర్ 15న ఎల్కతుర్తి, వేలేరు, ఐనవోలు, సెప్టెంబర్ 16న పరకాల,హనుమకొండలో సాయుధ పోరాట వారోత్సవాలను జరుప నున్నట్లు తెలిపారు. ఈ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయుటకు జిల్లా పార్టీ నాయకత్వం, ఆయా మండల కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సంద ర్భంగా ఆయా మండలాలలో సాయుధ పోరాట అమరులను స్మరించు కుంటూ, వారి త్యాగాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు.



## పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలి: మద్దెలఎల్లేష్



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :**ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని హనుమకొండ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. హనుమకొండ జిల్లాలోని ధర్మ సార్ మండలంలో పెద్ద పెండ్యాల గ్రామ శివారు 898/1లో బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద ప్రజలు గుడిసెలు వేసుకొని జీవిస్తూ ఉంటే వారికి కనీస సౌక ర్యాలు కల్పించబడలేదని అన్నారు. గూడు లేక అనేక మంది పేద ప్రజలు ఇబ్బంది పడుతుంటే పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని సిపిఐ నాయక త్వంలో గుడిసెలు వేయించడం జరిగిందన్నారు. వారు ఇప్పటికీ చిన్న చిన్న రేకుల షెడ్డు వేసుకొని అక్కడే జీవనం కొనసాగిస్తున్నా వారికి కనీస సౌకర్యాలైన మంచినీటి సౌకర్యం విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ రెవిన్యూ డివిజనల్ కార్యాల యంలో ఎడిఒ సుభాషిణికివినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యుడు మునిగాల బిక్షపతి, ధర్మసాగర్ మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, పెద్ద పెండ్యాల గ్రామ శాఖ కార్యదర్శి గోకల రాజయ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ,సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పేదలకు వరం:ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పాలకుర్తి:** పేదలకు ప్రభుత్వం అందించే కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలు వరం లాంటివని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశ స్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయంలో కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎ మ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా యశస్వినిరెడ్డి మాట్లాడుతూ అర్హులై న ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా లబ్ది చేకూరేలా కృషి చేస్తున్నామన్నారు. పేద కుటుంబాల కూతుళ్ల పెళ్లిళ్ళకు ఆర్థిక అండగా ఈ పథకం మారింద న్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వర చారి, మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షులు ,నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డే ఓబన్న...**

స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డే ఓబన్న విగ్రహాన్ని బుధవారం మండల కేంద్రంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రైతాంగ హక్కుల కోసం పోరాడిన తొలి స్వాతంత్ర్య సమరయోధులలో వడ్డే ఓబన్న ఒకరన్నారు. ఆయన ఆశయా లను కొనసాగించాలన్నారు.

## నవంబర్ 10నుండి 23వరకు
# ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ఆర్మీ, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం

**ప్రజాపక్షం/హనుమకొండ:** ఆర్మీలో చేరేందుకు గత కొన్ని నెలల క్రితం ఆన్లైన్ విధానంలో పరీక్ష నిర్వహిం చగా అందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నవంబర్ 10నుండి 23వ తేదీ వరకూ ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీని ఆర్మీ అధికారులు నిర్వహిస్తారని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నిర్వహించనున్న ఆర్మీ రిక్రూ ట్మెంట్ ర్యాలీ గురించి ఆర్మీ అధికారులు జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో సమావేశమై ర్యాలీ నిర్వహ ణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.

ఈ సందర్భంగా సికింద్రాబాద్ లోని ఆర్మీ రిక్రూట్మెంట్ కల్నల్ సునీల్ యాదవ్ మాట్లాడుతూ ఆర్మీలో అగ్ని వీర్ నియామకాల కోసం గతేడాది హైదరాబాద్ లోని గచ్చి బౌలి స్టేడియంలో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహిం చినట్లు చెప్పారు. ఈసారి హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆర్మీలో అగ్ని వీర్ ల నియా మకాల ఇప్పటికే దరఖాస్తు ఆన్లైన్ విధానంలో నిర్వహిం చిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9వేల మంది వరకు అభ్యర్థులు పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రన్నింగ్ టెస్ట్ తో పాటు శారీరక సామర్థ్య పరీక్షలు, మెడికల్ టెస్ట్, విద్యార్హతల ధ్రువ పత్రాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 10 నుండి 23వ తేదీ వరకు జరగనున్న ఆర్మీ రిక్రూ ట్మెంట్ ర్యాలీ ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం తోడ్పాటునందించాలని అన్నారు. స్టేడియంలో ట్రాక్ తో పాటు బ్యారికేడింగ్, టెంట్లు, షామియానాలు, విద్యుద్దీపాలు , సీసీ కెమె రాలు, జనరేటర్, మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, తది తర సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్ బందో బస్తు, మెడికల్ టీం, అగ్నిమాపక, 108 వాహనాలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆర్మీ రిక్రూ ట్మెంట్ ర్యాలీ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశా లను తెలియజేస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ నవంబర్ 10 నుండి 23వ తేదీ వరకు జరగనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి వివిధ శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని ఆర్మీ అధికారులకు వివరించారు. రాష్ట్రంలో గతేడాది హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించగా ఈ ఏడాదిలో హనుమకొండ జిల్లాలో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహించే అవకాశం దక్కడంతో విజయవం తంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్మీ మేజర్ ప్రకాష్ రాయ్, ఆర్మీ అధికారులు గురు దయాల్ సింగ్, సుభాష్, వి.వి. నాయుడు, వినోద్ కుమార్ శర్మ, మనీష్ కుమార్, ఆర్డీఓ రాథోడ్ రమేష్, డిఆర్డీవో మేన శ్రీను, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, స్పోర్ట్స్ అధికారి అశోక్ కుమార్, హనుమకొండ ఏసిపి నరసిం హారావు, మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ రావు, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు

విడతలవారీగా అర్హులందరికీ ఇండ్లు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హామీ



**ప్రజాపక్షం / వరంగల్ :** ప్రతి పేద ఇంటికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని విడతలవారీగా అర్హులందరికీ ఇండ్లు ఇస్తామని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హామీ నిచ్చారు. బుధవారం వరం గల్ పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ వరంగల్ ఈస్ట్ లబ్ధిదారు లకు ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ పత్రాలు అందజేశారు. అనం తరం ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుడికి ఐదు లక్షలు రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదవారి ఆశ యాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపడుతుందన్నారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని మంత్రి సురేఖ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అత్యంత నిరుపేద అర్హు లకు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా ప్రభుత్వం పారదర్శ కంగా పోర్టల్ ద్వారా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మంజూరి పత్రాలు స్వీకరించిన లబ్ధిదారులు త్వరగా ఇళ్ళను నిర్మించుకోవాలని కోరారు.నిరుపేదలు గుడిసెలలో, అద్దెకు ఉంటూ సుదీర్ఘ కాలంగా ఇండ్ల నిర్మాణాలకు వేచి చూస్తున్నా రన్నారు. అటువంటి పేద వారి కలలను రాష్ట్ర ప్రభుత్వం నిజ ం చేస్తున్నదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చి న మాటకు కట్టుబడి మహిళల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమం నిరంతరమని, ఇల్లు రాని నిరుపేదలు నిరుత్సాహపడవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతినిరుపే దకు తప్పనిసరిగా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ముఖ్యమ ంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దు ల్లా ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి సురేఖ తెలిపారు.

## ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** ప్రపంచ ఆత్మహత్యల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భీమారం అరుణోదయ డిగ్రీ కళా శాల, కేజీబీవీ లో ఆత్మహత్యల నివారణ దినో త్సవం సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరుపున సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ మాట్లాడుతూ ప్రపంచంలో జరిగే ఆత్మ హత్యలలో ఎక్కువగా యువతి యువకులే ఉంటు న్నారని, చావడమే కారణం కాకుండా బ్రతికి సాధించడం అనేది గొప్ప అన్నారు. యువత ఆత్మ హత్య ఆలోచన వచ్చినప్పుడు మీ స్నేహితులకు గాని, టీచర్స్ గాని, చెప్పుకొని మీ యొక్క సమ స్యను పరిష్కరించుకోవచ్చు అన్నారు . అలాగే యువత ఎక్కువగా చదువుపై శ్రద్ధ పెడితే ఎలాంటి ఆత్మహత్య ఆలోచనలు రావని సూచించారు. ప్రతి సమస్యకి పరిష్కారం ఉంటుంది అని అన్నారు. ఆత్మహత్య ఆలోచనలను నివారించడం సామాన్య ప్రజానీకం లో ఆత్మహత్య పట్ల అవగా హన పెంపొందించడం చాలా ముఖ్యమని అన్నారు. అలాగే ఇక మానసిక వ్యాధులను మొదటి దశలోనే గుర్తించి తగు చికిత్స అందిం చాలి అన్నారు. ఆత్మహత్య ఆలోచనలు కలిగిన ప్పుడు మీ దగ్గరలోని వైద్యులను సంప్రదించి సరైన సూచనలు తీసుకోవాలని అన్నారు. ఎవరికి అయినా మానసిక సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలు, కోపం, చిరాకు, మత్తు పదార్థాలకు బానిసలై ఉన్నవారు 14416 టెలి మానస్ కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన డాక్టర్ మానస విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శారీర కంగా, మానసికంగా దృఢంగా ఉంటే ఎలాంటి ఆత్మహత్య ఆలోచనలు రావు అన్నారు. ఈ కార్య క్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, అరుణో దయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజు, సోషల్ వర్కర్ నరేష్, ఏఎన్ఎం స్వరూపరాణి, ఆశా కార్య కర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల సాధన కోసం బిసిలు రాజకీయ లడాయిలకు సిద్ధం కావాలి

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడుజాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/ తొర్రూరు :** బిసి రిజర్వేషన్లు 42శాతం సాధన కోసం బిసి లు రాజకీయ లడాయిలకు సిద్ధం కావాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రం లోని విశ్రాంతి భవనంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలు బీసీ రిజర్వే షన్ల బిల్లుకు నోటితో మద్దతు తెలుపుతూ నొసటితో వెక్కిరిస్తున్నాయని ఆవే దన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఉన్నా యని, జనాభాలో అరవై శాతం ఉన్న బిసి లకు కనీసం 42శాతం రిజర్వే షన్లు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తుంద న్నారు. పార్లమెంట్‌లో చట్టం చేసేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పూనుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్న ఇండియా కూటమి రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేయాలని అన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి నాయకులు కేంద్రానికి కనీసం వినతి పత్రం కూడా ఇవ్వలేదని, వారి కుట్రను బిసి లు అర్థం చేసుకున్నారని అన్నారు. రాజకీయ పార్టీలన్నీ బిసి రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇచ్చి గవర్నర్, రాష్ట్రప తిల వద్దకు వెళ్లి బిల్లుకు ఆమోదం తెలిపేలా కృషి చేయాలని కోరారు. తొమ్మిది శాతం ఉన్న అగ్రవర్ణాలకు పదిశాతం రిజర్వేషన్లు అమలు చేసిన ప్పుడు అరవైశాతం జనాభా ఉన్న కేవలం బిసి లకు 42శాతం రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. దసరా పండుగలోపు బిసి రిజర్వే షన్ అమలు చేయకుంటే త్వరలో భువనగిరిలో లక్షలాదిమంది బిసి లతో కలిసి బహిరంగ సభ నిర్వహించి సత్తా చాటుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, కేయూ ప్రొఫెసర్ ఎస్.మల్లేశ్వర్,బిసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదగాని సోమయ్య, జిల్లా అధ్యక్షుడు వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జిల్లా యూత్ అధ్యక్షులు మురళియాదవ్, నాయకులు బిక్షంగౌడ్, వెంకన్న, లింగ మూర్తి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాల-పల్లి :**జిల్లాలో అంగన్వా డి కేంద్రాలు, గ్రామ పం చాయతి భవనాల నిర్మా ణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశిం చారు. బుధవారం ఐడిఒ సి కార్యాలయంలో రెవె న్యూ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, మహిళా సంక్షేమ, డిపిఒ, డిఆర్‌డిఒ, టిడబ్ల్యూ ఐడిసిలతో అంగన్ వాడి, గ్రామ పంచాయతి భవనాల నిర్మాణ ప్రగ తిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవనాల నిర్మా ణం లోపాలు లేకుండా నాణ్యతతోపాటు వేగం కూడా పెంచాలని సూచించా రు. పనుల పురోగతి వివరాలను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో వేగం పెంచాలని, కాంట్రాక్టర్లు నిర్లక్ష ్యం వహించరాదని స్పష్టం చేశారు. పంబాపూర్ ప్రాథమికపాఠశాల ఆవర ణలో అంగన్ వాడి భవన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యం జరగడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్ వాడి, వైద్య, పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టేందుకు ఇంజి నీరింగ్ అధికారులు ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశ ంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్‌డిఒ బాల కృష్ణ, పిఆర్ ఇఇవెంకటేశ్వర్లు, మహిళా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డివిజనల్ పం చాయతి అధికారి వీరభద్రయ్య, టిజి డబ్ల్యూఐడిసి డిఇ జీవన్ పాల్గొన్నా రు.

## ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత ఉపాధ్యాయులదే

శాసనమండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ;**ప్రభుత్వ పాఠశాల పరిర క్షణ బాధ్యత ఉపాధ్యాయులదే అని శాసనమం డలి సభ్యులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ప్రై యివేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరు గైన విద్య అందించాలన్నారు. బుధవారం కలెక్ట రేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్య ంలో ఏర్పాటుచేసిన గురుపూజోత్సవ కార్యక్రమా నికి శ్రీపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లా డారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, అదనపు కలెక్టర్, విద్యాశాఖ అధికారి పింకేష్‌కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం శ్రీపా ల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఉపా ధ్యాయుల చేతిలోనే ఉందన్నారు. వచ్చే పదవ తరగతి ఫలితాల్లో జనగామ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండాలని, అందుకు ఉపాధ్యా యులు అంతా కష్టపడి పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ జీవి తంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తామని,విద్యా ర్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిదన్నారు. అన్ని స్థాయి లలో విద్యార్థులను గైడ్ చేస్తూ వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. దేశ, రాష్ట్ర స్థాయిలో జిల్లాకి వచ్చిన పేరును కాపాడుతూ మున్ముందు మరిన్ని అంశాలలో జిల్లాను ము ందంజలో నిలబడేలా ఉపాధ్యాయులు చూ డాల న్నారు. వివిధ అంశాలలో రూపొందించిన ది క్సూచి కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయడం వలన ప్రభుత్వ పాఠశాలలో ఘనణీయంగా వి ద్యార్థుల నమోదు పెరిగిందన్నారు. అదనపు కలె క్టర్, డిఇఒ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ఎఎ స్‌లో జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టడం వలన దేశంలోనే 50 జిల్లాలో జనగామకు చోటు దక్కిం దన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం దిక్సూచి లాంటి కార్యక్రమాలను రూపొం దించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానం చేశారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ గోపిరాం, ఎడి సత్య నారాయణమూర్తి, ఆర్‌టిఎ సభ్యుడు అభిగౌడ్, మహాత్మాగాంధి హెల్పింగ్ హ్యాండ్ వ్యవస్థాప కుడు గంటా రవీందర్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అదికారులు యూనియన్ల ప్రతిని ధులు అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

## ఎంపిడిఒను కలిసిన కారోబార్లు



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** ఇటీ వల కొత్తగా బాధ్యతలు స్వీకరిం చిన ఎంపిడిఒ మమతా భాయ న్‌ను బుధవారం ఆయా గ్రామాల కారోబార్లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాం క్షలు తెలిపారు. అనంతరం గ్రామ పంచాయితీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జెఎసి మీడియా ఇన్‌చార్జి తేలు కంటి మురళి ఆధ్వర్యంలో ఎంపిడిఒను శాలువాతో సన్మానించారు. ఈ కార్య క్రమంలో పంచాయితీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ప్రభాకర్, జిల్లా నాయకులు బాబు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం




**ప్రజాపక్షం/ వరంగల్ :** భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, గంజాయి, మాధకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదా మని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈగల్, నార్కోటిక్ ,ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్, ఎలైట్ యాక్షన్ గ్రూప్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అధికారులను సస్పెండ్ చేయాలి, ఫార్మా, కెమికల్ పరిశ్రమల పేరిట డ్రగ్స్ దందాకు పాల్పడుతున్న దుర్మార్గులను కఠినంగా శిక్షిం చాలి ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వాలి ఉల్లా ఖాద్రి డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌ను నిర్మూలించాలని వరంగల్ పట్ట ణంలోని పోచమైదాన్ సెంటర్, రాణి రుద్రమదేవి విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో కోట్లు విలువ చేసే డ్రగ్స్, సంబంధిత కెమికల్స్ పట్టుబడటం సిగ్గు చేటని, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలను నిర్మూలిం చాలని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పరిశ్రమలలో ప్రభుత్వం తక్షణమే విస్తృత తనిఖీలు చేపట్టాలని, డ్రగ్స్ తయారు చేస్తున్న, సరఫరా చేస్తున్న దుర్మార్గులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, యువతకు ఆదర్శప్రాయుడైన భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత చెడు మార్గాలను, చెడు అలవాట్లను విడనా డాలని, అందుకే భగత్ సింగ్ 118వ జయంతి సంద ర్భంగా 'స్టాప్‌డ్రగ్స్ స్టార్ట్ స్పోర్ట్స్ 'పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈకా ర్యక్రమంలో భాగంగానే ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా డ్రగ్స్ నిర్మూలనలో తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభు త్వానిదేనని వారు డిమాండ్ చేశారు. చర్లపల్లి లోని వాగ్దేవి ల్యాబ్ యాజమాన్యాన్ని ప్రధాన నిందితుడు శ్రీనివాస్, విజయ్ ఓలేటి, తానాజి పట్వారీ తదితరులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనుమతి లేని కెమికల్, ఫార్మా ఇతర కంపెనీలపై దృష్టి పెట్టాలని అను మతి లేని ఫ్యాక్టరీల యాజమాన్యంపై చర్యలు తీసుకోవా లన్నారు. పరిశ్రమల ఏర్పాటు చేసుకోవడానికి రెంట్ లకు, లీజుకు ఇస్తున్న యజమానులు బాధ్యతను మరువ కుండా ఆయా పరిశ్రమల్లో ఏమి తయారు చేస్తున్నారో ముందుగా పరిశీలించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్‌ను అరికట్టడంలో చొరవ చూపిస్తున్నా ఆయా శాఖల అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని, అటువంటి అధికారులను సస్పెండ్ చేయా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జి ల్లా కార్యదర్శి మస్కసుధీర్, ఫరీన్, రేష్మా, కళ్యాణి, రాధ, హసీనా, జమునా తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## 30 సిక్సర్లు బాదిన అభిషేక్ శర్మ!




ఆసియా కప్ 2025 టోర్నీ కోసం టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ సన్నదమయ్యాడు. ప్రాక్టీస్ సెషలోనే సిక్సర్ల మోత మోగించి ప్రత్యర్థులకు గట్టి వార్నింగ్ ఇచ్చాడు. దుబాయ్లోని ఐసిసి అకాడమీలో జరిగిన టీమిండియా ఆప్షనల్ ట్రైనింగ్ సెషన్లో అభిషేక్ శర్మ గంట పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఈ సెషన్లో అతను సిక్సర్లను ప్రాక్టీస్ చేశాడు. 25 నుంచి 30 సిక్సర్లు బాదాడు. యుఎఇతో మ్యాచ్‌కు ముందే ఈ ప్రాక్టీస్ సెషన్ జరగడం విశేషం. అభిషేక్ శర్మతో పాటు సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా కూడా ఈ ప్రాక్టీస్ సెషన్లో పాల్గొన్నారు. కానీ అభిషేక్ శర్మ తనదైన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. తాను ఎదుర్కొన్న బంతులను మైదానం బయటకు పంపించాడు. బంతిని అద్భుతంగా కనెక్ట్ చేశాడు. అతని బ్యాట్ స్వింగ్, కనెక్ట్ చేసే విధానం అతను ఫామ్‌లో ఉన్నాడనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. జస్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్, హర్షిత్ రాణా బౌలింగ్ ప్రాక్టీస్ చేయగా.. అర్ష్‌దీప్ సింగ్ ఫిటెనెస్ డ్రిల్స్ చేశాడు. ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ గైడెన్స్‌లో వికెట్ కీపర్ జితేష్ శర్మ కీపింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఆసియా కప్ 2025 టోర్నీలో తొలి పోరుకు టీమిండియా సన్నద్ధమైంది. మరికొద్ది క్షణాల్లో యుఎఇతో జరిగే మ్యాచ్‌తో టీమిండియా తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. టైటిల్ ఫేవరేట్‌గా.. టీ20 ప్రపంచ ఛాంపియనన్‌గా టీమిండియా బరిలోకి దిగుతుంది. యుఎఇఈ గెలవడం టీమిండియాకు పెద్ద కష్టం కాకపోవచ్చు. ఈ గెలుపుపై ఎవరికీ సందేహాలు కూడా లేవు. తర్వాతి పోరులో తలపడాల్సింది చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో కావడంతో ఈ మ్యాచ్‌ను భారత్ సన్నాహకంగా ఉపయోగించుకోనుంది.

## తొలి రౌండ్లోనే సింధు నిష్క్రమణ.. ప్రణయ్, లక్ష్యసేన్ ముందంజ..!

గత ఏడాది కాలంగా మేజర్ టైటిల్ కోసం నిరీక్షిస్తున్న పివి సింధు మరో సారి నిరాశపరిచింది. హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్ తొలి రౌండ్ లోనే ఓటమి పాలైంది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో డెన్మార్క్‌కు చెందిన లినే క్రిస్టోఫెర్సెన్ చేతిలో సింధు అనూహ్యంగా కంగుతిన్నది. గతంలో లినేను ఐదుసార్లు చిత్తు చేసిన భారత స్టార్ ఈసారి మాత్రం చేతులెత్తేసింది. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ ముందంజ వేశారు. ఈ మధ్యే ముగిసిన బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రెండో సీడ్‌పై గెలుపించిన సింధు హాంకాంగ్ ఓపెన్లోనూ పేలవ ఆటకు మూల్యం చెల్లించుకుంది. ఆరంభంలో దూకుడుగా ఆడి 21–15తో తొలి సెట్ గెలుపొందినప్పటికీ అదే దూకుడు కొనసాగించలేక ప్రత్యర్థికి అవకాశమిచ్చింది. రెండో సెట్‌లో పుంజుకున్న లినే 16–21తో పైచేయి సాధించింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో సింధు పోరాడినపప్పటికీ 19–21తో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్, కిరణ్ జార్జ్, ఆయుష్ శెట్టిలు తమ రాకెట్ పవర్ చూపించారు. చైనాకు చెందిన గాంజ్ జూను మట్టికరిపించి ప్రణయ్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. టీ.డబ్యూ. వాంగ్‌ను 22–20, 16–21, 21–15తో ఓడించి సేన్ ముందంజ వేశాడు. యువకెరటం జార్జ్ సైతం ప్రత్యర్థి టీ.జేసన్‌కు చెక్ పెట్టి రెండో రౌండ్‌లో అడుగుపెట్టాడు.





## స్కూల్‌గేమ్స్ కబడ్డీ జట్టుకు ఎస్ఆర్‌డిజి స్కూల్ విద్యార్థులు



**హైదరాబాద్:** ఘటకేసర్‌లో జరగనున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గేమ్స్‌లో జిల్లా జట్టుకు బోడుప్పల్ ఎస్ఆర్‌డిజి పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. బాలికల అండర్ 17 విభాగంలో శ్రావణి, లాస్య, బాలుర అండర్ 14 విభాగంలో నవదీప్ ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపల్ బిఎన్ఎల్ శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి జట్టుకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు.

# ఫోకస్

## అణు సిద్ధాంతవేత్త ఎపిక్యూరస్



క్రీస్తుపూర్వం 3వ శతాబ్దంలోనే అణు సిద్ధాంతాన్ని ప్రకటించిన గొప్ప దార్శనికుడు ఎపిక్యూరస్. ఏథెన్స్‌లో జీవించిన ఈ గ్రీకు తత్వవేత్త అణు సిద్ధాంతాన్ని, పరిణామ సిద్ధాంత భావనలను బలంగా ప్రచారం చేశాడు. మతం అనేది మూఢ నమ్మకమని తేల్చిచెప్పాడు. 'ఎపిక్యూరియన్' తత్వాన్ని ప్రతిపాదించాడు. జీవితం ఆనందకరమైనదని, భయంతో బతకాల్సిన అవసరం లేదని ఆకాలంలోనే ఎపిక్యూరస్ తేల్చిచెప్పాడు. రకరకాల మూఢ నమ్మకాలతో మనిషి నిత్యం భయంతో బతకడాన్ని ఆరోజుల్లోనే గుర్తించిన అతను, అలాంటి ఆలోచనా విధానాన్ని మానుకోవాలని ప్రజలకు హితవు పలికాడు. ఏథెన్స్‌లో 'ది గార్డెన్' పేరుతో సొంతంగా విద్యాలయాన్ని నెలకొల్పి, తాను ప్రతిపాదించిన కొత్త తత్వాన్ని బోధించాడు. పరమాణువు గురించిన ప్రస్తావన చేసిన తొలితరం మేధావుల్లో ఎపిక్యూరస్ ఒకడు. భూమి, వాయువు, నీరు, అగ్ని అనే నాలుగు మూలకాలను విశ్వనిర్మాణంగా భావించే రోజుల్లో, అందుకు భిన్నమైన పరమాణు సిద్ధాంతాన్ని అతను ప్రతిపాదించాడు. తర్వాతి కాలంలో రోమన్ కవి లుక్రీషిస్ ఇదే సిద్ధాంతాన్ని కొంత విస్తృత పరచి, 'ఆన్ ది నేచర్ ఆఫ్ థింగ్స్' అనే పుస్తకాన్ని రాశాడు. అందులో ఎపిక్యూరస్ సిద్ధాంతాన్ని విశ్లేషించాడు. ఈ విశ్వం మొత్తం పరిమితమైన పదార్థాలతో రూపుదిద్దుకుందని ఎపిక్యూరియస్ భావించాడు. అదే విధంగా మనకు కనిపించని కొన్ని పదార్థ కణాలతో ప్రపంచం కూడుకున్నదని నమ్మాడు. ఈ కూర్పు ఎప్పటికప్పుడు మారుతూ, కొత్తకొత్త ప్రక్రియలకు బీజం వేస్తుంటుందని అభిప్రాయపడ్డాడు. ఆ రోజుల్లో విపరీతంగా ఉన్న 'భగవంతుడు' అనే నమ్మకాన్ని కూడా అతను లోతుగా విశ్లేషించాడు. దేవుళ్ల ప్రకృతిలో భాగమే తప్ప, జీవితాలపై వారిపై ఎలాంటి ప్రభావం చూపలేని స్పష్టం చేశాడు. ఒక రకంగా గ్రీకు 'అథీయిజం'తో ఎపిక్యూరియస్ తత్వానికి చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి. మొత్తం మీద ఎపిక్యూరస్ తన సమకాలీనులు ఎవరూ ఊహించలేని రీతిలో విప్లవాత్మకమైన శాస్త్రీయ దృష్టిని ప్రతిపాదించాడు. ఆయన తత్వం పదార్థవాదానికి, వైవిధ్యమైన సోచనలకు, మానవ వివేకానికి పునాదులు వేసింది.

## తవ్విన కొద్దీ ఆధారాలు!



ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో తవ్వినకొద్దీ చారిత్రక ఆనవాళ్లు ఎన్నో బయటపడుతున్నాయి. తుర్కియే (టర్కీ)లోని కైసెరి ప్రాంతంలో లభించిన టెరాకొటా స్నాన పాత్రలు ఈ కోవకు చెందినవే. వీటిని క్రీస్తుపూర్వం 17 నుంచి 19వ శతాబ్దం మధ్యకాలానికి చెందినవిగా పరిశోధకులు పేర్కొంటున్నారు. ఆ ప్రాంతంలో, రాతిశిలా యుగపు హటియన్స్ నుంచి కాంస్య యుగంలోని హిటియాన్స్ వరకూ చరిత్ర కొనసాగిందని అంటున్నారు. ఫ్రెజియన్, సెల్జుక్, ఒట్టోమన్ టర్క్స్ తదితర సామ్రాజ్యాలు ఇక్కడ విరాజిల్లాయి. హిటియాన్స్, ప్రాచీన ఆస్సిరియన్ సంస్కృతుల్లో, ఇలాంటి స్నాన పాత్రలను వాడేవారని ప్రాథమిక అంచనా. ఇక్కడ లభించిన టెరాకోటా పాత్రలు సాధారణంగా నిండుగా ఉండే ఆకృతులే. కళాకృతులను వాటిపై చెక్కడాన్ని గమనించవచ్చు. అదే సమయంలో పాత్రలు విరిగిపోకుండా, మన్నిక కలిగి ఉంటాయి. శిల్పకారులు ఈ స్నాన పాత్రలను రూపొందించడానికి మృద్రాంగ (టెరాకోటా) మట్టి ఉపయోగిస్తారు. వాటిని చక్కటి ఆకృతిగా రూపుదిద్ది, కొంత విభిన్నమైన రంగులు, స్థానిక పదార్థాలతో పూత వేసేవారు. కొన్నిసార్లు పై భాగంలో చిన్న అలంకారిక రూపకాలను కూడా తీర్చిదిద్దారు. కొన్ని పాత్రలు జూమోర్ఫిక్ (పశుపక్షి రూపు) వంటి సృజనాత్మక ఆకృతుల్లో కూడా కనిపిస్తున్నాయి. ఇవి హిటియాన్స్ కళా సంస్కృతి రంగాన్ని ప్రతిబింబిస్తాయి. కాగా, ఈ పాత్రలు ఆ కాలంలో నీటిని నిలువ ఉంచే విధానం, ఉపయోగించే పరిస్థితులు తెలుసుకోవాడానికి ఇలాంటి స్నాన పాత్రలు ఉపయోగపడతాయి. ప్రతి ఇంట్లోనూ నిత్యావసరంగా వీటి వాడకం ఉండేదని తెలుస్తున్నది. కొన్ని సందర్భాల్లో పూజా మందిరాల్లోనూ ఈ టెరాకొటా పాత్రలను వాడతారు. ఈ పాత్రలు వారి జీవనశైలి, శుభ్రత, క్రతువుల నెరవేర్పునకు నిదర్శనంగా ఉన్నాయి. సుమారు 4000 సంవత్సరాల క్రితం కూడా ప్రజలు ఇంతటి మన్నికైన పాత్రలు వాడారంటే ఆశ్చర్యం కలిగక మానదు.

## నమ్మకం నిజమైంది!



స్థానికంగా ప్రజల్లో ఒక బలమైన నమ్మకం నిజమేనని పరిశోధనల్లో రుజువుకావడం విశేషం. తమ పూర్వీకులు మాంటానా ప్రాంతంలో సుమారు 18,000 సంవత్సరాలుగా జీవిస్తున్నారని 'బ్లాక్‌ఫీట్' జాతి ప్రజలు శతాబ్దాలుగా నమ్ముతూ వచ్చారు. దీనిపై విస్తృత పరిశోధనలు జరిగాయి. చివరికి విప్లవాత్మక డిఎన్ఎ పరిశోధన ద్వారా వారు నమ్మకం నిజమేనని రుజువైంది. జెనెటిక్ విశ్లేషణ ఈ విషయాన్ని నిర్ధారించింది. అంటే, లిఖిత చరిత్ర ప్రారంభానికి చాలా ముందే, ఈ భూమిపై తమ ఉనికి ఉందన్న వారి నమ్మకాన్ని ధ్రువీకరించింది. తరతరాలుగా జాగ్రత్తగా కాపాడుకున్న మౌఖిక చరిత్రలు ఇప్పుడు శాస్త్రీయ ఆధారాలతో అనుసంధానంకావడం విశేషం. ఈ పరిశోధన బ్లాక్‌ఫీట్ ప్రజల పూర్వీకుల భూమితో ఉన్న లోతైన బంధాన్ని మరింత బలపరిచింది. ఇది కేవలం శాస్త్రీయ ఆవిష్కరణ మాత్రమే కాకుండా, వారి సంస్కృతి, వారసత్వం, సహనశక్తి, అక్కడి నేలపై తమకు ఉన్న అనుబంధాన్ని అద్భుతంగా ప్రతిబింబించింది. కాగా, ఈ ఫలితాలు ఉత్తర అమెరికాలోని మానవ వలసలపై ఇప్పటివరకు ఉన్న అనేక పాత ఊహాగానాలను సవాలు చేస్తున్నాయి. ఇప్పటి వరకు భావించిన దానికంటే చాలా ముందుగానే ఆదివాసీ సమాజాలు స్థిరమైన నివాసాలను ఏర్పరుచుకున్నారని ఈ పరిశోధన స్పష్టం చేసింది. బ్లాక్‌ఫీట్ ప్రజల మౌఖిక సంప్రదాయాలు, ఆచారాలు, జ్ఞాపకాలు తదితరాలన్నీ కేవలం కథలు కాదని, శాస్త్రం కూడా అంగీకరించిన సత్యాలు అని నిరూపించింది.

# భావితరాలకు స్ఫూర్తి 'ఐలమ్మ'

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సరూర్‌నగర్..



నల్లగొండ..



ఖమ్మం..

**ప్రజాపక్షం/నలగొండటౌన్ :** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి, ధీరవనిత చిట్యాల ఐలమ్మ పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల రజక భవనం వద్ద రజక సంక్షేమ భవన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో ముందు భాగాన నిలబడి ఐలమ్మ పోరాడిందన్నారు. కార్యక్రమంలో డిబిసిడిఓ రాజ్ కుమార్, ఎంబిసి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మినారాయణ, నాగిళ్ళ మురళి, పిల్లి రామరాజు, పంకజ్ యాదవ్, కరీంపాషా, అయితగోని యాదయ్య, పగిల్ల సైదులు పాల్గొన్నారు.

**వరంగల్ :** చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సమాజ మార్పునకు పోరాటాలు కొనసాగిస్తామని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వరంగల్ తమ్మెర భవన్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, జిల్లా నాయకులు పనాస ప్రసాద్, వరంగల్ మండల కార్యదర్శి గుండె భద్రి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సంఘీ ఏలేందర్, ల్యాదళ్ల శరత్, ఓర్సు రాజు, ఎండి అక్బర్ పాషా, మహేష్, స్వేత, చిరంజీవి, రాజేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

**బిసి హక్కుల సాధనసమితి ఆధ్వర్యంలో..** వీరనారి చాకలి ఐలమ్మ అందించిన పోరాట స్ఫూర్తితో సంఘటితంగా పోరాడి రాజ్యాధికారాన్ని సాధించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ మండల కార్యదర్శి గుండె బద్రి, బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న, బుస్స రవీందర్ , పరికిరాల రమేష్, రహేల సుధీర్, దస్రూ, సాంబయ్య, మహేష్, శ్వేత, రాజేష్, లడ్డు, సునీల్, ఆనంద్, స్వాతి పాల్గొన్నారు.

**ఖమ్మం :** చిట్యాల (చాకలి) ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ఉద్యమ నిర్మాణం జరగాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. తెలంగాణలో నైజాం రక్కసి పాలనకు వ్యతిరేకంగా జమీందారి, జాగీర్‌దారి తనంపై ఐలమ్మ వీరోచిత పోరాటం నిర్వహించారని ఆయన తెలిపారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సిపిఐ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలకు, మానాలకు రక్షణ లేని పరిస్థితుల్లో ఐలమ్మ చూపిన తెగువ, చేసిన పోరాటం వెలకట్టలేనిదన్నారు. తెలంగాణ విముక్తి ఉద్యమంలో ఐలమ్మ లాంటి అనేక మంది వీరోచిత పోరాటాలు నిర్వహించడంతోనే నైజాం పాలన అంతమొందిందని హేమంతరావు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, మహ్మద్ సలాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

**దేవరకొండ :** దొరల గడిలను కూల్చిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మైనోద్దీన్, సిపిఐ మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, వెంకట్రాములు, వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, లింగం, భూపాల్‌రెడ్డి, పుల్లయ్య, జమిల్, శ్రీను తదితరులు ఉన్నారు.

**సరూర్‌నగర్ :** తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ చూపిన ధైర్య సాహసాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం ఆర్‌కెపురంలో ఐలమ్మ వర్ధంతిని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభాకర్‌గౌడ్ హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసిన ఐలమ్మను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ఎండి.ఫైమిదా, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారగోని ప్రవీణ్ కుమార్‌గౌడ్, రజక వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యధర్శి బొడ్డుపల్లి కృష్ణ, సిపిఐ మాజీ ఎంపిటిసీ ఆర్.గోపాల్, జోజి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గ్యార క్రాంతికుమార్, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



దేవరకొండ...



వరంగల్..



# అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనాలు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌లకు కనీస వేతనాలు అందజేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఇచ్చోడ మండల మహాసభ జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది చిన్నారులకు, కిశోర బాలికలకు, బాలితలకు, గర్భిణీలకు అనేక రకమైన సేవలందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌లకు వారు అందిస్తున్న సేవలకు తగ్గట్టు వేతనాలు అందజేయాలన్నారు. ఈనెల 13న నిర్వహించనున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా మహాసభలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఇచ్చోడ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇచ్చోడ మండల అధ్యక్షురాలిగా వజ్రమాల, ప్రధాన కార్యదర్శి టి.స్వప్న, కోశాధికారి అనసూయలను ఎన్నుకున్నారు.



సమావేశంలో ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, ఇచ్చోడ మండల ఎఐటియుసి కార్యదర్శి కల్లేపల్లి గంగయ్య, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# నేటితరానికి తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసిన నాటి తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల జీవిత చరిత్రను నేటి తరానికి అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం ధర్మభిక్షం భవన్‌లో దంతాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 11 నుండి 17 వరకు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాలు జిల్లా కేంద్రంలో తెలంగాణా సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మబిక్షం చౌక్ వద్ద గురువారం ప్రారంభమవుతాయని తెలిపారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, కౌన్సిల్ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, రేగట్టి లింగయ్య, దీకొండ శ్రీనివాస్, ఎండి పాషా, ఎడెల్లి శ్రీకాంత్, దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, పాదిల వెంకటమ్మ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## రైతులకు తప్పని యూరియ కష్టాలు



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండల కేంద్రంలోని రైతు వేదికలో యూరియా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ యురియా సరైన సమానానికి రైతులకు అందడం లేదని ఒక్కొక్కరికి రెండు నుండి నాలుగు వరకు అందిస్తున్నారని రైతులకు యురియ సరిపోవడం లేదని తెలిపారు.ప్రాథమిక వ్యవసాయ కేంద్రం అధికారులు సరిపడేంత యూరియా తెప్పించాలని అందివ్వాలని రైతులు కోరారు.



## భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ఐలమ్మ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య అన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించామని కంజర భూమయ్య అన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి నుండి విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో నేడు దేశంలో జరుఉతున్న అరాచకాలు నిర్మించటానికి ఆమె చూపిన బాటలు నడవవల్సిందిగా భూమన్న కొనియాడారు. కార్యక్రమంలో కమలాపురం రాజన్న, రాజేశ్వర్, జిల్లా నాయకులు సిహెచ్.సాయిగౌడ్, సిపిఐ మోపాల్ మడల కార్యదర్శి మేకల సాయిలు, వేల్పూర్ గంగారాం, యువజన సంఘం జిల్లా కార్యదర్శి పి.రంజిత్‌కుమార్, వేల్పూర్ రమేష్, హుస్సేన్, బోర్గాం(పి) గ్రామప్రజలు, రాజేశ్వర్ పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు బాలికల జట్టు ఎంపిక

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని విద్యార్థినీలు 44వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన నిజామాబాద్ జిల్లా క్రీడాకారులకు సన్నదత శిభిరం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 12వ తేది నుంచి 14వ తేది వరకు జనగామ జిల్లాలో జరిగే 44వ తెలంగాణ రా ష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన బాలికల జట్టుకు మోర్తాడ్ జిల్లా పరిషత్ హై స్కూల్ బాలికల పాఠశాలలో సన్నదత శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మోర్తాడ్ యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అరుగుల రమేష్, ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకోవడం జరిగింది. రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు తెలిపి, రాబోయే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా జట్టును ఉన్నత స్థాయిలో నిలపాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళి మోర్తాడ్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు అశోక్, నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## పట్టుబడిన ఆయుధం దొంగిలించిన నేవీ కానిస్టేబుల్

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట :** దేశ భద్రతకు సంబంధించిన ఆయుధాల దొంగతనం అత్యంత తీవ్రమైన నేరమని, ఇలాంటి ఘటనల్లో పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి అని జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్ హెచ్చరించారు. పెంచికల్పేట్ మండలం ఎలుకపల్లి గ్రామానికి చెందిన నావి కానిస్టేబుల్ దుబ్బల రాకేష్ (22) తన సోదరుడు ఉమేష్ సహకారంతో ముంబై నావి కేంద్రం నుండి ఒక ఇన్సాస్ ఆయుధం, 3 మ్యాగ్జిన్లు, 40 రౌండ్లను దొంగిలించాడు. సెప్టెంబర్ 6న ముంబైలో జరిగిన ఈ ఘటన అనంతరం నిందితులు స్వగ్రామానికి చేరుకున్నారు. ముంబై క్రైమ్ పోలీసులు విచారణ జరిపి ఆధారాలు సేకరించి, రాకేష్, ఉమేష్‌లను వేకువజామున అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆయుధం, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముంబై క్రైమ్ పోలీసులకు సహకరించిన కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి, పెంచికల్పేట్ ఎస్ఐ అనిల్ కుమార్, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్ అభినందించారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**ప్రజాపక్షం/మెదక్ :** పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఉపయోగపడుతుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.బుధవారం చిన్న శంకరంపేట మండలంలో రైతు వేదికలో కళ్యాలక్ష్మి, షాది ముబారక్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు సంబంధించి మంది లబ్ధిదారులకు 33 కల్యాణలక్ష్మి, 06 షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్ మాట్లాడుతూ, 33 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 06 చెక్కులు ద్వారా 39 లక్షల రూపాయలు లబ్ధి చేకూరిందని అన్నారు. మహిళలు ఈ డబ్బులను వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవలన్నారు. ఈ పథకం కింద అర్హత కలిగిన లబ్ధిదారులకు వారి వివాహం సమయంలో ఒకేసారి రూ.100,116 ఆర్థిక సహాయం లభిస్తుందని వివాహ సంబంధిత ఖర్చులను భరించటానికి మరియు ఆర్థిక భారం లేకుండా వివాహ వేడుకను నిర్వహించడంలో కుటుంబాలకు మద్దతు ఇవ్వడానికి ఈ సహాయం అందించబడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, వివిధ ప్రజాప్రతినిధులు ప్రభుత్వాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాసర ఆర్జీయుకెటి అభివృద్ధికి చర్యలు

మంత్రి జూపల్లి





**ప్రజాపక్షం/నిర్మల్ :** బాసర ట్రిపుల్ ఐటిని (ఆర్జీయుకెటి) మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రొహిబిషన్,ఎక్సైజ్ శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం బాసర పర్యటనలో భాగంగా మంత్రి క్యాంపస్‌ను సందర్శించి, సూమారు రూ.1.7 కోట్ల విలువైన మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశారు. విద్యార్థులతో మూఖాముఖి సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా తయాయవ్వాలన్నారు. భరతనాట్యం, కూచిపూడి, సంగీతం, సాహిత్యం వంటి విభాగాల్లోనూ విద్యార్థులు రాణించాలని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటికి అవసరమైన నిధులు సమకూరుస్తామని తెలిపారు. విద్యార్థులకు సమస్యలకు సానుకూలంగా స్పందించిన మంత్రి, పరిష్కరించగలిగిన వాటిని వెంటనే చర్యలు తీసుకుంటానని, మిగతావి సంబంధిత మంత్రులు,ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు.

**సమస్యలు సహజం..అధిగమించాలి**

నేటి యువత చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మంత్రి. జీవితంలో ఒడిదొడుకులు సహజమని, విఫలమైతే ఆగిపోవడం కాదు.. మళ్లీ లేచి నిలబడాలంటూ విద్యార్థులను ప్రేరేపించారు. మొబైల్ ఫోన్లలో మునిగితేలుతూ విలువైన సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. పండగలు, ఆటపాటల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. బాసర ట్రిపుల్ ఐటి సాంస్కృతిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.1కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో విద్యార్థులకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులతో భోజనం చేసి, కొత్త యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని విభాగాల్లోనూ నాణ్యమైన విద్య, వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పలువురు విద్యార్థులు అగ్రగామి సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఐఐఐటి ఉపకులపతి గోవర్ధన్, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

**బాసరలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన**

బాసరలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర ప్రొహిబిషన్,ఎక్సైజ్ శాఖా మంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం శంకుస్థాపన చేశారు.ఎంపీ గోడం నగేష్,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు.సూమారు రూ.5.75 కోట్ల వ్యయంతో 30 పడకల ఆసుపత్రిని నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు.ఆసుపత్రి పూర్తయితే బాసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.అనంతరం మంత్రి జూపల్లి భారీ వర్షాల వల్ల బాసర పరిసరాల్లో నష్టపోయిన పంట చేసులను పరిశీలించారు.రైతులతో మాట్లాడి పంట వివరాలు,పెట్టుబడి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.పంట నష్టపోయిన ప్రతి రైతుకు తప్పక నష్టపరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతుల వివరాలు,నివేదికలు త్వరితగతిన అందజేయాలనీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్,డీఎంహెచ్చో రాజేందర్,వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పెత్తందారుల అణచివేతను ప్రశ్నించిన వీరవనిత ఐలమ్మ

కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాపక్షం/నస్పూర్ :** తెలంగాణ సాయుధ భూ పోరాట ఉద్యమంలో పెత్తందారుల అణచివేతను ప్రశ్నించి భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అందరికీ ఆదర్శం అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో ఐలమ్మ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, వివిధ శాఖల అధికారులు, సంఘాల నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ భూ పోరాటానికి నాంది పలికిన మొదటి వ్యక్తి ఐలమ్మ అని గుర్తుచేశారు. ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి కేటాయిస్తున్నామని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు సమర్పిస్తే సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 10 లక్షల వరకు వైద్యసేవలు అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**నస్పూర్ :** తెలంగాణలో రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని, సొసైటీలకు సబ్సిడీ రుణాలు, వృద్ధులకు పెన్షన్, బడ్జెట్ కేటాయింపులు చేయాలని రజక సంఘం మండల అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్, కార్యదర్శి పుట్టపాక తిరుపతి అన్నారు. నస్పూర్ మున్సిపాలిటీలోని రజక సంఘం కార్యాలయంలో బుధవారం చాకలి (చిట్యాల) ఐలమ్మ 40వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రజక సంక్షేమ భవనాలు, రజక ఫెడరేషన్‌కు పాలక మండలి ఏర్పాటు, దాడులను అరికట్టేందుకు సాంఘిక భద్రతా చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నేదునూరు మహేష్, మండల ఉపాధ్యక్షులు కొండపాక శ్రీనివాస్, నస్పూర్ కాలనీ గౌరవ అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, బూసరాజు నాగేందర్, పాయురాల వెంకటేష్, నగునూరి అనిల్ తదితర రజక కుల బంధువులు పాల్గొన్నారు.



## నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/హాజీపూర్, మంచిర్యాల :** జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ మంచిర్యాలలోని కాలేజ్ రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి భవనం, హాజీపూర్ మండలం గుడిపేటలో ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఆధునిక వైద్య పరికరాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నామని, వైద్యులు, సిబ్బంది సంఖ్య పెంపొందించేందుకు 216 కోట్ల రూపాయల నిధులతో ఆసుపత్రి, వైద్య కళాశాల నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. భవన నిర్మాణ పనులను అధికారులు సమన్వయంతో వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనూష, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవితకు గురువులే బాట

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ ఎంఎల్‌ఎ కోవ లక్ష్మి తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి వెలిగించి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని, వారికి సరైన మార్గదర్శనం చేసే బాధ్యత ఉపాధ్యాయులదే అని పేర్కొన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో ఉపాధ్యాయులు అసాధారణమైన పాత్ర పోషిస్తారని ప్రశంసించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, అదే విధంగా పదో తరగతి వార్షిక ఫలితాల్లో మెరుగుదల సాధించాలని, విద్యార్థుల హాజరు నూరు శాతం ఉండేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, ఉత్తమ సేవలందించిన 4 మంది పిజి హెచ్‌ఎంలు, 22 మంది స్కూల్ అసిస్టెంట్లు, 14 మంది ఎస్‌జిటిలు, ముగ్గురు కస్తూర్బా గాంధీ విద్యాలయాల ఉపాధ్యాయులు, ఇద్దరు ఇఆర్‌పిలు, 13 మంది గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, డిఇఒ ఉదయ్ బాబు, పిఎసిఎస్ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గంజాయిపై ఉక్కుపాదం

ఉట్నూర్ ఎఎస్పీ కాజల్ సింగ్ ఐపిఎస్



**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ, సిరికొండ, పోలీస్ స్టేషన్ పరిధిలో పంట చేలలో గంజాయి పండిస్తున్నారనే సిసిఎస్, ఇచ్చోడ సిఐకి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సిసిఎస్ బృందం సిఐ ఆధ్వర్యంలో సిరికొండ, నేరడిగొండ పోలీసులు సంయుక్తంగా ఆయా గ్రామల శివారులో తనిఖీ చేయగా సిరికొండ మండలం సిడందేవురావు(40) మక్క, సోయా చేసులో అంతర పంటగా చట్ట వ్యతిరేకంగా పండిస్తున్న 66 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని అతనిపై ఎన్‌డిపిఎస్ కేసు నమోదు చేయడం జరిగిందని, అదేవిధంగా నేరడిగొండ పోలీస్ స్టేషన్ నందు పెందుర్ సీతబాయి, తన మక్క చేనులో ఏడు గంజాయి మొక్కలను పండిస్తున్నట్లు వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఉట్నూర్ ఎఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఉట్నూర్ ఎఎస్పీ మాట్లాడుతూ గంజాయి పండించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. వ్యవసాయ భూమిలో చట్ట వ్యతిరేకంగా ఎవరైనా గంజాయి సాగు చేస్తే పండిస్తున్న వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. లభ్యమైన 73 గాంజాయ్ మొక్కల విలువ బహిరంగ మార్కెట్లో ఒక మొక్క దాదాపు 10వేల చొప్పున మొత్తం 6.4 లక్షల విలువ చేస్తుందని తెలిపారు.సంఘటన స్థలంలో వ్యవసాయ అధికారి చే ధ్రువీకరించి పంచనామ నిర్వహించి కేసు దర్యాప్తును చేయడం జరిగిందని తెలిపారు.గంజాయి పై ఉక్కు పాదం మోపుతున్నట్లు గంజాయి పై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జిల్లాలో గంజాయి లేకుండా చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సిఐ బండారి రాజు, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ పి.చంద్రశేఖర్, ఎస్సైలు వి.పురుషోత్తం, ఇమ్రాన్, పూజ సిసిఎస్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సబ్‌కలెక్టర్‌కు నాయక్‌పోడ్‌ల వినతి



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** కామారెడ్డి జిల్లాలోని నాయక్‌పోడ్ (ఎస్టీ) కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమకు ఎస్టీ కుల ధృవపత్రాలు అందించాలని కోరుతూ కామారెడ్డి జిల్లా ఆదివాసి నాయకపోడ్ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలోని 9 మండలాల్లో 27 గ్రామాలలో నాయకపోడ్ తెగ వారం నివసిస్తున్నామని, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో జీవో నెంబర్ 11 తేది 21–01–1992 జీవో నెంబర్ 144 ప్రకారం కుల ధృవీకరణ పత్రాలు తాము పొందామని, ఈ మధ్యకాలంలో ట్రైబర్ వెల్ఫేర్ అధికారులు హైదరాబాద్ తదితర మండలాల తహసీల్దార్లు అవగాహన లోపం కారణంగా తమ పిల్లల (విద్యార్థులు)కు ధృవీకరణ పత్రాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నామని, దీని వలన తమ పిల్లలకు గురుకుల, మోడల్‌స్కూల్, నవోదయా వంటి విద్యా సంస్థల్లో ప్రవేశ పరీక్షలు రాయలేకపోతున్నారని, నిరుద్యోగులు ఉద్యోగాలు పొందలేకపోతున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తు చేయడానికి కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడం లేదని, జిల్లాలోని నాయకపోడ్ విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తమకు కుల ధృవీకరణ పత్రాలు త్వరితగతిన ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని వారు సబ్ కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

**మహ్మద్‌నగర్‌లో రోడ్డుపై ఆందోళన**

తమకు కుల ధృవీకరణ పత్రాలు అందించడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో మహ్మద్‌నగర్ మండలకేంద్రంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వారి ఆందోళనతో వాహనాలు రోడ్డుపై ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు వెంటనే స్పందించి మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ద్వారా సమస్యను తెలుసుకున్నారు. వెంటనే అధ్యక్షుడు పెంటయ్యతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు రాస్తారోకోను విరమించారు.

## బతికినంత కాలం ప్రజా సేవే లక్ష్యం

చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** బ్రతికున్నంత కాలం పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలానికి మంజూరైన66 కల్యాణలక్ష్మి, షాదీ మూబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, పేద ప్రజల ఇబ్బందుల ను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఏడుపాయల ఆలయ అభివృద్ధికి క్రమంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అన్ని అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. మాజీ కోఆప్షన్ సభ్యులు గౌస్ పాషా జన్మదిన వేడుకల్లో పాల్గొని గౌస్ తో కేక్ కట్ చేయించారు. తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపిడిఒ విష్ణువర్ధన్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గోవింద్ నాయక్, నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్, మోహన్, రాజశేఖర్, నాగరాజ్, సత్యనారాయణ, శ్రీధర్, రమేష్ గౌడ్, కలీం, నరేందర్, గణేష్, భారత్, చోటు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం



**ప్రజాపక్షం/చేర్యాల:** చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్మిస్తామని సిపిఐ అందే అశోక్ అన్నారు.బుధవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చేర్యాల పట్టణంలో అంగడి బజార్ వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మొక్కవోని ధైర్యంతో తన ఇంటినే కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంగా మార్చి ఎందరో పోరాట వీరులకు అండగా నిలబడి ఉద్యమాన్ని పదునెక్కించిన గొప్ప వ్యక్తి ఐలమ్మ అన్నారు.ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి, నర్సింహా చారి, కనకయ్య, మమత, సుంకోజు రజిత, సత్యనారాయణ, , రాములు, యాదగిరి, పాల్గొన్నారు.

## ధైర్యసాహసాలకు మారు పేరు ఐలమ్మ

### వర్ధంతి సభలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/వేములవాడ :** ధైర్యసాహసాలకు మారు పేరు చాకలి ఐలమ్మ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.వేములవాడ పట్టణంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమనికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పోరాడిన అగ్రగామి మహిళా యోధురాలని, ఆమె ధైర్యసాహసాలు నేటి తరానికి ప్రేరణనిస్తున్నాయని పేర్కొన్నారు. ఐలమ్మ చూపిన మార్గంలోనే సమాజం ముందుకు సాగాలంటూ తెలిపారు. ఆమె చేసిన పోరాటాలు గౌరవించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కోటి మహిళ కళాశాలకు వారి పెరు పెట్టి గౌరవించారని, కుటుంబ సభ్యులకు రాజకీయంగా గుర్తింపు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ తరం యువత ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకపోవలని సూచించారు.

## పోరాట స్ఫూర్తికి ప్రతీక



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా వీరవనిత చాకలి ఐలమ్మ నిలుస్తుందని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు.బుధవారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీక అని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసి వీర వనితగా చరిత్రలో నిలిచి పోయారని, అటువంటి వీరవనితను స్మరించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంఘ సేవకురాలుగా, భూమి, భుక్తి కోసం, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకం అని, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని, ఆమె ఆశయాలను నేటి తరం వారు కొనసాగించా లని తెలిపారు.ప్రజలు గురవుతున్న ఇబ్బందులకు వ్యతిరేకంగా, సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి, రజక సంఘ నాయకులు, జిల్లా అధికారులు, బి.సి., కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం అవినీతి కేసులో కెసిఆర్‌ను తీహార్ జైలుకు పంపాలి

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కాళేశ్వరం అవినీతి కేసులో కేంద్ర ప్రభుత్వం సిబిఐ విచారణ జరిపి కెసిఆర్‌ను తీహార్ జైలుకు పంపాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం అన్నారు. బుధవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు కోట్ల ప్రజలు ఉద్యమం చేస్తే, శ్రీకాంత్ చారి లాంటి ఎంతో మంది నిరుద్యోగ యువత బలిదానం చేసుకుంటే చలించి పోయిన సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ప్రకటించారన్నారు. కెసిఆర్ సిఎం అయ్యాక వారి ఇంట్లోనే నాలుగు ఉద్యోగాలు వచ్చాయని, నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదన్నారు. ఆ నలుగురి ఉద్యోగాల తరువాత తెలంగాణ 8 లక్షల కోట్ల అప్పుల పాలయ్యిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కోటి 40 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయని కెసిఆర్ చెప్పారని, నిర్మాణానికి రక్తం దార పోసి కర్త, కర్మ, ఇంజనీరు అన్నీ తానే కట్టానని కెసిఆర్ చెప్పిన వ్యాఖ్యలు గుర్తు చేశారు. రూ. 1.50 లక్షల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ఖర్చయ్యిందని చెప్పారని, కానీ 35 వేల కోట్లు వాస్తవ ఖర్చు అయితే లక్ష 15 వేల కోట్లు దోచుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జస్టిస్ ఘోష్ కమిషన్ వేసిన విచారణ అనంతరం నివేదికలో వాస్తవాలు ప్రజలకు తెలిసాయని, అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు సీఎం అందజేయడం జరిగిందన్నారు. ఈ పూర్తి ఎపిసోడ్‌ను సీఎంఅసెంబ్లీ సాక్షిగా తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిబిఐ విచారణ కోరుతూ అందజేయడం జరిగిందన్నారు. అవినీతి తేలితే కెసిఆర్‌ను తీహార్ జైలుకు పంపాలని, దీనిపై పూర్తి విచారణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సీఎం నివేదికను అందజేశారన్నారు. సిబిఐ విచారణ అనంతరం దోచుకున్న ప్రతి పైసా కక్కించడానికి కేంద్రం సహకరించాలన్నారు. కాంగ్రెస్ నేత సముద్రాల అజయ్, కల్వల ఆనంద్ తదితరులున్నారు.

## విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే షీ టీంకు ఫిర్యాదు చేయాలి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కు ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. బుధవారం సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. జిల్లాలో షీ టీమ్ బృందం కళాశాలలో, పాఠశాలల్లో, విద్యార్థినిలకు గుడ్ టచ్‌బ్యాడ్ టచ్/ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ మహిళ చట్టలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. గత నెలలో షీ టీమ్ కు వచ్చిన ఫిర్యాదులలో 03 ఎఫ్ఐఆర్ లు,05 పెట్టి కేసులు నమోదు చేసి మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారియెక్క తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థినులు,మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని,ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. విద్యాసంస్థలల్లోఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు, పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేస్తే వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఇసుక అందుబాటులో ఉండేందుకు చర్యలు

### ఇసుక దోపిడిని అరికట్టేందుకే ప్రభుత్వ నిర్ణయం
### ఇసుక బజార్‌ను ప్రారంభించిన మంత్రి లక్ష్మణ్‌కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేందుకు ఇసుక దోపిడిని అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వలోని ప్రజాప్రభుత్వం ఇసుక బజార్‌ను ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో ప్రభుత్వ ఖనిజాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇసుక బాజర్‌ను మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, ఎంఎల్ఎ సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ సాండ్ బజార్‌ల ద్వారా ప్రజలకు తేలికగా ఇసుక లభిస్తుందని స్టాక్ పాయింట్ల వద్ద 800 చెల్లిస్తే ఇసుక ఇంటికే వస్తుందని తెలిపారు. అదేవిధంగా ఇసుక దోపిడిని దళారీ వ్యవస్థను అరికట్టందుకు సాండ్ బజార్‌లు దోహదపడతాయని తెలిపారు. స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక తరలించడానికి లారీలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్దిదారులకు ఇసుక కొరత లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఇదివరకే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సాండ్ బజార్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని అవి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల ప్రాంతం వారు ఇసుక బజార్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో కోరుట్ల, కథలాపూర్, ఇబ్రహీంపట్నం ఏరియాలో మాత్రమే ఇసుక రీచ్‌లు ఉన్నందున జగిత్యాల ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు ఇసుక కొనుగోలు చేయడం భారంగా మారిందని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం తెలంగాణ ఖనిజాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలో మూడున్నర ఎకరాల్లో ఇసుక బజార్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు స్వంత అవసరాలకు ఇసుక ఉపయోగించుకునే వినియోగదారులు స్థానిక ఎంఆర్‌వో వద్ద రూ.800 చాలాన రూపంలో చెల్లించి ఇసుక పొందాలని తెలిపారు. రవాణా వాహనాలకు కూలీలకు అదనపు రూపాయలు వినియగదారులే చెల్లించాలని తెలిపారు. త్వరలో వెల్గటూర్ మండలంలో ఇసుక బజార్ ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మాత్రం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఉచితంగా ఇసుక లభిస్తుందని అనుమతులు లేని ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చారించారు.ఈ కార్యక్రమంలో టిజిఎండిసి జనరల్ మేనేజర్ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ బిఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూధన్, ప్రాజెక్టు అధికారి వినయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భూమి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/కొండపాక:** రైతులు భూ సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి రెవెన్యూ అధికారులను సూచించారు.బుధవారం కొండపాక మండలంలోని సమీకృత కార్యాలయ సముదాయంనీ జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించి తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి పెండింగ్ అప్లికేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.భూ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టం అమలులో ప్రజల నుంచి భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియలో అన్ని శాంక్షన్ ఇండ్లు వంద శాతం గ్రౌండింగ్ కావాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ శ్యామ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట పటిమ నేటికీ స్ఫూర్తిదాయకం

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటికీ స్ఫూర్తిదాయకమని సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ వర్దంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ రోడ్డు చౌరస్తాలో గల ఐలమ్మ విగ్రహానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర జిల్లా శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. హక్కుల కోసం ఎలుగెత్తి చాటిన సాహస వీర నారి ఐలమ్మ అని కొనియాడారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, బిసి వెల్ఫేర్ అధికారి అనిల్ ప్రకాష్, రజక సంక్షేమ సంఘాల నాయకులు కొత్తకొండ రాజయ్య, నరేష్, శ్రీనివాస్,శ్రీకాంత్, శ్రీనివాస్,సంపత్, సంపత్, శంకర్, గూడ లక్ష్మి , దేవేంద్ర తదితరులున్నారు.

## ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి





**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు అని ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోజిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని ,తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని చూపిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, రజక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**వైద్య చికిత్స నిమిత్తం కలెక్టర్ ఆర్థిక సహాయం**

వైద్య చికిత్స నిమిత్తం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 35 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో అందజేశారు. బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామానికి చెందిన ఎదురుగట్ల నాగరాజు ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లగా, అక్కడ బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం రావడంతో స్వదేశానికి తీసుకువచ్చారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఆయన వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం చేయాల్సిందిగా ఆయన భార్య లావణ్య జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను వేడుకుంది. స్పందించిన జిల్లా కలెక్టర్ వైద్య చికిత్స నిమిత్తం 35 వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును నాగరాజు భార్య లావణ్య కు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అందజేశారు.

తన భర్త వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ కు లావణ్య కృతజ్ఞతలు తెలిపింది.

## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

### కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ వర్దంతి కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలను స్మరిస్తు ప్రభుత్వం ఆమె జయంతి వర్దంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ పేరిట మహిళ విశ్వవిద్యాలయం ఏప్రిల్ 2022లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదారాబాద్‌లోని కోఠి మహిళ కళాశాలను తెలంగాణ తొలి మహిళ విశ్వవిద్యాలయంగా ప్రకటిచిందన్నారు. 2024లో వీరనారి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయంగా అవతరించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో హకీమ్, బిసి వెల్ఫేర్ అధికారిని జి.సునీత, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరన్, యాదగిరి శ్రీనివాస్‌గౌడ్, శ్యామ్‌ప్రసాద్, జిల్లా ఆడిట్ అధికారిణి , కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొని నివాళులర్పించారు.

**కోరుట:**ఐలమ్మ వర్దంతి సందర్భంగా జగిత్యాల జిల్లా కోర్లు పట్టణంలోని సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ చరిత్రలో అణగారిన ప్రతికగా నిలిచిన విప్లవ వీరనారి చాకలి ఐలమ్మ నేటి తరానికి ఆదర్శప్రాయమని సిపిఐ జిల్లా కార్యదర్శి చిన్న విశ్వనాథం , ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఆమె జరిపిన భూపోరాటం నాంది పలికిందన్నారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నేతలు చింతా భూమేశ్వర్, ఎండి ముక్రం, ఎం ఎం రాధ, పోశయ్య మహ్మద్‌అలీ తదితరులు పాల్గొన్నారు. కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు చాకలి ఐలమ్మ వర్ధంతిని స్మరించుకొని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజు కుమార్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ నడికట్ల సందీప్ మాట్లాడుతూ మొట్టమొదటి భూపోరాట వీరవనితని అగ్రకులాల ఒత్తిడిని దొరల దోపిడిని అణచివేయాలని తమ భూములను అక్రమంగా అక్రమించి ఆ భూములలో పని చేయాలని బలవంతం పెట్టెవారు, ధైర్యంతో దొరలను ఎదిరించి కమ్యూనిస్టు పార్టీలో చేరి రైతాంగ సాయుధ పోరాట చేసి భూములను పంచిపెట్టిన, ఆమె ధైర్యసాహసాలను గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### తెలంగాణ ప్రజల తెగువను

# ప్రపంచానికి చాటిన వీరనారి

### సిపిఐ పట్టణ కార్యదర్శి పంతం రవి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచానికి చాటిన వీరనారి మని చాకలి ఐలమ్మ అని సిపిఐ పట్టణ కార్యదర్శి పంతం రవి కొనియాడారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి నీ పురస్కరించుకొని సిపిఐ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రపంచానికే విప్లవ పాఠాలు నేర్పిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బాంచన్ కాల్మొ మొక్కుతా అని అనిపించుకునే వారితో బందుకు లు పట్టించిన గొప్ప చరిత్ర చాకలి ఐలమ్మది అన్నారు. ఆనాటి పోరాటంలో పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంచబడ్డాయని 4000 మంది కమ్యూనిస్టు వీరులు ఆ పోరాటంలో అసువులు భాషారని ఇంత గొప్ప పోరాట చరిత్ర కమ్యూనిస్టు పార్టీలకు మాత్రమే ఉందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో స్వాతంత్ర పోరాటంలో కానీ తెలంగాణ రైతాంగ సాహిత పోరాటంలో గాని ఎటువంటి పాత్ర లేని బిజెపి ఆర్ఎస్ఎస్ లాంటి మతోన్మాద పార్టీలు సిగ్గు లేకుండా ఆ పోరాటాలను వక్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మతోన్మాదులు చేస్తున్న ఈ ప్రయత్నాలను అడ్డుకోవడమే చాకలి ఐలమ్మకు ఇచ్చే ఘన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో కడారి రాములు, సోమ నాగరాజు, కూర రాకేష్, అజ్జ వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డికి ప్రతిష్మాత్మక అవార్డు



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రముఖ సంస్థ ఇండియన్ స్కూల్ అవార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారిచే ప్రతిష్టాత్మక అవుట్ స్టాండింగ్ ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేటర్ అవార్డును అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి అందుకున్నారు. ఈ సంధర్భంగా స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో ప్రత్యేక అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా అల్ఫోర్స్ విద్యాసంస్థలు చాలా విశిష్టంగా ఉత్తమంగా విద్యారంగ అభివృద్ధికై సేవలను అందించడమే కాకుండా ఎంతో మంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతోందన్నారు. ప్రతిష్టాత్మకమైన ఐఐటిలలో, ఐఐఎంలలో, ఎన్ఐటిలలో, ఎయిమ్స్‌లలో ప్రఖ్యాత మెడికల్ కళాశాలలో, సివిల్ సర్వీసెస్‌లో సీట్లు సాధిస్తున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల పాత్ర అత్యుత్తమమైనదని, ప్రధానంగా విద్యా రంగం, క్రీడారంగంలో అగ్రగామిగా ఉండడమే కాకుండా విధ్యార్థుల్లో చైతన్యాన్ని నింపుతూ పలు విజయాలకు వేదిక అవుతున్నదని హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు అల్ఫోర్స్ విద్యాసంస్థలకు అనేక అంతర్జాతీయ, జాతీయ స్థాయి పురస్కారాలు రావడం, విద్యావిధానానికి ఒక గొప్ప ప్రశంసాన్ని గుర్తు చేస్తూ ఢిల్లీకి చెందిన ప్రముఖ సంస్థ ఇండియన్ స్కూల్ ఆఫ్ అవార్డ్స్ హైదరాబాదులో సంయుక్తంగా ప్రదానం చేయడం జరిగిందన్నారు. అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఆయనకు అవార్డు రావడం పట్ల జిల్లాలోని పలు విద్యాసంస్థల యాజమాన్యాలు, విధ్యార్థి సంఘాల నాయకులు, స్వచ్చంద సంస్థల ప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిషులు, విద్యాసంస్థల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.

## కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడేది ఎఐటియుసి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఏరియా వర్క్ షాప్ లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు ఏఐటియుసి లో చేరారు. బుధవారం ఏఐటియుసి ఏరియా వర్క్ షాప్ డిపార్ట్మెంట్ కార్యదర్శి బలుసు రవి ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమం లో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి కామ్రేడ్ ఆరెల్లి పోషం లు పాల్గొని వారికి ఏఐటియుసి కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి లో ఏఐటియుసి యూనియన్ చరిత్ర కలిగిన యూనియన్ అని, కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడేది ఏఐటియుసి మాత్రమే నని వారు పేర్కొన్నారు. కొన్ని యూనియన్ లు, మా వ్యతిరేకులు ఏఐటియుసి కార్మికుల కు చేసిన సేవలను ఓర్వలేక మారుపేర్లు, విజిలెన్స్ కేసుల బాధితుల సమస్య ను అడ్డం పెట్టుకొని ఏఐటియుసి ఆఫీస్ ముందు ధర్నాలు చేయించి పబ్బం గడుపుకుంటున్నారని వారు ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న పాలక ప్రభుత్వ యూనియన్ లకు వ్యతిరేకంగా పోరాటాలు చేయకుండా నిరంతరం కార్మిక వర్గ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న ఏఐటియుసి పై అనవసరపు విమర్శలు చేయడం మానుకోవాలని వారు హితవు పలికారు. ఎఐటియుసిలో చేరిన ఉద్యోగులను వారు అభినందించారు. ఏఐటియుసిలో చేరిన వారిలో ఎలక్ట్రీషియన్‌లు రవి కుమార్, మాతంగి రాంచందర్, శ్యాంసుందర్, శ్రీనివాస రెడ్డి, రమేశ్, రాజనర్స్, ఫిట్టర్‌లు హుస్సేన్ ఇస్మాయిల్, కత్తెరసాల, వెల్డర్‌లు సాయి చరణ్, టి.శ్రీనివాస్, జనరల్ అసిస్టెంట్ ఏ.అంజయ్య లు ఉన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సాయన్న, బి.శ్రీరాములు, ప్రభుదాస్, అనిల్, అంజయ్య, రాజాలు, శ్రీనివాస్, రాజు,తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు

**ప్రజాపక్షం/కొండపాక:** సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు లభించాయి.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతిగా తీసుకుంటున్న సంక్షేమ చర్యల్లో భాగంగా 26 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, బీసీ జిల్లా అధ్యక్షుడు అయిలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దూరదృష్టి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి నర్సారెడ్డి చొరవతో పేద కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు.ఈ కార్యక్రమంలో అండలమ్మ, నాగపురి సుజాత, గోవింగ్ యాదగిరి, చిన్న స్వామి,కిష్టయ్య,పాల్గొన్నారు.

# రీల్

## చిరంజీవితో విజయ్ సేతుపతి భేటీ



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మన శివశంకర వరప్రసాద్ గారు సినిమా షూటింగ్ పక్కన్నే పూరి జగన్నాథ్ విజయ్ సేతుపతి సినిమా షూటింగ్ కూడా జరుగుతోంది. రెండు షూటింగ్‌లు పక్క పక్కనే జరుగుతున్న నేపథ్యంలో పూరి జగన్నాథ్, తమిళ నటుడు విజయ్ సేతుపతి కలసి చిరంజీవి షూటింగ్ సెట్ కు వెళ్లారు. చిరంజీవిని కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. ప్రస్తుతం పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతి కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో చిత్రీకరిస్తున్నారు. విజయ్ సేతుపతి సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. టబు కీలకమైన పాత్రలో కనిపించనుంది. ఈ టీమ్ అంత కలసి చిరంజీవితో ఇలా ఫోటోలు దిగారు.

## మెగా ఫ్యామిలీలో పుత్రోత్సవం



మెగా ఫ్యామిలిలో పుత్రోత్సవం కలిగింది. ప్రేమించి, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులకు పండంటి మెగా బిడ్డ పుట్టారు. అప్పుడే పుట్టిన బిడ్డను ఎత్తుకున్న చిరంజీవి తెగ మురిసిపోయారు. దీంతో మెగా ఫ్యామిలిలో సంబరాలు చేసుకుంటున్నారు.

## 'లిటిల్ హార్ట్స్' సినిమాతో డిఒపిగా మంచి గుర్తింపు



సినిమాటోగ్రాఫర్ సూర్య బాలాజీ మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన 'లిటిల్ హా లిటిల్ హార్ట్స్' సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు సూర్య బాలాజీ ఈ చిత్రంతో సినిమాటోగ్రాఫర్ గా పరిచయమయ్యారు. తన తొలి చిత్రంతోనే ప్రేక్షకుల్ని కెమెరా పనితనంతో ఆకట్టుకున్నారు. డిఒపి పనితనం మీదే సినిమా బడ్జెట్ ఆధార పడి ఉంటుంది. లిటిల్ హారట్స్ చిత్రాన్నిలో బడ్జెట్ లో రిచ్ లుక్ వచ్చేలా చేయడంలో సూర్య బాలాజీ ప్రతిభ చూపించారు. 2.5 కోట్ల రూపాయల బడ్జెట్ లో చేసిన లిటిల్ హారస్ట్ సినిమా తెరపై చూస్తే ఓ పది కోట్ల రూపాయల బడ్జెట్ మూవీలా అనిపిస్తుంది. అలాంటి రిచ్ లుక్ తన కెమెరా పనితనంతో తీసుకొచ్చారు సూర్య బాలాజీ. హైదరాబాద్, బెంగళూరులో ఈ సినిమాను గెరిల్లా పద్ధతిలో షూట్ చేశారు. లొకేషన్స్ ను కాకుండా కేవలం నటీనటుల క్లోజప్స్ తోనే ఎలివేట్ చేశారు. ప్రతి సీన్ సహజంగా ఉండేలా క్యాప్చర్ చేశారు. లిటిల్ హారట్స్ మూవీని చాలా రియలెస్టిక్ గా తన కెమెరా లెన్స్ లో చూపించారు. లిటిల్ హారట్స్ సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా హ్యాపీగా ఉందని, బీ, సీ సెంటర్స్ లో కూడా థియేటర్స్ హౌస్ ఫుల్స్ కావడం నమ్మలేకపోతున్నామని సూర్య బాలాజీ అంటున్నారు. ఈ చిత్రానికి తనకు ఆశించిన దానికంటే ఎక్కువ గుర్తింపు రావడం హ్యాపీగా ఉందన్నారు. కంప్లీట్ కమర్షియల్ గా కాకుండా, కంప్లీట్ రియలెస్టిక్ గా కాకుండా ప్రేక్షకుల్ని ఆకట్టుకునే ఒక డైలాగ్ బేస్డ్ హౌస్ సమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ను దర్శకుడు సాయి మార్తాండ రూపొందించినట్లు సూర్య బాలాజీ చెప్పారు.

## రెండో వారంలో 'సంబరాల ఏటిగట్టు' తదుపరి షెడ్యూల్

సాయి దుర్గ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'' రోహిత్ కెపి దర్శకత్వంలో ప్రైమ్‌షో ఎంటర్టైన్‌మెంట్ బ్యానర్‌పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ చిత్రం 125 కోట్ల బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సాయి దుర్గ తేజ్ కెరీర్‌లో తొలి భారీ బడ్జెట్ సినిమా ఇది. సెప్టెంబర్ రెండోవారంలో తదుపరి షెడ్యూల్ ప్రారంభం కానుంది. యాక్షన్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్ కొరియోగ్రఫీ చేసిన అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించనున్నారు. సాయి దుర్గ తేజ్ గత రెండు సంవత్సరాలుగా ' సంబరాల ఏటి గట్టు' కోసం పని చేస్తున్నారు. నిజానికి ఈ సినిమాను ఈ దసరాకు విడుదల చేయాలనుకున్నారు కానీ కార్మికుల సమ్మె కారణంగా విడుదల తేదీని వాయిదా వేశారు.
ఈ సినిమా విడుదల ఎప్పుడు అనేది త్వరలోనే ప్రకటిస్తారు. 'హనుమాన్' బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఈ సినిమా నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానున్న 'సంబరాల యేటి గట్టు' సినిమాను పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కిస్తున్నారు.



## 3డి యానిమేషన్ చిత్రం 'వాయుపుత్ర'




మన చరిత్ర , ఇతిహాసాలలో వాయుపుత్రుడు హనుమంతుడు ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారు. సప్త చిరంజీవులలో ఒకరైన హనుమంతుడు తన బలం, భక్తితో కాలాన్ని అధిగమించిన శాశ్వత యోధుడు. అలాంటి గొప్ప యోధుడి కథతో 'వాయుపుత్ర' చిత్రం రూపొందుతోంది. ఇది పర్వతాలను కదిలించిన భక్తి కథ కూడా. ఇది తరాలను తీర్చిదిద్దిన, ప్రేరేపించిన హనుమంతుడి అచంచల విశ్వాసాన్ని సంగ్రహిస్తుంది.చందూ మొండేటి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సంస్థలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీకర ప్రొడక్షన్స్ సమర్పకులు గా వ్యవహరిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈ చిత్రం చరిత్ర, భక్తి, ఆధునిక దృశ్యాలతో ఉత్కంఠభరితంగా ఉంటుంది. భారీస్థాయిలో 3డీ యానిమేషన్ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న 'వాయుపుత్ర', హనుమంతుని కాలాతీత కథను గొప్ప దృశ్యకావ్యంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. 2026 దసరాకు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం కన్నడ భాషలలో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. హనుమంతుడు కొండపై నిలబడి, దహనమవుతున్న లంకను చూస్తున్న శక్తివంతమైన పోస్టర్. ఇది కేవలం సినిమా కాదు, థియేటర్లను దేవాలయాలుగా మార్చే పవిత్ర దృశ్యం. మునుపెన్నడూ లేని విధంగా భక్తి పారవశ్యంలో ముంచేయడానికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది అని నిర్మాత సూర్యదేవర నాగ వంశీ చెప్పారు. కథకుడిగా చందూ మొండేటి దర్శనికత, నిర్మాతగా నాగ వంశీ నైపుణ్యంతో 'వాయుపుత్ర'తెరకెక్కిస్తున్నారు. సిద్ధంగా ఉంది. 3డి యానిమేషన్ విజువల్స్‌తో జనాన్ని రంజింపచేయనున్నారు.

## 'కలలే కలలే' పాట విడుదల



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ' కేర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. ' కేర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న విడుదల కానుంది. ' కేర్యాంప్' సినిమా నుంచి మ్యాజికల్ లవ్ సాంగ్ 'కలలే కలలే' రిలీజ్ చేశారు. ఈ పాటను చైతన్య భరద్వాజ్ క్లాసీ ట్యూన్ తో కంపోజ్ చేయగా, కపిల్ కపిలన్ అందంగా పాడారు, భాస్కరభట్ల క్యాచీ లిరిక్స్ అందించారు. ' కలలే కలలే కనులకు నువు కనబడి కలలే, కథలే మొదలే వివరములే తెలియాలే, నా గుండెకేదో కబురే నీ వల్లే అందిందే, నీ చుట్టు చుట్టు తిరిగేలా చేసిందే, నాతోటి ఉండే మనసే నా మాటే వినకుందే, నీతోటి జట్టే కడుతోందే కడుతోందే, అందాల మాయ కళ్లే కాదా, ఊసులేవో నాలో పూసగుచ్చేలా నన్నే అద్దంలో చూస్తుంటే నిన్నే చూపిస్తోందే, రోజంతా అద్దంతో ఇబ్బందే, యే నీ గుండే నాలోనే అందంగా దాక్కుందే, నాక్కొంచెం చోటైనా లేకుందే..' అంటూ మంచి లవ్ ఫీల్ తో సాగుతుంది. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్నారు.

## గవర్నర్ కట్టుబడాలి

**(మొదటి పేజీ తరువాయి)**

తన వాదనలు వినిపించారు. రాష్ట్రపతి సూచనకు సమాధానం ఇస్తూనే బిల్లుపై విచారణను జరపడం ద్వారా ప్రభుత్వం స్వాభావిక పక్షపాతాన్ని కూడా సుప్రీంకోర్టు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన తమిళనాడు గురించి ప్రస్తావించారు. తమిళనాడులో గవర్నర్‌ను ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఛాన్స్‌లర్ పదవి నుంచి తొలగించాలని శాసనసభ ఆమోదించిన బిల్లును ప్రభుత్వం ప్రస్తావించిన సందర్భంలో రాష్ట్రపతి సూచనపై 9వ రోజు విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కోర్టు దానిని పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, విక్రమ్‌నాథ్ పిఎస్.నరసింహ, ఎఎస్. చందుర్కర్‌లు కూడా ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మాసనం ముందు సీనియర్ అడ్వకేట్ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టికల్ 200 కింద రెండవ నిబంధన వాస్తవానికి గవర్నర్‌కు ఎటువంటి విచక్షణ ఉండదని, మంత్రి మండలి సహాయం, సలహాకు కట్టుబడి ఉంటారనే వాస్తవాలను సూచిస్తుందని నిరంజన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు సంబంధించి గవర్నర్ల అధికారాలను ఆర్టికల్ 200నియంత్రిస్తుంది. వారు బిల్లును అంగీకరించడానికి, సమ్మతిని నిలిపివేయడానికి, బిల్లును పున: పరిశీలన కోసం తిరిగి ఇవ్వడానికి లేదా బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసం రిజర్వ్ చేయడానికి వీలు కల్పిస్తుంది. విచారణ కొనసాగుతోంది. గవర్నర్ వివాదంపై తమిళనాడు కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా రాష్ట్రపతి సూచనను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షపాలిత రాష్ట్రాల వాదనలు బుధవారం నాడు ముగిసే అవకాశం ఉంది. ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలిపే అధికారాలను నియంత్రించే ఆర్టికల్ 200లో 'సాధ్యమైనంత త్వరగా' అనే పదం లేకపోయినా గవర్నర్లు 'సహేతుకమైన సమయంలో' వ్యవహరించాలని మంగళవారం సుప్రీంకోర్టు పేర్కొంది.

## ఖైదీల సంస్కరణ మనందరి సామాజిక బాధ్యత

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జైళ్లు నిరాశకు కేంద్రాలుగా కాకుండా, ఆశలు, ఆకాంక్షలకు చిహ్నాలుగా మారాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. 'ఏడో ఆలిండియా ప్రిజన్ డ్యూటీ మీట్ 2025' సందర్భంగా ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీసు అకాడమీలో బుధవారం ఏర్పాటు చేసిన 'కల్చరల్ నైట్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జైళ్లను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా, వాటిని మానవత్వంతో కూడిన సంస్కరణలకు వేదికలుగా తీర్చి దిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకొచ్చేందుకు తెలంగాణ జైళ్ల శాఖ చేపట్టిన కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచాయని కొనియాడారు. 'జైళ్ల గోడల మధ్య భారతదేశపు భిన్నత్వం కనిపిస్తుంది. వివిధ రాష్ట్రాలు, భాషలు, మతాలు, సంస్కృతులకు చెందిన ఖైదీలు ఉంటారు. వీరికి ఒకే రకమైన సంస్కరణ విధానం సరిపోదు. అందుకే వారి వ్యక్తిగత పరిస్థితులను అర్థం చేసుకొని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి' అని అధికారులకు సూచించారు. జైళ్లను సాంకేతికతతో అనుసంధానించి ఖైదీలకు డిజిటల్ విద్య, నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పునరావాస కార్యక్రమాలు, ఖైదీల ఆరోగ్యం, మానసిక స్థితిని పర్యవేక్షించడానికి కూడా టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవడంపై దృష్టి సారించామన్నారు. ఖైదీల్లో సంస్కరణ అనేది కేవలం జైళ్ల శాఖ బాధ్యత మాత్రమే కాదని, అది మనందరి సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

## నేపాల్‌లో ఆర్మీ నిషేధాజ్ఞలు

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రకటించింది. ఇదిలా ఉండగా నేపాల్‌లో ఇలాంటి పరిణామాలు సంభవించడానికి గల కారణాలున ఏమిటో లోతుగా దర్యాప్తు చేయాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ కోరారు. ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి రాజీనామా తర్వాత వేలాదిమంది విద్యార్థులు, జనరేషన్ జెడ్ ఉద్యమ యువకులు అంతకుముందు మంగళవారం అర్థరాత్రి దాటేవరకూ ఖాట్మండు వీధుల్లో ఆనందోత్సాహాలను పంచుకుంటూ కేరింతలు కొట్టారు. సైన్యం పూర్తిగా రంగంలోకి దిగి దేశమంతటా నిషేధాజ్ఞలు అమలులోకి తీసుకువచ్చింది. అన్ని ప్రాంతాలలో గట్టి గస్తీ కార్యకలాపాలు చేపట్టింది. పదవీత్యాగం చేసిన ఓలి రాజకీయ సంక్షోభం ముగిసేవరకూ దేశాన్ని కనిపెట్టుకుని ఉండాలని ఉన్నతస్థాయి సైనికాధికారులకు ఆదేశాలు ఇచ్చారని మంగళవారంనాడే వార్తలు వెలువడ్డాయి. విద్యార్థులు మంత్రులపైన భౌతిక దాడులు చేస్తూ వారి ప్రైవేటు నివాసాలను దగ్ధం చేయడంతో అధికారపక్ష కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళిపోయియి. ఆవేశంతో ఆందోళనకారులు మంత్రుల ఇళ్ళు దగ్ధం చేసినప్పుడు మాజీ ప్రధానమంత్రి షేర్ బహదూర్ దేవ్‌బా ఇంటిని కూడా దగ్ధం చేశారు. ఆ సమయంలో ఆయన భార్య అర్జు దేవ్‌బా ఆందోళనకారులు దాడి చేశారు. ఆర్థికమంత్రి బిష్ణుప్రసాద్‌ను వీధుల్లో తరిమికొట్టి ఎగిరి కాలితో తన్ని దృశ్యాలన్నీ వీడియోల ద్వారా వైరల్ అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కె.పి.శర్మ ఓలి దుబాయ్ పారిపోయారని వదంతులు వచ్చాయి. కానీ సైన్యాధికారులు ఆయనను ప్రధాన సైనిక కేంద్ర కార్యాలయానికి తరలించారు. ఆ తర్వాత నుండి ఆయన జాడ ప్రపంచానికి తెలియలేదు. మరోవైపు నేపాల్‌లో రెండు ప్రధాన విమానాశ్రయాల నుండి విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. సుప్రీంకోర్టు కూడా తదుపరి ప్రకటన వెలువడేవరకూ కేసుల విచారణ చేపట్టేదిలేదని ప్రకటించింది. సుప్రీంకోర్టు భవనాలపైన, జైళ్ళపైన కూడా ఆందోళనకారులు దాడులు చేశారని ఇంతకుముందే వార్తలు వెలువడ్డాయి. మంత్రివర్గం రద్దుకావడంతో తర్వాత రాజకీయ భవితవ్యం ఏమిటనే విషయంలో తీవ్ర గందరగోళం, అనిశ్చితి నెలకుంది.

**జనరేషన్ జెడ్ ఉద్యమం వెనుక....**

నేపాల్‌లో రాజకీయపార్టీల నాయకులు, సంపన్నుల కుటుంబీకులు అవినీతి సొమ్ముతో విలాసాలు చేస్తున్నారని, సోషల్ మీడియాపై నిషేధం కాకుండా అవినీతిని అరికట్టాలని కొద్దిరోజులుగా నేపాల్‌లో విస్తారంగా ప్రచారం ఊపు అందుకుంది. దీనిని ప్రభుత్వ వ్యతిరేక దుష్ప్రచారంగా ఓలి ప్రభుత్వం పేర్కొంది. ఐతే జనరేషన్ జెడ్ మూమెంట్ (జిజెడ్‌ఎం)ను దేశంలో ప్రధానంగా నడిపించిన సుదన్ గురుంగ్ (36) పేరు ఇప్పుడు నేపాల్‌లో ప్రముఖంగా వినిస్తోంది. ''హమీ నేపాల్'' పేరుతో ఆయన ఒక ఎన్‌జిఓ సంస్థ నడుపుతూ ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. చాలా నెలలుగా సోషల్ మీడియా ప్రచారం ద్వారా ఈ ఉద్యమాన్ని దాదాపు ఆయనే ఈనాడు ఈ స్థితికి తెచ్చారు. 2015లో నేపాల్‌లో భూకంపం వచ్చినప్పుడు కుటుంబాన్ని సర్వస్వాన్ని కోల్పోయిన గురుంగ్ ఆ తర్వాత ఒక ప్రభుత్వేతర స్వచ్ఛంధసంస్థ స్థాపించి సేవాకార్యక్రమాల పేరుతో తెరమీదకు వచ్చారు.

**సుశీల కర్కీని ప్రధానమంత్రిని చెయ్యండి**

నేపాల్ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కిని తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమించాలని జనరేషన్ జెడ్ మూమెంట్ డిమాండ్ చేసింది. రాబోయేకాలంలో జరిగే చర్చలకు వీలుగా ఆయన ప్రధానమంత్రిగా నియమితులైతే చర్చలు ఫలవంతంగా ఉంటాయని జనరేషన్ జెడ్ మూమెంట్ పేర్కొంది. రాజకీయ పార్టీలతో యువకులు ఎవ్వరూ చర్చలు జరిపేదిలేదని, కర్కీ ఒక తటస్థమైన వ్యక్తిగా, మచ్చలేని వ్యక్తిగా పేరుపడినందువల్ల ఆయనను తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమించాలని జిజెడ్‌ఎం కోరింది.

## ఉద్యమ నేత సురవరం

**(మొదటి పేజీ తరువాయి)**



కమ్యూనిస్టులు చేసిన పోరాటంలో తాను ఎప్పుడు సంఘీభావం తెలిపానన్నారు.

**నల్లగొండలో సురవరం విగ్రహ ఏర్పాటుకు కృషి :మంత్రి కోమటిరెడ్డి**

దేశంలో కార్మికుల, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్లో తన తన గళాన్ని విప్పిన గొప్ప కమ్యూనిస్టు మేధావి సురవరం సుధాకర్ రెడ్డి అని తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కామ్రేడ్ అంటే వంద మందితో సమానమని ఒక్కడు ఉన్నా ఎర్రజెండాతో అన్యాయాన్ని ప్రశ్నిస్తారని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు అంటే తనకు ఎంతో గౌరవం అని వారు చేసే పోరాటం.. ఆరాటం ఎప్పటికీ పదవుల కోసం కాదని పేద ప్రజల కోసమేనని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి నలగొండ జిల్లాకు చేసిన సేవలను గుర్తిస్తూ జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహం నెలకొల్పడంతో పాటు ఓ మంచి కార్యక్రమానికి పేరు పెట్టేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**ప్రజా ఉద్యమ దిక్సూచి సురవరం :కూనంనేని**

ప్రజా జీవితంలో ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించి చారిత్రిక ఉద్యమ విజయాలను చవిచూ సిన సురవరం సుధాకర్ రెడ్డి ప్రజా ఉద్యమ దిక్సూచి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. విద్యార్థి దశ నుంచే ధిక్కార స్వరంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన సురవరం అంచలంచెలుగా ఎదిగి కమ్యూనిస్టు పార్టీలో అత్యున్నత స్థాయికి చేరారని ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని ఆయన స్ఫూర్తి భవిష్యత్తు ఉద్యమానికి ప్రేరణ అని ఆయన తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి నిరంతర అధ్యయనశీలి అని అన్నారు. తన వాదన పటిమతో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. కమ్యూనిస్టులు మరణించి సైతం ప్రజల మదిలో జీవిస్తారని సుధాకర్‌రెడ్డి అదే కోవకు చెందిన వారన్నారు.

**సుధాకర్ రెడ్డి జీవితం తెరిచిన పుస్తకం : పల్లా వెంకటరెడ్డి**

సువరం సుధాకర్ రెడ్డి జీవితం మొత్తం తెరిచిన పుస్తకమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి అన్నారు. సురవరం ఓ ఆదర్శవంతుడు, మేధావులలో మేధావి, సామాన్య కార్యకర్తల్లో ఓ కార్యకర్తగా ప్రతి ఒక్కరితో కలిసిపోయే మానవతావాది అని కొనియాడారు. నల్లగొండ పార్లమెంట్ సభ్యులుగా ఆయన అనేక కుంభకోణాలను వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. దేశవ్యాప్తంగా జాతీ య ఉపాధి హామీ పథకం రూపకల్పనలో సురవరం సుధాకర్రెడ్డి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా సుధాకర్ రెడ్డి ఎంపిగా పనిచేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఐ మహాసభలు నిర్వహించడం జరిగిందని అదేవిధంగా సిపిఐ 100సంవత్సరాల ప్రారంభోత్సవ సభ నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన సభకు సురవరం సుధాకర్‌రెడ్డి పాల్గొని ఉత్తేజపరిచిన ప్రసంగాన్ని ప్రజలు మర్చిపోలేరని గుర్తు చేశారు.

**సురవరం గొప్ప కమ్యూనిస్టు మేధావి : జూలకంటి రంగారెడ్డి**

కమ్యూనిస్టు మేధావులలో తెలుగు తేజం సురవరం సుధాకర్ రెడ్డి ఒక్కరిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. దేశ ప్రజలు సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండాలని దోపిడీ లేని సమసమాజ స్థాపన కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ఎర్రజెండాలు కలిసి ఐక్య ఉద్యమాలు నడిపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**పేద ప్రజల కోసం ప్రశ్నించిన గొంతుక సురవరం : నెల్లికంటి**

పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం ప్రశ్నించే గొంతుక సురవరం సుధాకర్ రెడ్డి మరణం అన్ని వర్గాల ప్రజలకు తీరంలోటని అన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌సి నెల్లికం టి సత్యం అన్నారు. తెలంగాణ రైతంగ సాయుధ పోరాట కుటుంబం నుంచి వచ్చిన సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి యువజన కమ్యూనిస్టు ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు నల్లగొండ జిల్లాలో సాగుతాగునీరు కోసం పాదయాత్ర నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీసిన ఉద్యమ నాయకుడని కొనియాడారు.

**ప్రశ్నించే తత్వం కమ్యూనిస్టులదే:ఎంఎల్‌సి శంకర్ నాయక్**

ప్రశ్నించడం కమ్యూనిస్టుల ద్వారా నేర్చుకోవాలని నల్లగొండ పార్లమెంట్ సభ్యులుగా సురవరం సుధాకర్ రెడ్డి జిల్లా సమస్యలపై పార్లమెంట్ లో ప్రభుత్వాలకు ప్రశ్నల వర్షం కురిపించిన గొప్ప మేధావి అని డిసిసి అధ్యక్షులు,ఎంఎల్‌సి శంకర్ నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాటంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందని కమ్యూనిస్టుల డిమాండ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పుకొచ్చారు.

కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి ఉజ్జిని రత్నాకర్ రావు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, సహాయ కార్యదర్శిలు పల్లా దేవేందర్ రెడ్డి లోడింగ్ శ్రవణ్ కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాస్ పల్లె నరసింహ, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉజ్జిని యాదగిరి రావు పబ్బు వీరస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు బోల్గురి నరసింహ, తిర్పారి వెంకటేశ్వర్లు, ఆర్ అంజ చారి, తూము బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com